# రామాయణ సారస్వత దర్శనము

48858




కవితాకోవిద, సాహిత్యభూషణ : అల్లంసెట్టి అప్పయ్య

# రామాయణ సారస్వత దర్శనము

రచయిత :
కవితాకోవిద, సాహిత్యభూషణ
కీ॥ శే॥ అల్లంసెట్టి అప్పయ్య

✳

తిరుమల తిరుపతి దేవస్థానములవారి
ఆర్థిక సహాయముతో
ముద్రితము

✳

ఆదర్శ కళా మందిరం
పొందూరు
1995

# Ramayana Saraswatha Darsanamu

*by Allamsetty Appayya*


First Edition : 1995

Copies : 1000



Rights : **A. Rajeswaramma**
(W/o The Writer)



This book is published with the
Financial assistance of the
Tirumala Tirupathi Devasthanams
under their scheme
"Aid to Publish Religious Books"

Price : Rs. 35-00



SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No. 48858
Date............



Cover Design : T. V. R. SASTRY

*For Copies :* **A. C. RAO**
5-6-14/3, Punyapu Street,
SRIKAKULAM - 532 001

**A. Rajeswaramma**
Aadarsa Kala Mandiram
Madugula Street, PONDURU - 532 168

Printed at : Sri Saibaba Printers - Srikakulam.

# ఒక మాట

నిరాశ్రయా న శోభంతే
కవితా వనితా లతాః

ఆశ్రయించడం అతని తత్త్వం కాదు. ముఖస్తుతులు చేతగావు. పారితోషికంగా పత్రికలవాళ్లు పంపించిన మనియార్డర్లు తిరగ్గొట్టే స్వాభిమానం. బిరుదులు మోసుకొచ్చారు గాని ఒక్క దుశ్శాలువ గూడ భుజంపై వేసుకొని యింటికి రాలేదు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలముందు అధికారంగాని, ధనంగాని లెక్కలోకి రావు. అందుచేతనే 1960 దశకంలో రాసిన గ్రంథాలు అనేకం యీనాటి వరకూ అచ్చుకు నోచుకోలేకపోయాయి.

1960–70 మధ్యకాలంలో రాసిన గ్రంథాలలో ఒక్క "సౌభాగ్యలక్ష్మీస్తవ రాజము" తప్పిస్తే, చెప్పుకోదగ్గ పద్య గ్రంథాలు లేవు. చిన్నప్పటి నుండి కవిత్వం రాసిన ఆయన పాండిత్య పరాకాష్ఠతో వచన రచన చేసారు. చదువు వ్యసనమైపోయింది. పగలంతా చుట్ట కాలుస్తూ చదువు, గుండెలకు పట్టించుకొని రాత్రంతా రాస్తుండేవారు. దాని ఫలితమే ఈ రామాయణ సారస్వత దర్శనమూ, మరో నాలుగు గ్రంథాలు.

1970లో మా నాన్నగారు చనిపోయేనాటికి ప్రొబేషన్ గూడ పూర్తికాని ఉద్యోగిని. ఆర్థికమైన యిబ్బందులవల్ల, ఉద్యోగరీత్యా వివిధ ప్రదేశాలలో ఉండడం వల్ల, వారి రచనలను అచ్చు వేయించే అవకాశం యీనాటి వరకూ కలుగలేదు. మొదటి ప్రయత్నంగా, ఈ రామాయణ సారస్వత దర్శనము వ్రాతప్రతిని తిరుమల తిరుపతి దేవస్థానంవారికి పంపుతూ వారి ఆర్థిక సహాయం కోరడమైనది: వారు దయతో గ్రంథం అచ్చు వేయించుకోవడానికి కావలసిన ఆర్థిక సహాయం అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసారు. దీనితో మా నాన్నగారి వాంఛితం నెఱవేర్చే అవకాశం నాకు కలిగింది.

51వ పేజీలోని పంచవటీ తీరమునకు సంబంధించిన విషయం– రచయిత రాసుకున్న నోట్సు నుండి ప్రచురించడం జరిగింది. కవి హృదయం యేమిటో తెలియదు. విజ్ఞులు పరిశీలించగలరు.

రామాయణ సారస్వత దర్శనము ఆకృతి ధరించడానికై సహాయపడిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. ముఖ్యంగా చిత్తు ప్రతిని చూసి సాపు ప్రతిని తయారుచేసిన మా లింగరాజు మామయ్యకు, సాధు పాఠాలు నిర్ణయించి ప్రూఫులు చూచిన మిత్రులు రామానుజమ్మగారికి, ముఖ పత్ర రచన చేసిన కళాకారులు మిత్రులు శ్రీ టి. వి. ఆర్. శాస్త్రిగారికి, చక్కగా అచ్చువేసిన శ్రీ సాయిబాబా ప్రింటర్స్‌వారికి కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. ఈ గ్రంథంపై తమ అమూల్యాభిప్రాయాలిచ్చిన మా నాన్నగారి సాహితీ సహచరులకు కృతజ్ఞతలు.

అన్నిటికంటే ముఖ్యమైనది డబ్బు. అదిలేనిదే ఎవరూ అచ్చువేయించుకోలేరుకదా! ఈ గ్రంథం అచ్చు వేయించుకోడానికి కావలసిన ఆర్థిక సహాయం చేసిన తిరుమల తిరుపతి దేవస్థానంవారికి సర్వదా కృతజ్ఞుడను.

శ్రీకాకుళం
యువ చైత్ర శుద్ధ నవమి
( 9-4-95 )

చంద్రశేఖరరావు

# స్మృతి

సాహిత్యం వ్యసనంగా చిన్ననాడే పరిణమించిందని నాబోటిగాడెవరైనా అంటే ఈ యుగంలో యువకులు నమ్మకపోవచ్చు. కాని, ఆ రోజులు అలాంటివి. స్వాతంత్ర్యం రావడానికి ముందు రోజుల్లో అన్ని వ్యాసంగాలు ఉద్యమాలే. ఆవేశంగా ఉద్యమాలలోకి ఆకర్షితులవడం యువత లక్షణం. బాల్యానికైతే చాపల్యం.

నా చిన్ననాడు అరుదుగా దొరికేవి పత్రికలు. పత్రికలంటే అపురూపమని దాచుకుని మరీ చదివే కాయితాలు. అచ్చులో కనిపించే ప్రతి అక్షరం కళ్లు మిరుమిట్లు గొలిపేది. భారతులు, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు, తాపీ ధర్మారావుగారి సమదర్శినులు, జీ యస్ శాస్త్ర కళ్యాణులు, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రికలు, ఇవన్నీ సాహిత్యోద్యానంలో విరబూసిన పూల మొక్కలు. అందులో కన్పించే రచయితలు-గొప్ప వేత్తలుగా, వైతాళికులుగా, మహాకవులుగా కన్పించేవారు.

అందరిలాగే ఈ ప్రాంతం అంటే, ఒక మమకారం, గర్వంతో కూడిన తృప్తి నాకూ ఉండేవి. నిజానికి మదరాసు నుంచి రాసే శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రి, నెల్లూరు నుంచి రాసే దువ్వూరి రామిరెడ్డి, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి, బళ్ళారి సరిహద్దు నుంచి రాసే బూదూరి రామానుజులరెడ్డి ఎంత ఆకర్షించేవారో, ఒంగోలు నుంచి శివశంకరస్వామి, రేపల్లె నుంచి నోరి నరసింహ శాస్త్రి, కాకినాడ ప్రాంతాల నుంచి కృష్ణశాస్త్రి, అంతే ఆకర్షించినా- ఉత్తరాంధ్ర సంగతే వేరు. ఈ ప్రాంతం రచయితల గళం తెలుగునేల నాలుగు చెరగులా శంఖారావంలా ఖంగుమని విన్పించే రోజులవి. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలాంటి పండితుల పత్రిక మొదలు, కృష్ణా పత్రిక వరకు వీరి రచనలు వెల్లువలా తెలుగుజనాన్ని ముంచెత్తేవి. బరంపురం నుంచి (వేగుచుక్క గ్రంధమాల ప్రారంభమై తెలుగువారిని నిద్రలేపింది) ఉప్పల లక్ష్మణరావు, దేవరాజు వెంకటకృష్ణారావు, తాపీ ధర్మారావు వంటి నవయుగ వైతాళికులు, గిడుగు రామమూర్తి వంటి సంస్కర్తలు, పారనంది జగన్నాథస్వామి వంటి ఉద్దండపిండాలు పర్లాకిమిడి నుంచీ తెలుగువారి కన్నుల్లోంచి చెవుల్లోంచి దూసుకొని మెదడులో ప్రవేశించి అలజడి లేపేవారు.

ఆ యుగం జోరు తగ్గుతున్నా ఆ వేడినీ వాడినీ వేగం తగ్గకుండా కొందరూ, తెలుగుదనంలో అందచందాల్ని పోడిమిని గుభాళించి రచనలు సాగించిన కొందరూ, ఒకే దశలో కనిపించేవారు. ఆ వ్యక్తులు ఎక్కడ కనిపించినా చరిత్ర పుటల్ని చీల్చుకువచ్చి ప్రత్యక్షం అయినట్టు నాకు అనిపించేది.

1960 ప్రాంతంలో అని జ్ఞాపకం— విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర రచయితల సభ ఒకటి ఓ మూడు రోజులపాటు జరిగింది. అదొక సంబరం. కవుల్ని రచయితల్ని ఒకే చోట చూడవచ్చనే ముచ్చటతోనే యువకులు ఎక్కువ మందిచేరేవాళ్లు. తాము కూడా రచయితలమే అని చెప్పాకునేందుకు ఒకింత మొహమాటపడుతూనే గుర్తించినవారి పలకరింపులకు పులకరించి పోయేవారు.

ఆ సంబరంలోనే పెద్దలెవరిని చూసినా వారి గురించి అడిగి తెలుసుకొనే నా అలవాటు— అటుచాటున అణిగిమణిగి పలికే కవిత కోకిల— అల్లంసెట్టి అప్పయ్యగార్ని పరిచయం చేసింది. భారీ మనిషే కాని తన అస్తిత్వాన్ని ప్రకటించుకొనే ప్రవర్తన కాదు ఆయనది. చక్కని గళమే కాని సంయమనం అంతకుమించి వినిపిస్తుంది. ఖాదీ వస్త్రధారణతో దేశీయంగానూ తేటతెలుగు నుడికారంతో ప్రాదేశికంగానూ కనిపించేవారు.

అడిగి పేర్లు తెలుసుకొని— మీరు నాకు తెలుసు— మీ రచనలు పాత భారతి పత్రికల్లో చదివాను— అనగానే యువతరం అయున్నా గుర్తుపెట్టుకుం దన్న తృప్తి ఆయనలో కనిపించింది. ఆ రెండు మూడు రోజులలో ఆయనతో గల ఆత్మీయ ప్రేమాదరాలు సౌహార్ద్రం అనుభవించాను.

ప్రధానంగా ఆయన కళాకారుడు. వృత్తిలోను ప్రవృత్తిలోను కళాకారుని ఆర్ద్రత పరిస్ఫుటంగా కనిపించేది.

శ్రీకాకుళం జిల్లా పొందూరు సన్నఖాదీ చేనేత కళాకారుల కుటుంబంలో పుట్టి సవ్యసాచిలా చేనేతలోనూ విశేష కృషిచేసి సమున్నతంగా నిండుగా పెంచుకున్న వ్యక్తిత్వం వారిది. అఖిల భారత స్థాయిలో ఎన్నో నగరాలలో ఆయన చేనేత కళా నైపుణ్యానికి ప్రశంసలు లభించాయి. భారతీతీర్థ వంటి ఎన్ని మహా సంస్థలో వారిని సమ్మానించి కవితా వినోద, కవితా కోవిద, సాహిత్య భూషణ అంటూ బిరుదులతో తమను గౌరవించుకున్నాయి. బాల్యం నుంచీ కవితా వ్యాసంగం - తన 17వ ఏటనుంచి రచనల ప్రచురణ సాగిస్తూ శ్రీకాకుళంలో విశ్వనాథ కవిరాజు, విజయనగరంలో భోగరాజు నారాయణ మూర్తి వంటి సాహిత్య బంధువుల సాహచర్యంలో మెరుగులు దిద్దుకుంటూ భారతి, సమదర్శిని, ప్రజామిత్ర, త్రిలింగ వంటి ఎన్నో పత్రికలలో పద్య రచనలు, వ్యాసాలు, కథలు వెలువరించారు.

వయస్సుతోబాటు తపన పెరిగింది. సాహిత్య వ్యవసాయంలో లోతు పాతులకు, గాఢతకు ప్రాధాన్యం యిస్తూ ఖండకృతులు, కథలు వదిలి ఆర్ష విజ్ఞానంపై మనసుపెట్టి భారతీయ విజ్ఞాన తరంగిణి రచించారు.

అల్లంసెట్టి అప్పయ్యగారు గద్య పద్య రచనలను ఆధునిక ప్రాచీన ధోరణులలో - పుంఖానుపుంఖాలుగా వెలువరించి, ఆంధ్ర ప్రజానీకాన్ని అలరించిన కీర్తిశేషులు - చిరస్మరణీయులు.

వయసులోబాటు ఆయన మనసులో వచ్చిన పరిణతికి తార్కాణ యీ రామాయణ వ్యాస రత్నాల పేటిక. దీనిపై సమీక్షించవలసింది రామాయణ తత్త్వజ్ఞులైన పండితులు, రసజ్ఞులు, భావుకులు అయిన మనబోటి సహృదయ పాఠకులు యీ రామ రసాయనాన్ని సేవించి తమ చిత్త సంస్కారాన్ని పెంపొందించుకొంటారని ఆశిస్తున్నాను.

కీర్తిశేషులు అప్పయ్యగార్ని ఈ యుగం పాఠకులకి పునరావిష్కరించిన చిరంజీవి చంద్రశేఖరరావుగారు ధన్యులు.

శ్రీకాకుళం
తే 9-4-95 దీ

— కన్నసామి

# సాధువాదము

శ్రీరామచంద్రుడు - రామనామము. అద్యావధి, భారతీయ హృదయ రసనా పీఠములు వధివసించి యుండుట మన భాగ్యము. వేదవేద్యుడగు పరమపురుషుడు - సాధు పరిత్రాణమునకు ధర్మరక్షణకు త్రేతా యుగమున ఇక్ష్వాకు వంశీయుడు సత్యవ్రతుడునగు - దశరథ మహారాజునకు తన సర్వాంశలతో - శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులుగా కౌసల్యా కైకేయి సుమిత్ర లనెడి తల్లులకు కుమారచతుష్టయముగ నవతరించి - తన ప్రవర్తనచే వేద ధర్మ లక్షణమునకు లక్ష్యప్రాయుడై తన శాశ్వతత్త్వమును ప్రకటించియున్నాడు.

రామకథను వాల్మీకి మహర్షి దైవ ప్రేరణచే అప్రయత్న సిద్ధమైన కవితలో పొదిగి, సర్వులు పాడుకొని, చదువుకొని, స్మరించి, ఆది తరించు మహా మంత్రముగ, తారకముగ, భారతజాతి భాగధేయముగ మనకందించి నాడు. ఆతడాది కవి యైనాడు - ఆతని కృతి ఆది కావ్యముగ శాశ్వతమైనది. మానవుల కెల్లరకు శ్రీరాముడాదర్శ మైనట్లు శ్రీరామాయణము - తరువాతి కావ్యములకు లక్షణ నిర్దేశకమైనది

భారతీయ భాషలన్నింట శ్రీరామకథ అనూదితమగుటయే కాక ప్రపంచ పరివ్యాప్తమై వివిధాకృతులతో విశ్వ మానవుల రంజించుచునే యున్నది. అంతేకాదు ఆలోచింపజేయుచున్నది. పరమ దయాళువగు భగవంతుడు -మనల దిద్దితీర్చుటకై మనలో, ఒకనిగ దిగి వచ్చినను - ఆ వచ్చిన వానిని మనవంటివానిగనే పరిగణించుట మానవ నైజము. ఆతని యందలి దివ్యత్వము నుగ్గడించి ఆతనిలో భగవంతుని దర్శింపజేయుట కాప్త వాక్యము తప్ప వేరొండుపాయము లేదు.

వేదవేద్యే పరేపుంసి, జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసాదాసీత్, సాక్షాద్రామాయణాత్మనా॥

"వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః" అని కదా గీతాచార్యుని వాక్కు రాముని చరిత్రమే రామాయణము.

వాల్మీకి మనస్సున స్పష్టాస్పష్టముగ రూపుకట్టుచున్న ఒక ఆకృతి దేవర్షి సత్తముడగు నారదుని వివరణముతో విస్పష్టమై- దివ్యాకృతియై, పురుషోత్తము రూపమున సాక్షాత్కరించగా- ఆతని గూర్చి చేసిన వ్యాసవసమే శ్రీరామాయణముగ- దుగ్ధసింధువై మానవ జాతికి శ్రేయఃప్రదమై విరాజిల్లుచున్నది

అప్పయ్యా కవిగారు వివిధ రామాయణములను పరిశీలించి వ్రాసిన ఈ రామాయణము సారస్వత ధర్మములయి పరనాపక్తిని కల్గింపచేయుచున్నట నిర్వివాదము. వారు ధన్యులు- సాధు జీవనులు- నిరాడంబరులు- వినయ భూషణులు- బహు వంశప్రియులు- వారి రచనముతో శాశ్వతులైనారు.

"స్వయం తీర్ణః పరాంస్తారయతి" అను అభియుక్తోక్తి వారియెడ సార్థకమైనది.

'గుణం ప్రకాశయేద్ధీమాన్" అను రీతిని పెద్దలలో నున్న సుగుణములను తాననుభవించి ఆనందించుటయేగాక ఆ సుగుణములను లోకమునకు దెల్పియునట్లు ప్రకాశపరచుట ధీమంతుల లక్షణము. చిరంజీవి చంద్రశేఖర రావుగారు పై లక్షణమునకు లక్ష్యభూతులై ఆయురారోగ్యైశ్వర్య విరాజితులగుదురు గాక !

ఈ రూపముగ ఉత్తమ- పురుషోత్తమ సంస్మరణ కవకాశము లభించిన వయుమపిధన్యాః.

కాలమున్నంతదనుక శ్రీరామ కథయు, సజ్జనులు నీవల విస్తరించియుందురుగాక !

శ్రీకాకుళం
తే 9-4-95 దీ

అరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు
కార్యదర్శి, ఉపనిషన్మందిరము.

# అభిప్రాయము

శ్రీయుతులు అల్లంసెట్టి అప్పయ్యగారు తమ "రామాయణ సారస్వత దర్శనము" నామూలాగ్రము చూచి యానందించు భాగ్యము నాకు గల్గించిరి. వీరు మహాపండితులైన పెద్దలతో సహవాసము జేసి వారి శుశ్రూషతో సంస్కృతాంధ్రములలో మంచి పాటవమును బొందిన కవితల్లి జులు, సహృదయ విమర్శకులు. ఈ విమర్శనా గ్రంథమును వ్రాయుటలో వీరు తమ బహుముఖ ప్రజ్ఞను జూపిరనక తప్పదు. భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, మంత్రశాస్త్రము మొదలగు భారతీయ తత్త్వ నిరూపక గ్రంథములలోని విషయము నాకళించుకొనియేకాక అలంకార శాస్త్రము, చరిత్ర మొదలగువానిలోని విషయములను విమర్శనా దృష్టితో గ్రహము చేసికొని సర్వతోముఖ సమన్వయముతో నీ గ్రంథమును వెలార్చిరనిపించినది.

పండిత పామర జనుల నాకర్షించి లోకోపకారముగా నుండు నిట్టి గ్రంథముల నెన్నింటినేని రచించి వెలార్చు శక్తి నా రచయిత కొసంగ వలసినదిగా శ్రీరామచంద్రుని బ్రార్థింతును.

ఇట్లు

విజయనగరం
తే 26-9-69

బుధజన విధేయుడు
కందాళ వేంకటాచార్యులు, M. A.,
భాషా ప్రవీణ
తెలుగు లెక్చరర్-యం. ఆర్. కాలేజి

# ప్రస్తుతి

శ్రీ అల్లంసెట్టి అప్పయ్యకవిగారిచే రచింపబడిన ఈ "రామాయణ సారస్వత దర్శనము" ఒక చక్కని సంక్షిప్త పరిశోధన గ్రంధము. భారతీయ ఆధ్యాత్మిక విలువలకు, సభ్యతాసంస్కారములకు వెన్నెముకవంటి దర్శనరాజము మన రామాయణ కావ్యము. అది ఒక కల్పవృక్షము. దానిఛాయల్లో పెరిగిన వ్యక్తి పురుషోత్తముడు కాగలడు. శ్రీరామచంద్రుని వైభవము అట్టిది ఆ మర్యాదా పురుషోత్తముని చరిత్రయందలి ఘనతను ఈ గ్రంధమున ఒక విహంగదృష్టి న్యాయముగా మనము దర్శించవచ్చును.

శ్రీమద్రామాయణ ప్రాశస్త్యమును, దాని పూర్వాపరాలను, అర్షవిజ్ఞానంతో ముడివడియున్న రామాయణ కీలక విషయములను గ్రంథకర్త ఇందుచక్కగా మెచ్చుటంచేరు. సాధన మార్గముననున్నవారికి, సాధనచేయదలచినవారికి, ఉప యోగపడురీతిని, క్లుప్తముగా, గాయత్రీ, రామతారకమంత్రము, ఆదిత్య హృదయము మున్నగు ఆధ్యాత్మిక విషయములను హత్తుకొనురీతిని వివరించిరి.

సమయాభావముపలనను, భాషాజ్ఞానము లేకపోవుటవలనను, పుస్తక సమీక్షను చదవనిదే స్వతంత్రించి ఒక గ్రంథమును చదివే చొరవ తగ్గుటచేతను మన విలువైన ఇతిహాస సాహిత్యప్రయోజనమును పొందలేని మన యువతకు ఇది చక్కని పరిచయ గ్రంథముగా కూడ ఉపయోగపడును.

డా॥ డి. వెంకటేశ్వరరావు, M.A., Ph., D.
ఇంగ్లీషు లెక్చరర్,
బి. వి. కె. కాలేజి, విశాఖపట్నం.

విశాఖపట్నం
తే 25-11-94 ది

# ప్రస్తావన

శ్రీ అల్లంసెట్టి అప్పయ్యగారు చక్కని కవితాశక్తి, చిక్కని పాండిత్యమూ కలవారు. నా బాల్యంలో వారితో నాకు పరిచయంకలిగింది. అప్పటికేవారు కవిగా సుప్రతిష్ఠితులు. శ్రీ మాడ్గుల వేంకటసూర్యప్రసాదరావుగారి ఆశు కవితా విలాసం గురించి వారు "ఆలోచించి రచించు పద్యములు హృద్యంబౌనటే" ఇత్యాదిగా వారుచెప్పిన పద్యం నన్ను ఆకర్షించింది.

కవితాకోవిద, సాహిత్యభూషణ బిరుదాంకితులైన అప్పయ్యగారు రచించిన "రామాయణ సారస్వత దర్శనము" అను ఈ గ్రంథాన్ని ఎంతోఆసక్తితో చదివాను వారు మొదట అవతారతత్త్వాన్ని సవిమర్శంగా వివరించి, స్వరూపావతార విశేషాల్ని విశదీకరించారు. నిర్గుణతత్త్వానికి రూపకల్పన ఎలాజరిగిందో చక్కగా వివరించారు. రామావతార వైశిష్ట్యాన్ని, రామనామ మహత్వాన్ని విశదీకరిస్తూ రాముని మనస్సు "పన్నీరుచిలికిన చంపనపుముద్ద"గా అభివర్ణించారు. "మానిషాద" ప్రసిద్ధ శ్లోకంలో రావణవధ సూచింపబడినదని సమర్థంగా నిరూపించిరి.

వాల్మీకిని, రామాయణాన్ని ప్రస్తావిస్తూ సారస్వత సమీక్షగూడాచేశారు. కావ్య నిర్వచనంతోబాటు గుణములు, వృత్తులు మున్నగువానినిగూడ వివరించి రామాయణానికి మహాకావ్యత్వనిరూపణానికి ఉపబలకంగా ఉపయోగించు కొన్నారు. రామాయణంలో నిగూఢంగావున్న వేదాంతభావనను తేటతెల్లంచేశారు. "రామ"నామంలోని బీజాక్షర సంపుటిని వివరించారు. సుందరకాండలోని సర్గలు మంత్రబీజమయములై యున్నవని, గాయత్రి మహామంత్రం గోప్యంగా ఉన్నదని బోధించారు. గాయత్రీమంత్ర ప్రాశస్త్యాన్ని సుబోధకంగా వివరించారు. చివరలో విదేశాల్లో ప్రచరితమైయున్న రామకథలు ప్రస్తావిస్తూ మారీచాదిపాత్రల మనోభావాల్ని మనోహరంగా విశ్లేషించి చూపారు

చివరవరకూ చదవాలన్న ఉత్కంఠను కలిగించే ఈ చక్కని గ్రంథాన్ని రచించిన శ్రీ అప్పయ్యగారు ప్రశంసాపాత్రులు. అనేక విషయాల్ని గుదిగ్రుచ్చి మనోహరంగా రూపొందించారు. భాషప్రౌఢంగా, హృద్యంగా ఉండి వారిపాండిత్యాన్ని వెల్లడిస్తుంది.

రామాయణతత్త్వ జిజ్ఞాసువులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగిస్తుంది

శ్రీకాకుళం
తే 9-3-95 ది

గెడ్డాపు సత్యం, ఎం ఏ.
తెలుగు ఉపన్యాసకులు (రిటైర్డు)
ప్రభుత్వ కళాశాల, శ్రీకాకుళం

---

## మా కవిగారు

పొందూరు వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ అల్లంసెట్టి అప్పయ్యకవిగారు నాకు చిరకాలమిత్రులు. ఆయన నిరాడంబరుడు, సహజకవి, పండితుడు వేదాంతి, మరియు కులవృత్తిగా భావించిన సన్నఖాదీ, జరీ, వస్త్రచేనేత రంగములో నేర్పు గలవారు. ఆయనతయారుచేసిన సన్నఖాదీ జరీవస్త్రములు ఢిల్లీ, బొంబాయి వగైరా చోట్ల మంచిప్రసిద్ధిగాంచినవి. కవిగారు ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంఘములో అనేక గౌరవ పదవులు అలంకరించిరి. శ్రీ మహదేవ గ్రంథనిలయం పాలకవర్గములో శాశ్వత సలహాసంఘ సభ్యులు.

వీరు తమ చివరికాలములో రచించిన గ్రంథము "రామాయణ సారస్వత దర్శనము" భక్తి, ముక్తిదాయకమగు రామాయణములోని నిగూఢ విషయములతో పాఠకులకు ఆసక్తి కలుగునట్లు వివరించినారు.

ఇట్టి గ్రంథము ఆయనఉండగా ప్రచురింపబడకపోయినా, వారి పుత్రుడు ఈ గ్రంథమును అచ్చువేయుటెంతయు ప్రశంసనీయము.

పొందూరు
తే 1-4-95 ది

ఆచంటి సూర్యనారాయణమూర్తి

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | అవతార చర్చ | 3 |
| 2. | అవతారమునగానేమి | 5 |
| 3. | స్వరూపావతార విశేషములు | 7 |
| 4. | ఆవేశావతార విశేషములు | 12 |
| 5. | రూపకల్పన | 15 |
| 6. | శ్రీ రామావతార కథనము | 20 |
| 7. | శ్రీమద్రామాయణము - వాల్మీకి | 27 |
| 8. | రామాయణ - భారతములు | 31 |
| 9. | తార్కిక సమస్య | 34 |
| 10. | రామాయణము వేదస్వరూపము | 36 |
| 11. | ప్రతిభావంతుడు వాల్మీకి | 39 |
| 12. | సారస్వత సమీక్ష | 44 |
| 13. | వేదాంతవిచారధార | 50 |
| 14. | రామశబ్ద నిర్వచనము | 57 |
| 15. | నామసంకీర్తనము | 59 |
| 16. | లోకమాత సీత | 61 |
| 17. | శైవ వైష్ణవ మతాంతరములు | 67 |
| 18. | సుందరకాండము - గాయత్రీ మంత్రము | 71 |
| 19. | ఆదర్శ ప్రార్థన | 76 |
| 20. | ఆదిత్యహృదయము | 78 |
| 21. | పరిశిష్టము | 81 |
| 22. | ప్రతాపవంతుడు రావణుడు | 96 |
| 23. | రామరాజ్యము | 97 |
| 24. | ఫలశ్రుతి | 102 |
| 25. | శ్రీమద్రామాయణ సుభాషితములు | 104 |

# నమోవాకమ్

శ్లో॥ విశ్వోద్భవ స్థితి లయాదిషు హేతుమేకం
మాయాశ్రియం విగతమాయ మచింత్యమూర్తిం
ఆనందసాంద్ర మమలం నిజబోధరూపం
సీతాపతిం విదిత తత్త్వమహం నమామి ॥

శ్లో॥ జయతు జయతు మంత్రం జన్మసాఫల్య మంత్రం
జనన మరణ భేద క్లేశ విచ్ఛేద మంత్రం
సకల నిగమ మంత్రం సర్వశాస్త్రైక మంత్రం
రఘుపతి నిజమంత్రం రామ రామేతి మంత్రమ్ ॥

శ్లో॥ మాతా రామో మత్పితా రామచంద్రః
భ్రాతారామో మత్సఖా రాఘవేశః
సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం దైవం నైవ జానే నజానే ॥

ఇతి శమ్

# పీఠిక

## అవతారచర్చ

సచ్చిదానంద స్వరూపుడగు పరమేశ్వరుడు నిర్గుణుడు, అవాఙ్మానస గోచరుడుగా వెలుగొందుచు ప్రపంచమునకంతకు మూలాధారుడై యున్నాడు.

ఇది సాధారణ బుద్ధియగు మానవ మాత్రుని ఊహాగానముతో సంపుటీకరింపబడుచున్నది. కాని, దీని యాంతర్యమును గ్రహించి నిర్ధారింప జాలినస్థితి పారమార్థికస్థితి యనియు, దీని జ్ఞానమే మానవగమ్యమైన మోక్ష సాధనమనియు నుపనిషత్తులు మున్నగునవి తెల్పుచున్నవి.

శ్రుతి॥ "స ఓతః ప్రోతశ్చ విభూః ప్రజాసు"

ఆ మూలతత్త్వము సమస్త విశ్వమందు ఓత ప్రోతమై(పడుగు,పేకగా) సమస్త ప్రాణులందు అంతర్యామి రూపముగా నభ్యుదయము నాకాంక్షించి కార్యకలాపములు నిర్వర్తించుచున్నది.

కరుణామయుడగు పరమాత్మని యునికిని పురస్కరించుకొని తదాశ్రియ మగు ప్రకృతి యంతయు సత్త్వరజస్తమస్సులనెడు గుణత్రియ యుక్తమై అతనియందలి సచ్చిదానందములను - (సత్ =సత్యము- చిత్ =జ్ఞానము - ఆనందము = సంతోషము) మఱుగుపఱచి అనృత జడ దుఃఖాత్మకముగా దోపించి నానా విధములగు మాయాకార్యములచే లోకమును భ్రమింపజేయు చున్నది.

ఈశ్వరునియందున్న లక్షణములన్నియు దనయధీనములోనే యుండి యతనికి చేరికగానున్న విశాల ప్రకృతియందు ప్రతిఫలించుచుండగా నొక్కడే యగు నీశ్వరుని నుండి మీద తెల్పబడిన గుణత్రియ విశిష్టమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనబడు మూర్తిత్రయ మభివ్యక్తమై సృష్టి స్థితి సంహారములకు హేతుభూత మగుచున్నదని, ఆతని సంకల్ప మప్రతిహతమై అనిర్వాచ్య రహస్య విలసితమైనదని, మున్నగు విషయములు పరిపక్వ బుద్ధుల మనో వాక్కులకు గోచరీభూత మగుచుండును. ఇది ఆ పరతత్త్వమునకు రెండవ స్థితిగా చెప్పబడుచుండును

ఈ రెండవ స్థితియు జన సామాన్యమునకు దుర్విజ్ఞేయము కనుక లోకానుగ్రహార్థమై భక్తుల యందలి సానుభూతిచే సర్వజ్ఞత్వ, సర్వేశ్వరత్వ సర్వనియంతృత్వా ద్యనంతకల్యాణగుణాకరుడగు భగవానుడు అవతారములు పెక్కులు ధరింపవలసివచ్చెను.

శ్రుతి॥ "అ జా య మా నో బ హు ధా వి జా య తే"

జన్మరహితుడైన పరాత్పరుడు తన సామర్థ్యమును పలు విధములుగా ప్రకటించుచు స్వేచ్ఛగా ప్రపంచమున సమస్త రూపములు దాల్చుచున్నాడు. (పురుషసూక్తము)



# అవతారమనగా నేమి ?

"సంకల్పాధీన మాయిక దేహ ధారణం అవతారమ్"

భగవంతుడు తన సంకల్ప రూపజ్ఞానమాత్రము చేతనే తనయందున్న ఆత్మీయ శక్తి వలన దేహధారియై భక్త రక్షణ, ధర్మప్రతిష్ఠ మున్నగు నీశ్వర స్వభావము విడువని గుణసంపత్తి గల సగుణ భావముతో వివిధ రూపములు ధరించుట అవతార మనబడును.

అవతారశబ్దమునకు (అవ+తౄ-కరణే ఘఞ్) దిగుట యని అర్థము. అనగా నిర్గుణము నుండి సగుణముగా నగుట - లేక, బ్రహ్మలోక, దేవలోక, వైకుంఠాది వివిధ లోకములనుండి భూమండలమునకు విచ్చేసి మనుష్యాది శరీర ధారణ మొనర్చుట -

ఇది సాధారణ మానవుల గూర్చి తెల్పునపుడు "జన్మించుట" అని చిరకాల రూఢమైన యర్థము చెప్పుచుందుము. ఇది భగవానుని విషయమున మాడవ స్థితిగా నెన్న బడును.

ఈ స్థితి యందు భగవానుడు సమస్త లోకకళ్యాణము నపేక్షించి దుష్ట శిక్షణము, శిష్ట రక్షణము జరుపుచుండుట కర్తవ్య నిష్ఠగా ఏర్పరచుకొనును. అనగా సాధువులలో సాధుత్వము పెంపొందించి తత్ఫలితముగ దుష్టులయందు దుష్టత్వము రూపుమాయించి సర్వత్ర ప్రేమధర్మమును స్థాపించుట - ఇది ధర్మ సంస్థాపనమనబడును. ధర్మము భగవంతుని స్వరూపము కదా!

గమనిక :- శ్రుతులందు చెప్పబడిన జ్ఞానము ననుసరించి ప్రధాన కర్మము లొనర్చుచు అందలి యర్థములను ఇతరులకు బోధించు వారు "శిష్టు" లన బడుదురు.

"సత్యమే వేశ్వరో లోకే సత్యే ధర్మః సదా శ్రితః"

లోకమందు సత్యమే ఈశ్వరుడు. ధర్మమెల్లప్పుడు సత్యమునందే ప్రతిష్ఠితమై నిలిచియుండును (శ్రీమద్రామాయణము)

ఏ కారణమున నెవ్వరిచేనైన విశ్వశ్రేయము నధఃకరించు విప్లవాత్మక చర్యలు వెఱ్ఱి తలలువేసి సర్వత్ర సంక్షోభముప్పతిల్లిన నాడు అది ధర్మగ్లాని (ప్రేమక్షీణించుట)యనబడును. దానికి ప్రతీకారమగు వేద ధర్మ నిర్ణయము నకు మానవులయందే యొకానొక ప్రవక్తను సృష్టించుటయో లేక, భగవానుడే స్వయముగా మనుష్య సజాతీయుడై సాధుసంత్రాణముకొఱకు అవతరించుటయో యాతని విధియై యున్నది. అది అవతార లక్షణము. కనుక అతడెల్లప్పుడు అట్టిపట్టుల దాని ననుసరించుకొనియుండును. (ధర్మగ్లాని యనగా వైదిక ధర్మమునకు అపచారము జరుగుట. దీనికి వేద విహితమైన ధర్మము అని మాత్రమే అర్థము).

శ్లో॥ యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే॥ — (గీత)

భగవానుడు ప్రేమమయుడగుటవలన – ప్రపంచమంతయు నతని దివ్య స్వరూప మగుటవలన లోకకంటకుల నుపశమింపజేయు సమస్తకృత్యములు నతని బాధింపవు. ఆతని యందనేక విధములగు నధికారములు కలవు.

భగవానుని యవతారములు విభవావతారములని, అర్చావతారములని రెండు విధములుగా నున్నవి.

విభవావతారమనగా :– మానవాతీతమైన దివ్యదేహముతో దృష్టి గోచరమగుచుండుట.

అర్చావతారమనగా :– ఆలయమందు భోగరాగములతో అర్చక పరాధీనమైన మూర్తిమంతముతో దర్శనమిచ్చుచుండుట.

కాశీ, రామేశ్వరము, శ్రీశైలము, వేంకటాచలము, మధుర, బృందావనము మున్నగు దేశ విస్తృతమైన క్షేత్రములందలి ఆలయములలో భగవానుడు శిలా దారు మృత్తు మున్నగు రూప విశేషములతో వెలసియుం డుటయు భక్తజన పర ప్రదాత యగుటయు జూచుచున్నాము కదా !

ఇందు మొదట దెల్పిన విభవావతారము స్వరూపావతారమని ఆవేశావతారమని మఱి రెండు రీతులుగా నున్నందున అందలి విశేషములు కొన్నింటినిట స్ఫుటపఱచి బేర్కొందుము.

# స్వరూపావతార విశేషములు

భగవంతుడు తన సంకల్పాధీనమగు మాయిక దేహధారణమునకు, తదను గుణమైన యవతరణమునకు గారణాంతరములలో గర్భితమైన పరమ రహస్య ములు పెక్కులుండును. అటులే సుర నర తిర్యగాది స్వరూప విభేదములతో నా యా యవతారములు మూర్తిభావముతో ఉపలక్షితము లగుచుండును. కాని అందలి రహస్యములు తెలిసికొనుట కష్టముగానుండును.

ప్రపంచ విఖ్యాతమైన రామ కృష్ణాద్యవతారములు మనుజులు. తక్కినవి మనుజేతరములు. అయినను వీనియందు తారతమ్య భావము నాపాదించుట సంప్రదాయ విరుద్ధమేగాక ఉచితజ్ఞ లక్షణములకు భంగము వాటిల్లును. ఈ రహస్యమును సమరస భావముతో గ్రహించినగాని సకల పురాణములకు సమన్వయము కుదరదు. యుగాంతరములందు భిన్న భిన్న సమయములలో వెలసిన మహా భక్తాగ్రేసరుల యభిమతార్థము తీదేర్చుటకై భగవానుడు సగుణ నిర్గుణాది భిన్న స్వరూపుడై భాసిల్లును. కాని, వాస్తవముగా నతడు నిర్గుణుడే - సకల గుణాతీతుడే - అట్లయ్యును నిది అబాధిత విషయము. నిత్య శుద్ధమగు చైతన్యమే అన్నిటికి మూలకారణమని చెప్పినను యెట్టి విప్రతిపత్తి లేకుండునట్లేయగును.

సర్వవ్యాపకమైన పరమాత్మకు మాయావిరచితమైన యీ జగత్తునందలి ఆ యా వస్తుసంచయమునకుగల నామరూపములతో సంబంధము లేకపోయినను వ్యక్తి సాన్నిధ్యము నపేక్షించు పరమభాగవతోత్తములగువారికి ఆ యా రూపములతో ప్రతీత మగుచుండుట-దర్శన మొసంగుట అవతారముయొక్క ముఖ్య కర్తవ్యము

భిన్న భిన్న జల పాత్రములలో ప్రతిఫలించిన సూర్యభగవానుడు భిన్న భిన్నముగ గోచరించినను వాస్తవమునకు సూర్యుడొక్కడే కదా! మంచుగడ్డ జలముయొక్క రూపాంతరమగుటవలన నీ రెంటికిని వాస్తవికమైన ఏకత్వము కలిగి యుండుట ప్రత్యక్షముగ చూచుచున్నాము కదా! భగవంతుని యవ తారములనేకములు కలవు. అందు హయగ్రీవాది ఇరువదొకండు ముఖ్యములు. దశావతారములు లోక విదితములు. అవి ముఖ్యతమములు. లోకమునకు మహోపకారము నర్చినవి. వీనిలో మత్స్య కూర్మాద్యవతారములు అంశావతారములు.

శ్లో॥ మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామో రామశ్చ కృష్ణశ్చ బుద్ధః కలికి రేవచ॥

కొందరు దీనిని "రామో రామశ్చ రామశ్చ" అని ముగ్గురిలో నొకరిని బలరామునిగా జేర్చి చెప్పుదురు. దశావతార పరిగణన యందు కొందరు కృష్ణావతారము చేర్చక పోయినను అది భగవదవతారమే-కనుక దశావతారములలో 'మూడ'వతారములు మనుజులని, మానవ దేహధారణము భగవానునకు ప్రియతమమైనదని, దేవుని ప్రతిరూపముగా సృష్టింపబడినదని దీని వలన భగవదంశము నధికముగా బొందవచ్చునని తగిన యుపపత్తి ఋజువు పఱుపవచ్చును.

మఱియొక విధమున దశావతారములలో మత్స్య కూర్మములు రెండును జలచరములు - వరాహ నృసింహములు రెండును వన్య మృగములగు చతుష్పాత్తులు. తక్కినవి వామనావతారముతో జేర్చి లెక్కింపగా 'ఆఱును' మనుజములే కదా! ఏ దిశ నుండి చూచినను భగవానునకు మానవ శరీరధారణమే ప్రియతమమైనదని చెప్పవచ్చును. కాని, అందును - సంప్రదాయమెట్లున్నదనగా

శ్లో॥ యద్యద్విభూతిమ త్సత్త్వం శ్రీమదూర్జిత మేవవా
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్

(గీత 10-41)

అని భగవద్గీత యందిట్లు చెప్పబడినందున చరాచరములగు సర్వ జీవరాసుల యందున్న విశిష్టశక్తులన్నియు నధికముగా దైవ బలముతో వ్యాపించి యుండునని యర్థము, మఱియు

శ్లో॥ నాహం ప్రకాశ స్సర్వస్య యోగమాయా సమావృతః
మూఢోయం నాభిజానాతి లోకోమా మజ మవ్యయమ్

(గీత 7-25)

ఈ విధముగా భగవంతుడు తెలుపుట వలన తాను తన పరతత్త్వ మహిమలు యోగ మాయా శక్తి నాచ్ఛాదించుకొని అందరకు దెలియబడక యున్నాడని, అతనికి జనన మరణములు లేనట్లు జ్ఞానహీనులగు మూఢులు సద్విచారదూరులై గ్రహింప నేరక యున్నారని స్పష్టమగును.

శ్లో॥ యస్య దేవా నమునయో, నచాహం నచ శంకరః
జానంతి పరమేశస్య, తద్విష్ణోః పరమంపదమ్ ''

బ్రహ్మ రుద్రేంద్రాది దేవతలు - మహర్షులు - మానవులు ఇంకెవ్వరు గాని అపరమాత్మ పరరూప మెఱుంగ జాలరని బ్రహ్మదేవుని వాక్యము. కనుక భగవానుని దివ్యమంగళ మూర్తులే జీవులకు దేవతలకు ధ్యేయైక లక్ష్యములని విష్ణుపురాణము.

(భగవద్విభూతులను వ్యాసభగవానుడు అష్టాదశ పురాణములందును వివిధేతిహాసిక గ్రంథములందును విశదీకరించెను. కనుక నితడు వ్యాసుడను బిరుదము వహించెను.)

శ్లో॥ యః స నారాయణో నామ దేవదేవః సనాతనః
తస్యాంశో వాసుదేవస్తు కర్మణోంతే వివేశహ

అనగా నారాయణాంశ వాసుదేవుడు తన కర్మము సమాప్తమైనర్పి కారణరూప నారాయణునియందు లీనమయ్యెనని మహాభారతమున చెప్పియున్నాడు. ఇంతటితో నతడు తనివి జెందక భగవల్లీలా విలసనములు సాకల్యముగా వర్ణించుటకే భాగవత మహాపురాణము రచించి - దానిపై భక్తి పూరితమైన కవితా కమనీయత అవేశముగ గోచరించు మకరందపు సోనలతో సంగీతము నందలి సప్త స్వరములను దలపించు భాషా మాధుర్యముతో దత్సంప్రదాయములను లలిత మధురములుగా వెల్లివిరియించిన విషయము జగద్విదితము.

భగవంతుని యవతారము లన్నిటియందు శ్రీకృష్ణావతారము సకల సామర్థ్య పరిపూర్ణమైనదనియు, తక్కుంగలవి భగవదంశగల కళావిలసనములు మాత్రమే యనియు వ్యాసమహర్షి హృదయము.

'' అన్యే చాంశ కలాః పుంసః
కృష్ణస్తు భగవాన్ స్వయమ్ ''

అని శ్రీమద్భాగవతమున పేర్కొని యున్నాడు.

త్రేతాయుగమున మహర్షులందఱు శ్రీ రామచంద్రుని గొనియాడి యాశీర్వదించిరి. కాని శ్రీకృష్ణుడు తాను మాత్రమందఱి ననుగ్రహించి యాశీర్వదించుటయే గాక "కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః" అని గీత యందుద్ఘాటించెను.

భగవంతుడు :

భగవచ్ఛబ్దమునకు "భగః అస్య అస్తీతి భగవాన్"అని నిర్వచనము కలదు. ఐశ్వర్యాది సమస్త సమగ్ర విషయములందు మానవాతీతమైన ప్రజ్ఞా ధురీణుడు భగవంతుడు. "భగ ఐశ్వర్యే" దీని కారిక యిట్లున్నది–

1) "ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా"

2) "ఉత్పత్తించ వినాశంచ భూతానా మాగతిం గతిమ్
వేత్తి విద్యా మవిద్యాం చ సవాచ్యో భగవా నితి"

షడ్గుణ పరిపూర్ణైశ్వర్యముగలవాడు–ధర్మ స్వరూపుడు–మహా యశస్వి – శ్రేయస్వి–జ్ఞానవైరాగ్యాద్యుత్తమ గుణములచే పరిపూర్ణుడు భగవంతుడనబడును

ఆ యీ నిర్వచనములవలన రామ కృష్ణావతారములు రెండును భగవానుని షోడశ కళా పరిపూర్ణమైన పూర్ణావతారములని చెప్పబడుచుండెను. కాని దీని యందును ఉపదేశ ప్రధానమగు శ్రీకృష్ణావతారమునకంటె నాచరణయే ప్రధానముగా గల రామావతారము మిగుల మహత్తరమైనదని కొందరు విజ్ఞులొప్పికొని తెల్పుటకవకాశము కూడ కలిగి యున్నది.

ఇచ్చట ప్రసక్తాను ప్రసక్తముగ నిందు శ్రీ కృష్ణుని గొండొక ప్రసంగించుచున్నట్లు భావకులు గ్రహింత్రు గాక!

శ్రీకృష్ణుడు ద్వాపర యుగాంతమున దేవకీ గర్భము నుండి భువిపైకి విచ్చేసెను. శంఖ చక్ర గదాధారియై చతుర్భుజములతో యశోదా దేవికి

సాక్షాత్కరించెను. పిమ్మట ఆ మహాసాధ్వి ప్రార్థన మన్నించి సామాన్య బాల రూపము ధరించెను. అది యొక విచిత్ర సంఘటన.

ఇట్లే కంసాది రాక్షస వధ సందర్భములందు, శిశుపాలుని మస్తక విచ్ఛేదమునందు ఉదాత్తమైన ప్రతిభా శక్తులతో లోకమును విస్మయ పఱిచెను (అట్లే శ్రీ రామ చంద్రుడు చతుర్బాహు రూపముతో కౌసల్యకు కాన్పించెను. వెంటనే శిశు రూపి యయ్యెను. రామాయణమందీ విషయము పొడకట్టును.) శ్రీ కృష్ణు డొక్కడే యయ్యును భాగవత కృష్ణుడు భక్తవత్సలుడుగను, భారత కృష్ణుడు రాజకీయవేత్తగను నటించి పరమాద్భుత మైన విచిత్ర లీలలు ప్రదర్శించెను. నిజముగా నతడు యోగపురుషుడు. కనుకయే అతడు దర్శించిన మాత్రమున పరీక్షితుని మృత పిండము బ్రతికి పోయినది.

'శ్రీకృష్ణ' శబ్దమునకు నిరుక్తమందు "కర్షతి సర్వాపరాధాన్ కృష్ణః" అని నిర్వచించబడినది. అనగా సమస్త అపరాధములను (పాపములను) నశింపజేయువాడని యర్థము. సాధారణముగా 'కృష్ణ వర్ణత్వాత్ కృష్ణః' నల్లనివాడు కనుక కృష్ణుడని చెప్పుచున్నాము.

భగవద్గీత యందు శ్రీకృష్ణపరమాత్మ :-

"పవనః పవతా మస్మి రామశ్శస్త్ర భృతా మహమ్"

అని విభూతియోగములో త్రేతాయుగమునాడు తనకు ముందు జరిగిన రామావతార విషయము పేర్కొనినాడు. కారణమేమన :-

శ్లో॥ రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని
అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ"

పరంపరాగతమైన యిట్టి సద్ధర్మము రామాయణాదుల వలన సర్వ విదితము.

—()—

# ఆవేశావతార విశేషములు

స్వరూపావేశము, శక్త్యావేశము అని యివి ద్వివిధముగ నున్నవి. మహోత్కృష్టమై అత్యంత పూజనీయములగు చేతనులయందు యాదృచ్ఛికముగా భగవానుడావేశించుట. ఇట్టివి వ్యాస, పరశురామాద్యవతారముల వంటివి. వీని యుత్కృష్టత పురాణ ప్రసిద్ధము. "వ్యాసోనారాయణో హరిః" అని చెప్పబడినందున వ్యాసుడు విష్ణుదేవుని యవతారముగా గణుతి గాంచెను. ఇట్లే - "శంకర శ్శంకరస్సాక్షాత్" అను ప్రమాణ వచనములతో "మహేశాంశాజ్జాతః" వారు ఈశ్వరాంశభవులని ప్రశంసించుచున్నాము.

కృత త్రేతా ద్వాపర యుగములలో కపిల, దత్తాత్రేయ వ్యాసాది రూపములలో పరమేశ్వరుడు విజ్ఞానావతారముగ జనించి యుగావసరములు నెఱవేర్చినట్లే ఆ కోవకు జెందిన యవతార పురుషులు కలియుగమున నెందరో కలరు.

శ్లో॥ ద్వాపరే ద్వాపరే విష్ణు ర్వ్యాసరూపీ మహామునే!
చతుర్భిస్సహ శిష్యైస్తు శంకరోవతరిష్యతి

ఇట్టివన్నియు స్వరూపావేశావతారములుగా పరిగణింపబడుచున్నవి.

ఇట్లే రెండవదియగు శక్త్యావేశము గూర్చి పృథు చక్రవర్తి మున్నగు వారి నెందరినో తెల్పవచ్చును. అది గ్రంథ విస్తరము. పృథు చక్రవర్తి నారాయణాంశమున పృథ్విని ధర్మ యుక్తముగ పాలించుటకై జన్మించినాడు. గోరూపధారిణియగు భూదేవి నుండి, స్వాయంభువమనువును వత్సంబుగా నొనరించి భూమి వలన సకలౌషధులను పిదికి ప్రజా సంరక్షణ మొనర్చెను. ఇది భాగవతమందు పద్మపురాణ భూమిఖండమందును కలదు.

ఇట్టి లోకమాన్యులు, చారిత్రక పురుషులు మన దేశమున యుగావసరమును బట్టి సాధారణముగ రెండు వేల యేండ్లకొకతూరి గాని అంతకు పైని గాని ఈశ్వరాజ్ఞననుసరించి ఏ దేశమునైనో జన్మించి మానవ జాతికి అసాధారణమైన మహోపకారము జరుపుచు వచ్చుచున్నందున నట్టి వారిని

అవతార పురుషులుగ పేర్కొనబడుచు. కాని సర్వ దృష్టిచే ప్రకాశించెడి అవతార పురుషులయ్యును వారియందు ఏ ప్రాంతి పలు విధములుగా లోంగ దీసి దైవతేజము విస్తరించి ప్రకాశింప జాలనందున అవతార పురుషులుగా గౌరవింపబడరని తగినంత పరిశీలకులతో చెప్పవచ్చును.

మన దేశ సాంప్రదాయము ననుసరించి మహాత్ముల గూర్చిన దివ్య స్మృతి చిహ్నములుగ కాంశ్య విగ్రహములు నిర్మించుకొనుచు ఆవిష్కరణో ద్యమములని, వర్ధంత్యుత్సవములని, జయంత్యుత్సవములని, జన్మదినోత్సవము లని వైభవోపేతముగా సమావేశములు జరుపుకొనుచు వారివారి గుణగణములను స్వచ్ఛంద మైన ఆధిపత్య సేవా పరాయణత్వము నందలి వ ధుర స్మృతులను అవగాహన మొనర్చుకొనుచు ప్రణామములర్పించి శ్రద్ధాంజలితో పునీతుల మగుచున్నాము. (మహాత్ములనగా సర్వత్ర భగవంతుని ఏక స్వరూపముగ గాంచి ఎల్ల జాతములను ప్రేమించి యానందించువారు)

వైశాఖ శుద్ధ పంచమినాడు శంకర జయంతి.
మార్గశీర్ష శుద్ధ పూర్ణిమ దత్తాత్రేయ జయంతి.
ఇట్లే శ్రీ కృష్ణజయంతి-వ్యాస జయంతి – గీతా జయంతి మున్నగునవి

ఎన్నియో మన భారతీయుల యదృష్టమును పుణ్య స్మృతులుగా నుగ్గడించుచున్నవి.

శ్లో॥ అజోపిసన్ అవ్యయాత్మా భూతానా మీశ్వరోపిసన్
ప్రకృతిం స్వామవష్టభ్య సంభవా మ్యాత్మ మాయయా ॥

అని గీతాకారుడు స్పష్టముగ నీ విషయమై నుడివియున్నాడు. శ్రీ శంకర భగవత్పాదులు కూడ ప్రాచీనమైన బృహదారణ్యకాద్యుపనిషత్తుల నన్నింటిని విశాల దృష్టితో సమీక్షించి

" స్యాత్ పరమేశ్వరస్యాపి ఇచ్ఛావశాత్ మాయా మయం రూపం సాధకాను గ్రహార్థం " అని గుణ భవ్యమైన వాఖ్యాన మొనర్చి భగవానుని పుత్రవాత్సల్యము స్తుతించిరి. శంకరులు తన ప్రబోధ సుధాకరమను గ్రంథమున.

" దేవ్వావ బ్రహ్మణో రూపే మూర్తం చా మూర్తంచ "

అనబడు బృహదారణ్యక వచనము నుద్ధృత మొనర్చి చూపించిరి. అనగా బ్రహ్మ స్వరూపము సాకారమని–అనగా భౌతికమైన మూర్తివంతమని– నిరాకారమని రెండు విధములుగ నున్నదని యర్థము.

విశేషమేమన :– అవతార పురుషులు తాము పాంచభౌతిక శరీర పరిత్యాగ మొనర్చియు సామర్థ్యబలముచే లోకయాత్ర జరుపుచుందురు. అది వారి స్వేచ్ఛననుసరించి యుండును. అట్టివారిని హృదయ పూర్వక భక్తి భావనతో సంస్మరించు వారికి ప్రత్యక్షమై ప్రసిద్ధములైన భౌతికాధ్యాత్మిక శక్తి సామర్థ్యములు ప్రసాదించి తిరోహితులగుచుందురు. అట్టి దివ్య విభూతులు అవతార పురుషులందు గోచరించుచుండును. ఇయ్యది సహృదయైక గోచరము.

" సః స్వరాడ్భవ
తస్య సర్వేషు లోకేషు కామ చారో భవతి "

ఛాందోగ్యము

అనగా ముక్తజీవుడు ఈశ్వరత్వమును పొందుచున్నాడు. సర్వ స్వతంత్రుడై పరమాత్మయొక్క యుద్దేశ్యమైన ధర్మ సంస్థాపన కొఱకు ముక్తజీవుడు సమస్త లోకములందును స్వేచ్ఛగా సంచరించుచున్నాడు. అని యర్థము.

ఇట్టి స్థితిని పొందినవారే " అహం బ్రహ్మాస్మి " " శివోహం " అని తలచుటకు – ప్రబోధించుటకు సమర్థులు – వీరే జీవన్ముక్తులనబడుచున్నారు.

-()-

# రూ ప క ల్ప న

శ్లో॥ చిన్మయ స్యాద్వితీయస్య నిష్కళస్యా శరీరిణః
ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా
(రామతాపినీయోపనిషత్తు)

ఉపాసకుల కార్యార్థము బ్రహ్మమునకు రూపకల్పన మేర్పడినదని తెలిసికొంటిమి. ఇది మన పురాతనమైన ఆధ్యాత్మిక సౌభాగ్యము. అనిర్వచనీయమైన పరమేశ్వర సౌందర్యము శబ్ద ప్రపంచములో రసభరితమైన కావ్య రూపముగను-దృశ్య ప్రపంచములో సౌందర్య విలసితమైన ప్రతిమా రూపము గను విరాజిల్లుచున్నట్లు గ్రహించితిమి.

సర్వవ్యాపకము, నిరంశకము, నిరవయవము, నిర్గుణమునగు బ్రహ్మము నకు రూపకల్పన మొనర్చి యుపాసించు విధానము మానవ హృదయములో స్వాభావికముగ నిమిడియున్న గుణసంపద.

"నతేరూపం నచాకారో నాయుధాని నచాస్పదం
తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే"

ఇట్లే ప్రాచీన సూక్తులెన్నియో కలవు. ఇది నిందనీయమని కొందరు అధునాతనులు నోరు చించుకొని వాదింతురు. ఇది వివేకుల హృదయముకాదు గనుక నట్టి పట్ల మాకే భావముకన్న నుత్తమమగు పని కానరాదు. కాని యిది మహాదుస్తరమగు సంసార సాగరమును సులభముగ తరింపుటకై నిర్దేశింపబడిన యొక సరళ ప్రక్రియ, ఉపకరణము.

బహు ప్రాచీనమైన వేద, పాంచ రాత్రాగమ విధులననుసరించి అర్చామూర్తులను సభక్తికముగ నారాధించు భక్తులు భగవత్కృపకు పాత్రులై సకలాభ్యుదయములు సాధింపగలుదురని వివిధ శాస్త్రపురాణములంగీకరించినవి పరిశుద్ధమైన విశ్వాస భావముచే సంకల్పమొనర్పబడిన పరబ్రహ్మమునకు త్రికరణశుద్ధిగ మంత్ర యంత్ర జపాదులు శాస్త్రములందు విధింపబడి యుండెను.

షోడశోపచారములతో వలగొని ప్రదక్షిణ మొనర్చుట వంటి కాయిక

కర్మములతో మిళితమైన అంతరంగిక భక్తి తాత్పర్యముల ప్రోద్బలముచే భగవత్ప్రసన్నత సులభగమ్యమై మోక్షమార్గమును చేరవచ్చును. అట్టి సత్సాంప్రదాయములతో సాధ్యాసాధ్యములు గ్రహించి రామకృష్ణాద్యవతార మూర్తులను నిశ్చల భక్తిప్రపత్తులతో ధ్యానించి చిత్తశుద్ధితో పూజించుట-కర్పూర నీరాజనములెత్తుచు పుష్పాంజలులు ఘటించుట భారతీయుల పైతృక మైన అనూచార ధర్మమై యున్నది. మహోదాత్తమైన భక్తిసూత్రముల నవగాహన మొనర్చుకొనజాలక వక్ర మార్గములో దుష్ప్రచార నినాదములు సలుపబడుచున్నను ఈ ధర్మము సార్వత్రికముగ హిమాలయశృంగమువలె భారతదేశ సముద్ధరణకై అట్లే నిలచి యున్నది. కొందరు నాస్తికవాదులనటుంచి మతాంతర సద్విమర్శకుల దృక్పథమందిట్లున్నది.

దేవతాంతర మతాంతరులు వారి వారి బుద్ధివైభవముతో హేతువాద పూర్వకముగా సిగ్గు తేల్చి ఉపనిషత్తులను పలు తావులలో చెప్పబడిన ఉపాస్య బ్రహ్మము అవ్యక్తముగానున్నను మనోహ్లాదకరమైన సగుణ రూపముగనే వర్ణితమైనట్లు మహర్షులే సిద్ధాంతీకరించినారని జపానుగ్రాహదంపతులు దృఢముగా విశ్వసించిరి.

భారతీయ వైదిక సంస్కృతికి నిలయమైన పాంచరాత్రాగమ సిద్ధాంత శాస్త్రములో మంత్ర సిద్ధాంతము చాల ముఖ్యమైనది. ఇట్లే ఉపనిషత్తులందు దహరవిద్య, శాండిలవిద్య, వైశ్వానరవిద్యలయొక్క రూపములందు సగుణో పాసనలన్నియు వర్ణితములై యున్నవి

భారతీయ దేవాలయ నిర్మాణము ఆగమ(మంత్ర)శాస్త్ర సాంప్రదాయము ననుసరించి శిల్పకళా చాతుర్యము గల మహా శిల్పులచే నిర్మితమై యుండెను. అందు శిలా దారు మృత్తు లోహాదులచే అర్చామూర్తులు ఋషి స్థాపితములై మంత్రశక్తి ప్రభావితములగుటచే చిరస్థాయియై వెలసి యున్నవి. కనుక ప్రపన్నులందఱు దైవారాధన ప్రక్రియలన్నిటిని నెఱవేర్చుకొనుటకు భౌతికముగను, మానసికముగను క్రమశిక్షణ పొందదగి యున్నట్లు పాంచరాత్రాది రహస్య శాస్త్రములుద్బోధించును. దేవాలయములందు నెల కొని యున్న శ్రీమన్నారాయణుడు తన దక్షిణ హస్తమున సమస్త జనులను

రక్షించుటకభయ ముద్ర ధరించినాడు. వామ హస్తముతో దగ పాదములాశ్రి యించి శరణు వేడుకొనుడని సంజ్ఞ చేయుచున్నాడు. అతడు మన హృద యాంతరంగ సంవేదియని గ్రహించి ఇట్టివన్నియు మనమూహించుకొన వచ్చును. మఱియు నచ్చట జరుగుచున్న నిత్య దేవార్చనతోబాటు ప్రశాంత వాతావరణము భగవచ్ఛక్తి సంగతమైయున్నందున సర్వజనాకర్షకము లై యుండును. దేవాలయ సందర్శనము వలన అందు వెలయుచున్న శిల్ప కళా వైదగ్ధ్య ద్వారమున అప్రయత్నముగ దైవ సంస్మరణము "స్థూలారుంధతీ" న్యాయముగా లభించును. సాలగ్రామము మున్నగువానిని భగవానుని వ్యక్త స్వరూపములుగా భక్తులు భావించుచున్నారు. సాలగ్రామము గండకీ నది యందుండు విష్ణు స్వరూపమైన యొక విధమగు ఱాయి. దానిని విష్ణువుగా పూజించు చున్నట్లే శిలా, లోహాది భావనలు విస్మరించి కేవల భగవద్భావనతో వాని నారాధించుట జరుగుచున్నది. అదియే ప్రతీకోపాసన మనబడును. ఆ విధముననే వానిని సందర్శించి నైవేద్యాదులు సమర్పించుట మున్నగునవి సుశిక్షితమైన హైందవ భక్తి లక్షణములు కదా! ఇట్టి సగుణోపాసన మార్గము లన్నియు వేదము వలె బహు ప్రాచీనములై యున్నవి. ఈ ప్రకారముగ భిన్న భిన్న ప్రతీకములు, భిన్న భిన్న ప్రతిమారాధనలు సగుణోపాసనలన బడును.

ఇవి యన్నియు నొక్కటే యగు సరస సుందర దివ్యతత్త్వమునకు జెంది యున్నందున వానిని సందర్శించినను - అర్చన - ధ్యాన - జపాదులొనర్చినను, సాలోక్య, సామీప్య, సారూప్య - సాయుజ్య పదవులచే ఆ దివ్యతత్త్వము వఱకు వెంబడించి పోవగల్గుదుము.

"స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః"
(గీత 18-45)

మనుష్యుడు తన మనోవాక్కాయ కర్మములచే కర్తవ్యము నందభిము ఖుడై తత్పరుడగుచున్నపుడు పరిపూర్ణ సఫలత పొందుచున్నాడు. ఆధ్యాత్మిక మైన జీవ యాత్ర యందు చైతన్యవంతమైన శక్తి సామర్థ్యములతో చక్కగా ముందునకు సాగిపోవుచున్నాడు.

తేజోమయమైన యావద్విజ్ఞాన సర్వస్వమగు గీతాశాస్త్రమునకున్న యఖండ గౌరవము, లోకప్రియత-శ్రీమద్రామాయణమునకును, అటులే మన పురాణములకును సహజ వ్యాపకము కలిగియున్నందున్న నూతనాభివర్ణన మొనర్చినను లేకపోయినను ప్రపంచ సారస్వతములో ప్రత్యేక గౌరవస్థానము నందుకొని ఆధ్యాత్మిక గురుపీఠమునందు పూజనీయములైనవి. గులాబి పూవు నందలి సహజ పరిమళము నలువైపుల వ్యాపించుచుండగా నద్దాని వర్ణ సౌందర్య వర్ణనతో నక్కరయేమున్నది.

భారతీయ జీవితానుభూతియందు నివియన్నియు నద్వితీయములైన పెన్నిధానములు కదా!

దాదాపు రెండు వేల యేండ్ల క్రిందటి మాట :-

పరిణత ప్రజ్ఞాధురీణులగు ఆదిశంకర భగవత్పాదులు యావద్భారత దేశము బర్యటించి అతః పూర్వము వివిధ క్షేత్రములందు వెలసిన దేవతా మూర్తుల మహాద్భుత శక్తి సామర్థ్యములు బహురీతుల స్తోత్రరాజములచే నభివర్ణించిరి.

భక్తి రసోద్దీపనముచే సగుణమును—సన్న్యాస ధర్మముచే నిర్గుణమును—అద్వైతముచే సర్వ సామరస్యమును ప్రతిపాదించిరి. కాని ఇందు అద్వైతము మాత్రము దురవగాహమైన సాంఖ్య, న్యాయ, యోగ, పూర్వమీమాంసాది విశేష శాస్త్ర పరిచయ జ్ఞానము లభించిననాడు క్రమముగా సులభ గ్రాహ్యమగుచున్నది. శాస్త్ర కర్తలు మానవులైనను అతీంద్రియ జ్ఞాన సంపన్నులు—పరిపక్వ మనస్కులు కనుక తదాశ్రయమున శాస్త్రమును దిలకించునపుడెల్ల భగవత్స్వరూపము గోచరించును.

గమనిక :— శంకరుని మతమందలి మౌలిక సిద్ధాంతము తలస్పర్శిగా పరామర్శించిన యెడల మహితాత్ముడగు వ్యాస భగవానుని సర్వసమన్వయ దృక్పథము నంటిబెట్టుకొని ఔపచారికముగ దానితో పెనవేసికొనియున్నది.

" బ్రహ్మ సత్యం జగన్మిధ్యా జీవో బ్రహ్మైవ నాపరః "

పై వాక్యమును వీరుభయులు విశ్వసించిరి.

సారాంశమేమన :— ప్రారంభ దశలో జగత్తు మిధ్యయనియు చరమ దశలో జగత్తు బ్రహ్మమున కంటె వేరు కాదనియు కనుక యెటుచూచినను బ్రహ్మము, దానితోబాటు జగత్తు పరమ సత్యములను సిద్ధాంతము జ్ఞానాధిక్యము వలన లభించును.

ఇక ప్రధానాంశమున కుపక్రమించు చున్నాము.

# శ్రీ రా మా వ తా ర క థ న ము

శ్రియఃపతియగు మహావిష్ణువు త్రేతాయుగమున నయోధ్యకు ప్రభువైన దశరథమహారాజునకు సుతునిగా దేవకార్యార్థమై యవతరించె ననియు, అతడు ఇక్ష్వాకు వంశ రాజన్యులగు కకుత్థ్స - దిలీప - రఘు - అజ మున్నగు సార్వభౌములైన తన పూర్వుల కంటె మిన్నయై సువర్ణాక్షరములతో వెలసిన లోకోత్తర చారిత్రక మహాపురుషుడనియు ఆబాలవృద్ధమునకు విదిత పూర్వము.

జగజ్జేగీయమానమగు భగవానుని యవతార లక్ష్యము లందేదేనొక ప్రాతినిధ్య హేత్వంతరము ద్యోతకమగుచుండగా రామావతారమున విశేషించి యొకానొక సారస్యమైన ఆత్మీయత, అనిర్వచనీయ విశిష్ట విభాగము గ్రహణీయమైనది. అది భారతీయ జీవన వాహినిలో అంతర్లీనమై పునర్వికాస మయముగా పరిమళించుచున్నది.

శ్రీరాముడు పరిపూర్ణ శక్తిమంతుడయ్యును దన పథకము సాధించుకొనుటకై యనుసరణీయమైన ఉత్తమోత్తమగార్హస్థ్య ధర్మములన్నిటిని పాటించెను. తనకెదురైన జటిల సమస్యలు - అత్యాచారములు మున్నగు దుస్సంఘటనల నన్నిటిని నివారించుచు భారతీయ సద్ధర్మ పరాయణులందఱకు అండదండగా నిలిచి అక్షీణమైన ధర్మప్రచారము కొనసాగించెను. అందులకై యతడు ప్రాకృతునివలె క్లేశపడి, యిడుములం గుడిచి, కష్టసహిష్ణుడై సత్త్వప్రవృత్తితో, సహజశాంతి స్వభావముతో దన యాశయమును సిద్ధించుకొనెను.

శ్రీరామచంద్రుడు రామాయణములో భగవదవతారముగా మనకు గోచరింపడు సామాన్య మానవునివలె జీవితమంతయు నడిపి, సుఖ దుఃఖము లనుభవించుచున్నట్లు కనిపించును. రావణ వధ వఱకు తన పరత్వమును బాహ్యముగా ప్రకటింపక గర్భితముగ దాచియుంచినాడు. నేను భగవంతుడనని ప్రతిజ్ఞచేసి శ్రీకృష్ణునివలె ఉద్ఘాటింపడు. ప్రజలను రెచ్చగొట్టడు.

శ్రీకృష్ణుడు నేను కేవలము భగవంతుడనని ప్రకటించుటకు వెనుదీయలేదు. అతని జీవితములో ఒడుదొడుకులనుభవింపలేదు.

" రా మో వి గ్ర హ వా న్ ధ ర్మః "

శ్రీరాముడు మూర్తీభవించిన ధర్మ స్వరూపమని వాల్మీకి యుగ్గడించెను. ఇట్లే ఆయా ఘట్టములందు - " సత్య వాక్యో దృఢవ్రతః " - " రామో ద్విర్నాభి భాషతే " - మున్నగు పంక్తులుట్టంకింప బడియున్నవి.

"అ హం వే ద్మి మ హా త్మా నం రా మం స త్య ప రా క్ర మ మ్"

అని విశ్వామిత్రుడు ప్రత్యక్షముగ లభించిన మూర్తిమంతమమైన సత్య స్వరూపమగు పరతత్త్వముగా శ్రీరాముని గూర్చి భావించినాడు. ( ఇ చ ట రాముడు సత్యపరాక్రముడనగా సత్యయుక్తమగు పరాక్రమము గ ల వా డ ని యర్థము. ) ఇట్టివన్నియు శ్రీరాముని యవతారమునకు లక్ష్యభూతములై యున్నందున నతడు తన సర్వశక్తి సంపన్నతను నిరంకుశత్వమును బహిర్గత మొనర్చ నుపేక్షించి తన బాహ్య జీవితము నొకే విధముగ నడిపించెను.

రాముచేమి పలికినను - ఎద్ది యొనర్చినను అది సత్య దృష్టికి విరుద్ధము కాగూడదు. ఆకాశము విఱిగి పడినను ఆతని పతాక ప్రతిష్ఠకు భ ం గ ము రాకూడదు. అట్టి సత్యదృష్టితో రామాయణము పఠించిననాడు అందలి సంశ యములు వివాదాస్పద విషయములు జటిల సమస్యలు మన హృదయము నుండి పలాయనమై పోవును. అనగా జ్ఞానదృష్టితో తత్త్వము ( యథార్థ జ్ఞానము ) తప్ప మఱియెద్దియు మిగిలి యుండదని యర్థము. ఇది లభించిననాడు విశ్వ గర్భాంతరాళము నుండియైన సమాధానము పొందవచ్చును.

శ్రీరాముడు మాయామానుష విగ్రహుడు.

సృష్టియందలి జీవరాసులన్నిటికింగల నామధేయములతనికే వర్తించును. ఆయా శరీరములలో నాతడు కొలువుదీర్చి యున్నాడు. బహిః ప్రపంచము నందును వ్యాపించి యున్నాడు. మించియునున్నాడు. ఐనను నిస్సంశయముగా నతడు నామరహితుడే.

శ్రీమద్రామాయణము సార్వజనీన శక్తి సంపన్నమగు ఆదర్శకావ్యము. ఇది కాంతాసమ్మితమని, ధర్మశాస్త్రమనియు వాసిగాంచినది శాస్త్ర మనగా శాసించు లక్షణములు కలది. "శాసనాత్ శంస నాత్ శాస్త్రమ్" ఆచరణీయ విధులు శాసించునది. ఈ విషయము రామాయణ మందలి ముఖ్య పాత్రల ద్వారముగ నక్కడక్కడ వాల్మీకి వెల్లడించినాడు.

పుటము వేయబడి నిగ్గుదేరిన బంగారము ఏ వస్తువుగా చేయబడినను దాని ప్రకాశమునకు లోపము కలుగ జాలదు కదా!

ధర్మార్థ కామమోక్ష ప్రదమైన ఉదాత్తాశయములతో భారతీయ సంస్కృతికి ప్రథమ లక్ష్యభూతమగు ధర్మ ప్రబోధముతో రూపొందిన శ్రీమద్రామాయణమును ఏ దృక్పథముతో దిలకించినను నిరుపమానమైన రాముని వంటి మహానాయకుడే ఆదర్శమూర్తిగా గోచరించును.

బీజాంకుర న్యాయముగా (వట బీజమున ప్రాకృతమగు విశాల వృక్షము వలె) అసలు "రామ" యనెడు రెండక్షరములందే అత్యంత శక్తిమంతమైన ఉపనిషత్సారమంతయు నిబిడీకృతమై యుండగా తదంతర్గతములగు సమస్తశాస్త్ర పురాణేతిహాస గ్రంథములు దాని యాధిక్యమును ప్రతిపాదించుటయందాశ్చర్యమేమి?

మఱియు శ్రీరాముడు మహత్త్వపూర్ణమైన శ్రీ మహావిష్ణుని యవతారమని గ్రహించియే సర్వజ్ఞుండగు వసిష్ఠ మహర్షి "రామః" అని నామ నిరూపణ మొనర్చినాడు. తత్త్వార్థ రూపమగు ఆ నామము ధర్మ ప్రతిష్ఠకు అభయ హస్తముగా ప్రకాశించినది. రామ నామము భవరోగ నివారణకు రామ బాణమువలె అమోఘమగు దివ్యౌషధమునకు పర్యాయ వాచియైనది. నామస్మరణ మాత్రమున ననుభవించిన అలౌకికానందము అనిర్వర్ణ్యమై వెలసినది. జిజ్ఞాసువులకు మధుర సుగంధమయమైన కుసుమ కిరీటమైనది.

రామాయణగాథ భారతదేశమందలి యొకానొక రాజన్య కౌటుంబిక మర్యాదకు మాత్రము పరిమితి కాజాలదు. అది జాతీయ నిధి వంటిది. మహత్తరమైన భారతీయ హృదయములందు దేదీప్యమానముగా వెలుగొందు చున్న అఖండ దీపారాధన — విశ్వవాహిని. దాని ప్రతిభయందయా ప్రజా

జీవితములో చిరకాలముగా హత్తుకొని పెనవేసికొని పరిశుద్ధతను ప్రసాదించి క్రమపద్ధతిగా మఱియొక సువర్ణ సోపానమునకు అధిరోహింప జేయగలదు. శ్రీ రామ చంద్రు డు ప్రభువుగా ధర్మపరిపాలకుడుగా సామాన్య మానవ మాత్రుడుగా దశ ప్రకృతి ని ఏర్పరచుకొన్న సందర్భముల మధ్య సీతా వియోగాది సంఘర్షణలు ఆయన మనస్సును కలచివైచినట్టి యితివృత్తము మనకు సాక్షాత్కరించును. కాని, అతని కరుణామేఘము ఔదార్యముగా, నిండు పోతగా జగమంతట స్వేచ్ఛగా వర్షించెను. తత్ఫలితముగ సరస కేదారము లన్నియు పుష్కలముగా సఫలత జెందెను. శ్రీరాముడు విజ్ఞతా పరిపూర్ణ మైన బహువిధ కార్యక్రమములందున్నత విధాన నిర్ణేతయై లీలామయుడై మాయామయుడై వెలసినాడని లోకము గ్రహించి నమోవాకము లర్పించినది.

రామాయణ మందలి పాత్రలన్నియు ఐహికాముష్మికమైన అభ్యుదయ సాధనకు మహావిపత్తుల ననుభవించి ఆసురికమైన భయంకర కృత్యముల నుండి విముక్తి జెందుటకు ధర్మయుక్తమైన రామ రాజ్య సభ్యతను నిరాఘాటముగా సుప్రతిష్ఠిత మొనర్చుటకును హృదయ పూర్వకమైన సేవా పరాయణత్వముతో ఆత్మార్పణ మొనర్చుట వంటి విశిష్ట విషయములతో నిత్యసాంగత్యము పొందియున్నట్లు మనకు స్ఫురించుచుండును.

కారణము? రామాయణమునందు రాముడొక్కడే ముఖ్య నాయకుడగుటవలన తక్కిన వారందఱికి నతడే ధ్యేయమగుచున్నందున ఆవిధముగ రామాయణ గాథ ఏకైక నాయకత్వ ప్రభావమున మిన్నుముట్టవెలసిన యశస్సంపదకు నిలయమైనది.

ఆ నాటి సాంఘిక వ్యవస్థ కూపకూర్మము వంటిదికాదు. రామాజ్ఞవలె పదునుబట్టిన కత్తిపై నడక వంటిది. రాముడెంత ఆర్ద్రహృదయుడో అతని కోపము కూడ అంత శోభాయమానమైనది. శ్రీరామ రక్షయనిన, రామ బాణ మనిన తిరుగులేనిదని కదా యర్థము చెప్పుకొనుచున్నాము. మఱియొక విధముగ దీనినే చెప్పవలెనన్న శ్రీరాముని మనస్సు పన్నీరు చిలికిన చందనపు ముద్ద. "వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి" అనినట్లు అతని హృదయ మిదమిత్థమని వాకొన జాలము.

మాటవరుసకు :-

లక్షణుడు గీసిన గీటును దాటినందున కదా అమాయికయగు సీతామహా సాధ్వి రావణాపహృతయై భర్తృ వియోగ దుఃఖము ననుభవింప వలసి వచ్చెను పర్ణశాలయందున్న సీతను సన్యాసి వేషముతో రావణుడు గొంపోవుచున్న సందర్భమున అతి దుఃఖితయై తన్ను రక్షింపుడని విలపించుచు కేకలు వేసినది. ఆ పిలుపులో దేవతలు కూడ ఉన్నారు. రావణునికి భయపడి ఎవ్వరును ఆమెను రక్షింప లేకపోయిరి. జటాయువను పక్షియొక్కటే రావణునెదుర్కొని తన ప్రాణ త్యాగము చేసికొన్నది కదా! ఆహా ఇది యేమి త్యాగము భారతదేశమున జన్మించి దండకారణ్యములో నివసించుచున్న పక్షిసైతము ఆదర్శప్రాయమైన త్యాగమును ప్రదర్శించినది కదా! అటువంటి స్థితిలో ఆ పక్షిరాజమునకు మోక్షము లభించుట యేమి వింత ?

అధర్మముపై ధర్మవిజయము సాధింప బడుట కెంత మంది యెన్ని యారాటముల పాలు గావలసి వచ్చెను? ఇక ప్రస్తుత మనుసరింతము.

పూర్వకాలమున బ్రహ్మాది దేవతలు రావణ బాధలు భరింపజాలక శ్రీయః పతియగు విష్ణుదేవుని ప్రార్థింప నతని యర్ధాంశముచే శ్రీరామచంద్రుడై యవతరించెనని మున్నగు విషయములు రామాయణములందు వలబ్ధములగు చుండును.

అది సృష్ట్యాది పంచమ త్రేతాయుగము ( అనగా నిప్పటివారి లెక్కలు ప్రకారము క్రీ. పూ. ముప్పదివేలు సం॥ రముల క్రిందట ) విళంబి సం॥ ర చైత్ర శుద్ధ నవమీ బుధవాసర పునర్వసూ నక్షత్రయుక్త కర్కాటక లగ్నము.

విశేష మేమన :- ఆనాటి నుండి నేటి దనుక అట్టి గ్రహస్థితి సంఘటింపలేదని దైవజ్ఞ శిరోమణుల యభిప్రాయము. గ్రహసంచార వశమున శ్రీరామచంద్రుడనంత కల్యాణ గుణ పరిపూర్ణుడని శాస్త్రకారులు సిద్ధాంతీకరించిరి.

" ఉచ్చస్థే గ్రహపంచకే సురగురౌ సేందౌ నవమ్యాం తిథౌ।
లగ్నే కర్కటకే పునర్వసుయుతే మేషంగతే పూషణి॥ "

అని శ్రీరామచంద్రుని జాతక చక్రము గూర్చి భోజ చంపువున చెప్పబడినది.

" బహు స్యాం ప్రజాయేయ "

అని ఆదేశమయమున భగవానుని కవతార సంకల్పము కలిగినది. అతడు అఘటన ఘటనా సమర్థుడు కదా!


ఇటు భూలోకములో దశరథుని అశ్వమేధ యాగము. అది విజయ వంతముగా కొనసాగుచుండెను. యజ్ఞఫలితముగ దేవ నియోగమున మీద తెల్పబడిన సుముహూర్తమున మానవ శరీర ధారియై సగుణలీలా విభేదమున శ్రీరాముడై అవతరించెను. ఇందలి విశేషములన్నియు శ్రీమద్రామాయణ మున నభివర్ణితములై అందున నిచట వివరింపబడెను.

ఉదాత్తమైన రామ చరిత్రాంశము స్వభావతః సుందర విచారధారగా పర్యాప్తమైనది. జగత్కల్యాణమును ప్రతిపాదించు విశుద్ధ సంప్రదాయము లకు నందనోద్యానము. నిరర్థకమై, నిస్తేజస్కమైన యీనాటి ప్రాకృత కథా ఘట్టములతో నిది పరిశీలితము కాజాలదు. రామాయణమందు దుల్లేఖింప బడిన ఘట్టములన్నియు నవ్యాజ మనోహరములు.

వాల్మీకి సారస్వతము వేదోప బృంహణము. సనాతనమైన యాధ్యాత్మిక తత్త్వమును ధర్మప్రతిపత్తిగల మన ఆర్యుల సదాచార నియమములను కూలంకషముగ మథించి దాని సారమును అమృతీకరించిన దివ్యచింతామణి. భారతీయ విజ్ఞాన విశిష్టమైన " ఔపనిషదమ్ " అనగా నుపనిషత్తులచే తెల్పబడిన పరబ్రహ్మను దాని మర్యాదను దృఢముగా ప్రతిపాదించుచున్న దనుమాట — అంతటితో పొదుపు చేయబడలేదు. వేదములందు తెల్పబడిన కర్మ, ఉపాసన, యజ్ఞము, దానము, వ్రతము మున్నగు సమస్త వైదిక ధర్మములను పునశ్చరణ గావించినది.

ఉపనిషత్తులు మన ప్రాచీనులగు ఋషి ప్రణీతములు. ఋషుల యందొకరికొకరు బోధించుకొని గురు పరంపరగా ఏండ్ల తరబడిని రాబడి నందున వీనికి శ్రుతులని పేరు. ఈ యుపనిషత్తులు వేదములకు అంతములు కావున వేదాంతములనియు పేర్కొనబడుచున్నవి.

ఇవి యన్నియు సమస్త శోక మోహభయాదులను తొలగించి బ్రహ్మ సాక్షాత్కారమునకు వలయు గంతవ్య మార్గము లుపదేశించుట యందు దివ్యాంజనము వలె మానవులుల కుపకరించును.



# శ్రీమద్రామాయణము – వాల్మీకి

ఆదికవియని ప్రఖ్యాతి గాంచిన వాల్మీకి మహర్షికి తొలుదొల్తగా ప్రాదుర్భవించిన జ్ఞానమూలమున మహామహిమాన్వితమైన రామాయణ కావ్యమును మధుర ప్రసన్నమైన – సాహిత్య రూపకమైన యసర్గళ కవితా ధారచే త్రేతాయుగమున ప్రస్తరించి సంస్కృత భారతి నలంకరించెను. అమృత స్వరూపిణియైన ఆ వాగ్దేవతను తపఃఫలముగా సందర్శించి అతడు లోకమున కెఱింగించినాడు. ఆమెయే శ్రుతిమాత ( వేద సరస్వతి ). ఆ కావ్యము భారతీయ సాహిత్యమున ప్రామాణికమైన యితివృత్తముగల ఆది కావ్యముగ – జగత్తున కాదిబీజమగు పరమేశ్వరుని యవతారగాథగా ప్రపంచ పర్యాప్తి జెందినది. మానవున కభిలషణీయములైన చతుర్విధ పురుషార్థసిద్ధికి రాజమార్గమైనది.

సాహిత్యమనగా ఛందో పరిజ్ఞాన, కావ్య, నాటక, అలంకారిక విషయ విజ్ఞాన సంభరితమగు నొక సద్విద్య. ఇది అనంతము. ప్రసన్న రమణీయ మగు తమసా నది యొడ్డున నొకనాడొక కిరాతుని బాణ ప్రయోగ ము లమున రతిసుఖానుభవములో నిమగ్నమై క్రీడించుచున్న క్రౌంచ మిధునములో (గువ్వ పిట్టల జతలో) మగపక్షి నేలంగూలి విలవిలందన్నుకొని రక్తసిక్తమైన దేహముతో ఆకస్మికముగా మరణించెను. అట్టి వికృత దుస్సంఘటన వాల్మీకి మహర్షి దృష్టి పాతమైనది. ఆడుపక్షి ఏమియుంజేయజాలక దయనీయావస్థలో పరిపించుచు దుర్వ్యథతో దీనముగ నేడ్వసాగెను. దాని తిలకించిన జీవకారుణ్య మూర్తియగు నవ్వాల్మీకి ముఖము నుండి అప్రయత్నముగ నొకానొక నూతన చ్ఛందోవతారము స్ఫురించి బహిర్గతమైనది.

ఆ మునిపుంగవుని హృదయము దుఃఖావేశమున ద్రవించిపోయినది. చిత్తము కరుణాయత్తమైనది. ఆ నిర్వేద రస ప్రవాహిక నుండి, పెల్లుబికిన భావనా పరంపరల నుండి అపూర్వ సౌదామినివలె కవితా సరస్వతి యావిర్భ వించినది. ఆమె పరమాత్మ కళయైన అమృత స్వరూపిణి గాని సర్వసామాన్య కాదు. ఆమె వేదమాత.

శ్లో॥ మా నిషాద ప్రతిష్టాం త్వమగమ శ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచ మిధునా దేక మవధీః కామ మోహితమ్ ''

అని శోకసంతప్తుడై యామహాముని వచించెను. యథాలాపముగ బయలు వెడలని ఆకస్మికమైన వినూత్న ఛందోమయ వైఖరి కతడచ్చెరువంది నిమీలిత నేత్రములతో వ్యగ్రుడయ్యెను.

రుద్ధకంఠుడైన యమ్మహాత్ముని శోకమే శ్లోకరూపముగా రామాయణ రచనా విధానమునకు బీజప్రాయమైన నాందీ ప్రసంగమైనది. నారదోపదేశము స్మృతి పథములో నర్తించినది. తత్కాలమున జరుగుచున్న శ్రీ రా మ ని చరిత్రములో నికముందేమి జరుగ గలది సంగ్రహముగ తెలిసికొనెను. బ్రహ్మదేవుడు సాక్షాత్కరించి, మునివర్యా! శబ్దబ్రహ్మజ్ఞానమున నీవిపుడుత్తమ ప్రతిభాశాలివైతివి. కాన, విశ్వశ్రేయము నొడగూర్చు వే ద మ య మ గు శ్రీరామచంద్రుని చరిత్రము గానమొనర్చుమని ఆశాసించి తిరోహితుడయ్యెను.

పరిణత ప్రజ్ఞుడగు వాల్మీకి మహర్షికి జ్ఞాన నేత్రము ప్రకాశించెను. బ్రహ్మజ్ఞాన మంతయు నతని గుప్పిటయందిమిడి పోయెను నారదోపదేశము నాధారమొనర్చుకొని శబ్దబ్రహ్మ వివర్తనమైన రామాయణ బృహత్కావ్యము లోకప్రియత నార్జించి, ప్రజాహృదయము నుత్తేజిత మొనర్చెను. లావణ్యపు గని వంటి సంస్కృత భారతి నపూర్వాలంకార శోభితను గావించెను. తన మనోరథములన్నియు చేతియున్న చింతామణివలె సిద్ధింప జేసికొనుటకు సమయము లభించెను.

పై నుదహరింపబడిన శ్లోక తాత్పర్యమిట్లున్నది

తా॥ ఓరీ నిషాదా! కామ మోహితమై రతిసుఖానుభవ సం లగ్నమైన క్రౌంచ మిధునములో నొక్కటిని చంపితివి. కావున నీ కీర్తి నశించిపోవుగాక! శాశ్వతీస్సమాః=నీవింక బ్రతికి యుండదగు బహువత్సరములు ప్రతిష్ఠాం=నీ కాంతతో గూడిన యునికి యీ లోకమందు పొందకుందువుగాక! అల్పకాలమే పొందగలవని ముని శపించెను.

అంతరార్థము :- ఇందు "మా నిషాద" అనుపదము సామాసికమైనపుడు లక్ష్మీపతి యని అర్థము. ఇది రాముని సంబోధనమై యుండును. "మా" వేరు పదముగను "నిషాద" వేరు పదముగను విభజించి విడదీసినపుడు "నిషాద" అని బోయవానికి సంబోధనమై యుండును. అప్పుడు పక్షిమిథునము రావణ మండోదరులుగా నూహింపబడుదురు. అందు కామాతురుడగు రావణుడు, అతని వధ విధానము ద్యోతకమగును.

రావణ వధయందు శ్రీరామునకు "శాశ్వతీస్సమాః ప్రతిష్ఠాం అగమః" అనగా చిరస్థాయి యగు ప్రతిష్ఠ పొందుదువు గాకయను నర్థము గమ్యమాన మగుచున్నది.

ఇట్టి దుర్భరమైన శాప వాక్యమునకు రామ కథార్థ సూచకముగా ప్రతిపాదితమైన విశేషార్థముగల శ్లోక విషయము ఆ మహర్షికి తెలియదు. ప్రక్కనున్న ఏక సంథాగ్రాహియైన తన శిష్యుడు భారద్వాజున కది కంఠస్థమైనది.

వాల్మీకి చరిత్రము :-

ఉదాత్తమైన వాల్మీకి చరిత్రము స్కాంద పురాణాంతర్గతమైన "ధర్మఖండమం" దున్నది. ఇంకను వాసిష్ఠ రామాయణము, భక్త విజయాదులందును ఈ కథ తెల్పబడి యున్నది. అతని పూర్వజన్మ వృత్తాంతాదికము, నికృష్టమైన చోర ప్రవృత్తి మున్నగునవి సంప్రదాయ సిద్ధముగ వినవచ్చుచు ప్రత్యేక గ్రంథములందు చిత్ర విచిత్ర రీతుల నభివర్ణితమైయున్నవి.

వాల్మీకి కిరాతుడని, సప్తర్షి సందర్శనానంతరము తారక మంత్ర ప్రభావము వలన నతడు మహర్షియై వెలసినాడని కొన్ని గ్రంథములు వివరించినవి. అవి యన్నియు నిందు బేర్కొనుట గ్రంథ విస్తృతి హేతువని, భారము తగ్గించు తలంపున విడువబడెను. కాని, వాల్మీకి చరిత్రమునకు సాహిత్య రంగములో విశిష్టస్థానమున్నట్లు శ్రుత పూర్వమైన విషయము.

వల్మీకమనగా పుట్ట - దాని నుండి జనించినందున వాల్మీకి యన బడెను. అనేక వేల దివ్యవత్సరములు పుట్టలు పట్టినటులుగా తపమొనర్చి నందున సంజాత కౌతూహలుడై యతడు రామనామము లోకమున కందింప గల్గినాడు. కాని పొట్ట నింపుకొనుటకై పన్నుగడతో నేర్పఱచిన ఇంద్రజాలము వంటి స్వార్థము కొఱకుకాదు. ఆతని హృదయమెల్లప్పుడు యోగమార్గమున విహరించుచు పరమాత్మయం దంతర్లీనమగుటకు తీవ్రాను తాపముతో నిష్ఠా గరిష్ఠమైయుండును.

ఒక కథనము ప్రకారము సార్వత సంప్రదాయమున వాల్మీకి మహర్షికి ఋక్షుడు - భార్గవుడు - ప్రాచేతసుడు అను నామాంతరములు కలవు.

వాల్మీకి తత్త్వము కుల, మతాలకు అతీతమైనదిగా చెప్పవచ్చును. సముద్రమందు జాఱవిడిచిన యుప్పుగడ్డవలె నతడు భక్తి ప్రపణతతో పరమే శ్వరునియందేకత్వ సిద్ధిననుభవించి,అతనిలో లీనమై ఈశ్వర జ్ఞాన పరిపూర్ణుడై భాసిల్లినందున నిట్టివన్నియు నతని యందు లుప్తప్రాయములైనవి. సర్వ సమత్వాభిలాషియై ఆ మహాకవి కథా వస్తువుగా రామాయణమును చేపట్టినాడని- ప్రవృత్తి మార్గ సంబంధములో తన కృతితో దనకభేద ప్రతిపత్తికలదని యుత్ప్రేక్షించి చెప్పగలము.

పరమ ధార్మికుడగు వాల్మీకి గంగానదికి చెంతనున్న తమసానదీ తీరమున జింతిల్లుచు నందందు సంచరించుట - క్రౌంచ మరణము - శ్లోకావిర్భావము - లోక పితామహుడగు పితామహుని ప్రసన్నత మున్నగు ననిదం పూర్వమైన సన్నివేశములు నివియన్నియు బరిశీలించిన నమ్మహానుభావుని దివ్యతపఃశక్తి సంపన్నములుగాని, నేతి బీఱలువలె ననుపస్థితములు కావు. తపశ్శ్లాఘము పరమాత్మను అందుకొనుటకై యొనర్పబడు సాధనా విభాగము కదా! అది జన్మ సంస్కార ఫలితము.

"శ్లో॥ వాల్మీకి గిరి సంభూతా రామ సాగర గామినీ
పునాతి భువనం పుణ్యా రామాయణ మహానదీ"

# రామాయణ - భారతములు

మనోరంజకమైన సాహిత్య సౌరభములో - సంస్కృత సారస్వత ప్రకాశనములో వాల్మీకి సరస్వతి త్రేతాయుగమున ప్రాదుర్భవించినందున దానికతడు ప్రథమ సంచాలకుడు. వ్యాస భారతి ద్వాపరాంతమందుద్భూతమైనది. ఈ యుభయ భారతులు అనశ్వరములై భావ దారిద్ర్యమునకు లోనుగాక కాల పురుషుని గర్భాంతరములో కసిమసంగక బహుకాలము ఉత్తమ శ్రేణికిజెందిన యాధ్యాత్మిక సాహిత్య మహితాలంకార శోభితములై ధవళ కాంతులతో మెఱయ గారణమేమి? అది యమ్మహాత్ముల తపశ్శ్రీసంపన్నత - ఉపాసనా దక్షత - విశ్వశ్రేయము నాకాంక్షించు శిష్య ప్రశిష్యము ముఖ్యకారణమని చెప్పవచ్చును.

రామాయణ కర్త వాల్మీకి - భారత కర్త వ్యాసుడు. వీరిరువురు పరమాద్భుత శక్తి గల మహర్షి సత్తములు. సారస్వతాకాశమున ధ్రువతారలు సంకల్ప సిద్ధులు. ఇరువురును వేదాధ్యేతలు. వీరుభయులు గ్రంథ రచనకు బూర్వము సంకుచిత స్వార్థ పరత్వమున కెదురీతగా తపోనిధులై పునీతులై వెలసిరి. వారి రచనలు శిరోధార్యములైనవి. వాల్మీకి మహర్షి వైష్ణవాచార సంపన్నుడు. వ్యాస మహర్షి పరమ శైవుడుగా మన మవగాహించు కొనవచ్చును.

రామాయణ మహాభారత గాథల నెఱుంగని భారతీయుడు లేడు. అది నిర్వివాదము.

రామాయణమునకు కథా నాయకుడు రాముడు. సకల ధర్మస్వరూపుడు- భారతమునకు కథా నాయకుడు ధర్మరాజు, అజాత శత్రువు.

శ్రీరామమూర్తి దివ్య చరిత్రమగు రామాయణమును వాల్మీకి వ్రాయ జింతించుచుండగా నతనికి వాగీశ్వరుడు సాక్షాత్కరించెను,

" శ్లో॥ ఉపవిష్టః కథాశ్చాన్యాః చకార ధ్యాన మాస్థితః
ఆజగామ తతో బ్రహ్మా లోక కర్తా స్వయం ప్రభుః "

ఇట్లే వ్యాస మహర్షి భారత రచన గూర్చి చింతిలు చుండగా నతని యొద్దకు బ్రహ్మదేవుడు విచ్చేసెను.

"తత్రా జగామ భగవాన్ బ్రహ్మ లోకగురుః స్వయమ్"

అని చెప్పబడి యున్నందున ఉదార వృత్తార్థ మనోహరములగు శబ్దములు పరమేశ్వర చింతనా పరిశిష్టమైన భాషా పాటవము – తదనుగుణమగు భాషా పరంపరతో వెలసిన కవితా మాధుర్యము ఇవి యన్నియు నుభయ గ్రంథము లందు-నించు మించుగా నొక్క మాదిరిగనే యున్నట్లు విజ్ఞుల మతము. రావణ వధానంతరము శ్రీరాముడు అగ్ని పరిశుద్ధయగు సీతా సమేతముగ పట్టాభిషిక్తుడై రాజ్యము పొందిన పిమ్మటనే వాల్మీకి తన రామాయణ గాథను రచించినాడని వాల్మీకమందు కలదు.

శ్లో॥ ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకి ర్భగవాన్ ఋషిః
చకార చరితం కృత్స్నం విచిత్రపద మాత్మవాన్

(రామా-బాల, 4-1)

అట్లే వ్యాసమునియు పాండవులు గతించిన పిదప (వారి రాజ్య పరిపాల నానంతరమున) భారత రచన కుపక్రమించెను.

శ్లో॥ తేషు జాతేషు వృద్ధేషు గతేషు పరమాం గతిం
అబ్రవీత్ భారతం లోకే మానుషేస్మిన్ మహాన్‌ఋషిః

(భార - సంభవ, 1-అ)

గమనిక :- శ్రీరామ జననమునకు మున్నే వాల్మీకి రామాయణ మహాకావ్యము రచించి యుంచినాడని మరికొన్ని రామాయణములందు చెప్ప బడియున్నది. ఆ విషయముల నిచట విస్తరింపక విడిచితిని.

భారతము :- వ్యాస భగవానుని మహాభారతము ఐతిహాసిక కల్ప వృక్షమని సాహిత్య ప్రక్రియ లన్నిటియందు దీని ప్రభావము పర్యాప్తమైన దని రెండున్నర వేల సం॥ రముల నుండి భారతీయులీ గ్రంథమును స్మరించు చున్నారు. దీని యందలి 12–13 పర్వము లందలి నీతి కథల నుండి

పంచతంత్రము-హితోపదేశము మున్నగు గ్రంథములు విడివిడిగా నేర్పడినవి. తృతీయ పర్వమందలి నలోపాఖ్యానము – రామాయణ కథ – మార్కండేయ చరిత్రము మున్నగునవి కథా సాహిత్యమునకు మార్గదర్శకములైనవి. ఇతిహాస మనగా "ఇ తి హ ఆ స" ఇట్లాయెను. 'అని' కడచిన సంఘటన లన్నియు క్రమముగా వేరొకరితో తెల్పుటయని అర్థము. వ్యాస భగవానుడు తన సంకల్పము ననుసరించి సందర్భోచితముగ వేదాంతసారమును, వేదధర్మ ములను సంగ్రహించి ఉదాత్త రమణీయముగా భారతగాథను రూపొందించినాడు.

ఆధ్యాత్మిక గంగా ప్రవాహముగ బరిగణింపబడిన "భ గ వ ద్గీ త" రత్నకలశమువలె దీనియందిమిడి యున్నందున సామాన్య చారిత్రక గ్రంథము లన్నిటివలె గాక పంచమవేదమని కూడ చెప్పబడుచున్నది తత్త్వశాస్త్ర ప్రతినిధులగు శంకరాచార్యులు మున్నగు మహానుభావులు భగవద్గీతకు భాష్య ములు వ్రాసి దాని ప్రభావము నుత్తేజితమొనర్చిరి. భగవద్గీత ప్రపంచ భాష లన్నిటియందు ననువదింపబడినందున దానితోబాటు భారతీయసంస్కృతి జీవ స్రవంతిగా దేశదేశాంతర వ్యాప్తమైనది. భా ర తీ య సంస్కృతి యొక్క ప్రాథమిక దశ నుండి యింతటి దనుక మహాభారతము అధ్యయనము గావింప బడుచు "స త్య మే వ జ య తే" అను "జ య" శబ్దముతో ధర్మజ సామ్రాజ్య పట్టాభిషేకములు జరిపించు కొనుచున్నది. ఇది అనశ్వర కావ్యము.

-()—

# తార్కిక సమస్య

వాల్మీకి రామాయణ మందలి మూలకథలో ననేక ప్రక్షిప్త భాగములు దొర్లియున్నవని, వివిధ మతాను యాయులు ఆ గ్రంథమందు చేయికల్పించు కొని తమ యిష్టానుసారము కూర్పులు - మార్పులు - చేర్పులు జరిగించి నందున వామనమూర్తి వలె మిన్నుముట్ట బెరిగి పోయినదని కొందరు వైమర్శి కులు, మతాంతర ప్రవిష్టులు అభిప్రాయపడుచున్నట్లు లోక విదితము.

ఇంకను రామాయణము గూర్చియనేక సందేహము లుత్పన్నములగు చునేయుండును. అసలు వాల్మీకియే యింత గ్రంథమును రచించినాడా? అట్లయిన తాను ప్రత్యక్షముగా చూచిన సంఘటనయే వ్రాసినాడా? లేక యిది యంతయు ఊహాగానమే యగునా? అను ప్రశ్నము లనేకములున్నవి.

రామాయణ కథా నాయకుడగు శ్రీరాముడు అవతారపురుషుడు కాడని, ఇక్ష్వాకు వంశీయులం దుద్భవించిన యుత్తమ క్షత్రియుడు, మానవోత్తముడు మాత్రమేయను దృక్పథముతో వాల్మీకి రామ పాత్రను చిత్రించినాడని, రాముడు కూడ తాను అవతార మూర్తినని యెన్నడును భావించలేదని, ఆకథ యందు భగవంతుడుగా సాక్షాత్కరింపని రాముని యందు దైవత్త్వమారోపించి తెల్పుట యొకానొక మతాంతరావేశ లక్షణమని, తత్సంబంధ విషయములిట్లే అనుమానస్పదమైన ప్రక్షిప్త భాగములే యనియు అందుకు నిదర్శనముగా గొన్ని రామాయణ శ్లోకములు చూపుచుందురు.

"కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్" అనియు ఆ ప్రకారముగనే "మహర్షే! త్వం సమర్థో సి జ్ఞాతుమేవం విధం నరమ్

ఈ మొదలగు విషయములు వాల్మీకి, నారద మహర్షిని ప్రశ్నించి యడిగి తెలిసికొనినాడని ఆ గ్రంథమే ప్రమాణభూతమైనట్లు అభిప్రాయపడుచున్నారు.

వాల్మీకి రచించిన రామాయణ గాథపై తార్కిక దృష్టి ఏ మాత్రము

పనిచేయజాలదు. ఏలయన, ప్రతిబింబముపై ప్రయోగింపబడిన శస్త్రాస్త్రములు మూల వస్తువుయొక్క అంగమునైన స్పృశింపజాలవు కదా!

కొందరు మేధావుల సార్వత్రిక మధుర భావనలో వాల్మీకి కాలమునందే రామాయణము జరిగినదని తెల్పవీలులేదని - రామకథ జరిగిన పిమ్మట నచిర కాలమునందే ప్రజా హృదయములో నాటుకొనిన ఆనాటి పరిస్థితులు మఱుపు తగులని సమయములో రామాయణ రచన జరిగినదని యున్నది.

నీతి నియమములతోడను - ధర్మపరాయణతతోడను ఆకాలమందు ప్రవర్ధ మాన మగుచున్న మహాకోసల - విదేహ రాజ్యముల ఆర్యనాగరికతపై అసహ్యించుకొని అనార్య సభ్యతతో దుండగములు పేరేపించు పాశవిక శక్తులతో అత్యాచారము లొనర్చుచు ప్రజా పీడనమునకు వెనుదీయని లంకా రాజ్యముల పారస్పరికమైన ప్రచండ సంఘర్షణలు ఇతివృత్తముగ గ్రహించి ఆదికవియైన వాల్మీకి రామాయణ రచనకు బూనుకొనినాడని కొందరను చున్నారు. ఎవరెట్లు విమర్శించినను రామాయణమునకు ప్రపంచ మందేర్ప డిన అగ్రస్థానము అఖండ ప్రజ్ఞామయమైనందున దానికి శుష్కమైన అప ప్రథతో వాచోపవాదములతో - తర్క వితర్కములతో పనిలేదు.

ఆ కథామూర్తుల యనుబంధము విమర్శలన్నిటికి నతీత మైనది. అవి యన్నియు నొకయెత్తును - వాల్మీకి పేర్కొనిన శ్రీరాముని త్యాగ లక్షణము లన్నియు నొకయెత్తును మానవ హృదయ గ్రంథులను కదిలించి ఉజ్జ్వాల లూగించి పుణ్యసీమలకు ఉన్నేత్తున గొంపోయినవి.

భారతీయ భావనలో త్యాగమూర్తులైన మహనీయులను -యతీశ్వరులను దైవ సదృశముగా బూజించి సేవించుట సదాచారమైయున్నట్లు మనము విశ్వ సించి ఆ విషయము జ్ఞాపకముంచు కొనవలయును.

—()—

# రామాయణము వేదస్వరూపము

"వేదము" అను పదము 'విద్' ధాతు జన్యమైనది. 'విద్' అనగా తెలివియని, జ్ఞానమనియు నర్థద్వయము కలవు. వేదము భారతీయుల అతి ప్రాచీనమైన పవిత్ర ధర్మశాస్త్రము. జాతి సంస్కృతికి మానదండము. 'వేద' మనగా మఱియొక యర్థమున శ్రుతి–లేక, అంతరాత్మకు వినబడు పరబ్రహ్మనాదము.

దేశకాల పరిస్థితుల ననుసరించి యొక్కొకరి యనుభూతి వేరు మార్గమున నున్నను ఉండవచ్చును. కాని భూతవర్తమాన భవిష్యము లందలి మహర్షుల బుద్ధివైభవమంతయు వేదము నందు ప్రతిఫలించును. వేదస్వరూపము పొడకట్టుటకు ముందు వేదాంగములైన శిక్షావ్యాకరణాది తదితరశాస్త్రములందు సమగ్రమైన జిజ్ఞాస కలిగిన యెడల వేదవిద్య పునః పరిణతి పొందగలదు.

వేద సముద్ధరణ మపేక్షించి భగవానుడగు శ్రీమన్నారాయణుడు ప్రథమావతారమైన మత్స్యావతారమును ధరించి వేదములను తస్కరించిన సోమకాసురునితో పోరాడి సముద్రనిక్షిప్తమైన వేదరాశిని ప్రపంచమునకు తిరిగి ప్రసాదించెను.

వేదము భారతీయ విజ్ఞానమునకు జీవనాడి వంటిది. వేద నిక్షిప్తమైన మహోత్కృష్ట భావ సంపద సమస్తదేశములకు నానాటికి మార్గదర్శక మగుచున్నది. ఇది ఏ నలుపది, యేబది వేల వత్సరముల క్రిందటి మాట—

ప్రతి విషయము ఆత్మభావనతో – ఆత్మౌపమ్యమగు సమ్యగ్దర్శనముతో పరీక్షించి చూచుట – చూచి యద్దాని నిజ స్వరూపము గ్రహించుట—

అనగా సృష్టి యందలి ప్రతి వస్తువును బరిశీలించి దాని యాదార్థ్యము గ్రహించు శక్తి వేదప్రవచనమున అవగతమగునని ప్రాచీన మహర్షులు పరిపూర్ణ తర్కవితర్కములతో గ్రహించిన విషయము మనకు బోధించిరి. సాయణాచార్యుని తైత్తరీయ భాష్య భూమిక యందిట్లున్నది.

" ప్రత్యక్షేణాను మిత్యావా యస్తూపాయో నబుధ్యతే
ఏనం విందంతి వేదేన తస్మాత్ వేదస్య వేదతా "

ప్రత్యక్షానుమాన ప్రమాణాదులచే నగ్రాహ్యమగు అలౌకిక అతీంద్రియ విషయములన్నియు వేదముచే తెలియబడును. కనుక వేదమునకు వేదత్వము సిద్ధించుచున్నదని భాష్యకారులు నిర్ణయించిరి. కాని చార్వాక, ఆర్హత, జైన, బౌద్ధాదులు దీని నంగీకరింపక ఖండన గ్రంథములు వెలయించిరి. వేద ప్రమాణమున జగత్తునందు భగవంతుడు తక్క మఱియేదియు శక్తిమంత మైనది కానరాదని - భగవంతుని యంతరంగమే ప్రపంచమును ధారణ పోష ణాదులచే పరిపాలించు చున్నదని గ్రహింపవచ్చును. సామాన్య మానవుడు తన యనుభవమందలి భౌతిక సామగ్రి నిత్యసత్యమని గ్రహించును. సకలేంద్రియాతీతమగు పరమాత్మయొక్క నిత్యసత్యత్వమును గుర్తింపడు. స్వర్గసౌఖ్యమున కంటె నధిక గౌరవభావముతో వస్తుసాంగత్యమందు మోహ గ్రస్తుడై జనన మరణ సంసార చక్రమున తిరిగి కుములుచున్నాడు.

వేదము బహుపురాతనమైన ఆర్యుల సంస్కృత భాషయందు ప్రచలిత మైనది. ఛందశ్శాస్త్ర సంబంధి వృత్తములతో - ఉదాత్తాను దాత్తాది స్వర విభేదములచే విశేషార్థ ప్రతిపాదకములగు పెక్కు వైదిక మంత్రములకు నివాసస్థానమై శబ్దార్థ శక్తులతో పరిపుష్టమైనది. వేదములు ప్రమాణములా అప్రమాణములా యను వివాదము క్రీస్తు పూర్వము అనేక శతాబ్దముల నుండి భారతదేశమున జరుగుచు వచ్చినది. వేదములెప్పుడు పుట్టెనని మన భారతీయు లలో ప్రాజ్ఞులు పరిమార్గలోనర్చిరి. కాని ప్రయోజనము దొరకక పోయెను. అవి అనాదులని, అనంతములని నిశ్చయించిరి.

వేదము అపౌరుషేయము. మానవమాత్రునిచే నేర్పడినది కాదు. అది పరమేశ్వర నిశ్వసితము. వేద ధర్మప్రమాణము సంతప్త హృదయమునకు అమృత స్రోత - దిక్కాలాద్యనవచ్ఛిన్నుడగు పరమపురుషుని ఇచ్ఛ చేతనే ఆతని ముఖము నుండి యెప్పుడో వెలువడి యుచ్చరితములైనవని నైయాయి కులు సిద్ధాంతపరచి నందున నందలి ప్రత్యక్షరము ప్రమాణమైనది.

వేదము యేమి ప్రవచించుచున్నది? దాని మహత్తరశక్తి యెట్టిది? అని చర్చించునాడు వేదము "ఏకం సత్" అను ట్టి ఏకైక పరమేశ్వరుని నుండి సమస్త ప్రజానీకము కోటానుకోట్ల ప్రాణి సముదాయమును అంటిపెట్టుకొని యున్నదని యుగ యుగాంతము ధర్మ సత్య మార్గములను గవేషించు సంస్కృతీ సాంప్రదాయక దివ్యపతాకమని - ఇది భారతీయుల మౌలిక తత్త్వమును సాక్షాత్కరింపజేయు సుమంగళాలంకారమగు ప్రథమ సౌభాగ్య చిహ్నమని గ్రహింపవచ్చును.

"శ్రుతి॥ ఏకం సద్విప్రా బహుధా వదంత్య-
గ్నిం, యమం మాతరిశ్వాన మాహుః"

తా॥ ఒక్కడే యగు మూలతత్త్వమును విద్వాంసులు అగ్ని-యమ-మాతరిశ్వ (వాయువు) మున్నగు ననేక నామములచే పిలుచుచున్నారు.

భారతీయ సంస్కృతి యనగా భారతిని పెంపొందించు శక్తి. భా=ప్రకాశము లేక సచ్చిదానంద మయమైన దైవ స్వరూపము. దీనియందు గల రతి=ఆసక్తియే భారతి యనబడును. ఇది భక్తికి పర్యాయ వాచియై యున్నది.

కావుననే మనదేశము - మనసంస్కృతి - భారతీయ వ్యక్తీకరణమునకు విశిష్టమైన సంస్కార లక్షణములకు ప్రతి బింబము.

సంస్కారమనగా ఏ క్రియ వలన లేదా సంజ్ఞ వలన హృదయము జ్ఞాన యోగ్యమొనర్పబడునో అది సంస్కారము.

"సంస్క్రియతే జ్ఞాన యోగ్యతా మాపద్యతే పురుషస్య చిత్తమనేన ఇతి" అని దీని నిర్వచనము కలదు.

—()—

# ప్రతిభావంతుడు వాల్మీకి

ప్రపంచ వాఙ్మయములో నాధ్యాత్మిక రంగమున వేద వాక్యములకు శ్రుతి ప్రమాణమనెడు విశ్వవిఖ్యాతమైన ఆదరణ కలదు. వేదము మహోత్కృష్ట వాఙ్మయ సంపదకు కాణాచి. దాని విలువ దనము ప్రాచీన మహర్షులానాడు పరిపూర్ణముగా గ్రహించిరి.

వేదమంతయు మంత్రబీజ మయమని, వేదముచే తెలియబడు పరమాత్ముడు దశరథ తనయుడగు శ్రీరాముడై యవతరింపగా దానిని ప్రతి పాదించు వేదము వాల్మీకి ముఖ నిర్గతమై శ్రీమద్రామాయణముగ రూపొందబడినది. వేదార్థోప బృంహణమైన (వేదములోని యర్థమునే విశేషించి వ్యాఖ్యానించినందున) ఆ మహాకావ్యము మధుమయ ఫణితిగా బ్రహ్మదేవుని యాజ్ఞచే వాల్మీకి రచించినాడని తెలిసికొంటిమి. అందువలన నారాయణ నామము రామనామ గర్భితమై చతుర్వింశతి సహస్ర శ్లోక విస్తృతముగ గ్రంథ రూపమున నవతరించినట్లు స్పష్టమగుచున్నది.

సర్వవేదసార భూతమగు గాయత్రీ మంత్ర మందలి ఇరువది నాల్గక్షరములు గ్రమముగా నొక్కొక్క శ్లోక సహస్రమున కొక్కొక్క యక్షరము కలిగి యున్నదని గాయత్రీ రామాయణము తెలుపుచున్నది.

వేదములకు దరువాత వాల్మీకి నూతనముగా కవితా సృష్టి యొనర్చి దానినే దైవముగా సంభావించి అదే ధ్యేయముగా రామాయణ ప్రణేతయైనందున నితనికి కవిబ్రహ్మయని పేరు కలిగినది. రామాయణ చరిత్రము వేదసమ్మితమై వెలసినది. అందలి సాహిత్యము అక్షరము, అనశ్వరమునైనది. కనుక అతడు ప్రపంచమున జన్మించి అత్యుత్తమమైన ఆధ్యాత్మిక, నైతిక మేధా సంపన్నుడు.

వాల్మీకి తన కలవడిన అనితర సాధ్య పాండిత్య మంతయు అవాఙ్మానస గోచరమైన దేవతా కటాక్ష వీక్షణమే యనియు అదియే తన ఐహికాముష్మికమగు యశః సమృద్ధికి ఆచంద్రతారకమైన అక్షయ భాండారమని విశ్వసించెను.

అది తన సముజ్జ్వల భాగ్యరేఖ యనవచ్చును లేదా ఆమూలతత్త్వము యొక్క మహత్త్వమనవచ్చును. దానియందు సమస్త భారతీయులు వారసత్వముద్ర వేయుచున్నపుడు కాదను వారెవరు?

"శ్లో॥ వేద వేద్యేపరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"

అని చెప్పబడినందున శ్రీరామచంద్రుని అతిలోకవ్యక్తిత్వము - అతని నామధేయము - జీవిత చరిత్రము మున్నగునవి వర్ణనాతిక్రమణములై, బ్రహ్మదేవుని వరప్రదాన హేతువులై శ్రుతిపేయత గన్నందున రామాయణము పురాణముల కంటె నుత్కృష్టమై మహాకావ్యముగ వెలసినది.

"రామ మంత్రార్థ విజ్ఞానీ జీవన్ముక్తో న సంశయ"

అని చెప్పబడినది. మీద బేర్కొనిన వివరమంతయు నొక్క పద్యములో ప్రఖ్యాతాంధ్ర కవయిత్రి తన రామాయణ కావ్యములో నెంత సుందరవంతముగ రచయించినదో చూడుడు.

"కం॥ శ్రీరఘు రాము చరిత్రము
నారదుడెఱిగించుటయును నలువ యనుజ్ఞన్
శారద కృప వాల్మీకి య
దారత రామాయణమ్ము దా రచియించెన్" (మొల్ల. రా.)

తపస్స్వాధ్యాయ నిరతుడు, దేవగాయకుడు నగు నారదుడు బహుశ్రుతుడై వాల్మీకున కుపదేశించిన యుపపత్తిచే రామాయణ మందెంతయైన రమణీయతర విశేషమున్నది

"శ్లో॥ చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరం
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్"

ఇత్యాదిగా చెప్పబడుచున్న రామకథ యందలి యొక్కొక్క యక్షరమే మహాపాతక వినాశమొనర్చుచున్నది.

ఇచ్చట శతకోటి=నూరు కోట్లు అని యర్థము. అక్షర సాంఖ్యశాస్త్రము చెప్పిన శత=మూడు. కోటి=ఎనిమిది అని అర్థము. అనగా 3×8=24- ఇరువది నాలుగువేల శ్లోకములతో రామాయణము వెలయింపబడినది.

రామాయణ కావ్యపఠన పాఠనములవలన గీర్వాణవాణీ పరిజ్ఞానము - దైవచింతనము - ఆత్మైక జ్ఞానము మున్నగు సుగుణ సంపదలు అనుషంగికముగ నలవడుట విద్వన్మూర్ధన్యులకు సుపరిచితము,

రామాయణము విభిన్న పక్షములకు జెందిన మానవ జీవనమందలి యమూల్య గంభీరానుభూతులను - గహన సమస్యలను బరిపుష్టముగా నభివర్ణించిన మహత్త్వపూర్ణమైన సూక్తి రత్నములకు పెన్నిధియైనది. స్ఫూర్తిజనకమైన భాషా పాటవముగల కవితా రీతుల నన్నిటిని కమ్మగా ఆలింగన మొనర్చుకొన్నది. రామాయణమందలి కొన్ని ఘట్టములకు బాహ్యార్థ - అంతరార్థ - విశేషార్థములతో హృదయంగమమైన రహస్యములను (అనగా సీతయే పరాశక్తి, శ్రీరాముడే పరమాత్మయను సూత్రములు) మన పౌరాణికులు తెలుపగల్గుచున్నపుడాయా సందర్భములందెట్టివారికిని భక్తిరస పరీవాహముగా నొడలు పులకరింపకమానదు.

సద్గుణ సాగరుడగు చంద్రుని చుట్టుకొనిన నక్షత్రములవలె జనులతని బరివేష్టింతురు. చంద్ర కిరణములను చకోరము లనుభవించి తన్మయతజెందినట్లు తనమాటల పొందికను శ్రోతలాకర్షింతురు.

సాధారణముగ అనుష్టుప్ ఛందస్సుతో నిర్వర్తితమైన ఆ శ్లోకపంక్తిలో శబ్దమాధుర్యము - అర్థగాంభీర్యము - భావౌన్నత్యాదులు శ్రోతలను, పాఠకులను ఉఱ్ఱూత లూగించును. కొన్నియెడల హృదయ విద్రావకముగ నుండును.

వాల్మీకి మహర్షి సర్వజ్ఞుడు, బ్రహ్మవేత్త, అసాధారణ మేధామయుడు. కాగా సారస్వత కళా రహస్యవేత్త. ఇతడు "వాల్మీకి సూత్రములు" అను పేరుతో ప్రాకృత భాషా వ్యాకరణ శాస్త్రమొండు రచించినాడని తెల్పుదురు.

దీని వలన వాల్మీకి నాటికి ప్రాకృత భాష (వ్యావహారిక సంస్కృతము) జన సామాన్యమందున్నట్లును, కావ్యరచనయందు యీ ప్రాము గ్రాంధికమగు సంస్కృతముపయుజ్యమగు చున్నట్లును విద్వాంసులు తెల్పుదురు. కనుక ఏదెస జూచినను వాల్మీకి అనన్యాదృశ పాండిత్య పరమావధి. జ్ఞానవిజ్ఞాన కాంతులను ఆకళించుకొని పుక్కిలించిన మహామహుడు ఋషులకు తపస్సమాధి యెట్టిదో కవులకు కవితా సమాధియు నట్టి యుత్కృష్టమై యున్నదనుట.

రామాయణమందు నేటికిని ఒరవడిగా నుండదగిన సాహిత్యప్రక్రియలు– సాముద్రిక జ్యోతిషాది చతుష్షష్టి కళా వైభవములు – మహాకావ్యలక్షణములు– మనోహర వర్ణనా విశేషములు భావితరముల వారిని ఆకర్షించునట్లు ఆ మహాకవి చిత్రించి కృతకృత్యుడయ్యెను. అది నిజమె – ఓజస్వియగు మానవుడే సమస్త కార్య నేతృత్వము వహింప దక్షుడు కదా! ఇంక కవిత్వమనగా కళాత్మకమైన భావనతో గూడిన కథా వస్తువు ఇటువంటి కళాత్మకమైన కల్పన గావించుట అందరికి అందుబాటులో నుండదు. నవనవోన్మేష శాలిని యైన ఇది యొక ప్రజ్ఞా విశేషము. దీనినే ప్రతిభ యందురు.

ఇది యొక ఆలోచనమైయున్నది ఆలోచన యనగా నొక్కొక్క విషయమును, దాని యందలి పౌర్వాపర్య విశేషములను. యుక్తాయుక్తములను జక్కగా సమీక్షించి ఎమనీయ రమణీయ నిపుణముగ సాధించిన ప్రక్రియ. అందును "నా నృషిః కురుతే కావ్యమ్" ఋషి కానివానికి కావ్య నిర్మాణ చాతుర్య మెక్కడిది?

"శ్రుతి॥ బ్రహ్మాదేవానాం ప్రథమ స్సం బభూవ।
విశ్వస్య కర్తా! భువనస్యగోప్తా"

తా॥ బ్రహ్మదేవుడు దేవగణములలో జ్యేష్ఠుడు – ప్రపంచ నిర్మాత – చతుర్దశ భువన సంరక్షకుడు. "బృహతి బృంహయతీతి బ్రహ్మ" జగదాకారముగా బృంహణము (ఉబ్బుట) నొందునది బ్రహ్మ – ఇతని ద్వారమున అది యంచు ప్రతిపాదితమైన విద్యకు బ్రహ్మ విద్యయని, ఆత్మవిద్యయని పేరు. ఈ ; "పరావర" విద్యయనికూడ చెప్పబడును.

ఇది సకల జనాశ్రయణీయ మగునట్లు వాల్మీకి మహర్షికి బ్రహ్మోపదేశ మైనందున ఆ మహర్షియు నొకపక్షమున బ్రహ్మదేవుడే. కనుక చెప్పవలె నన్న కవీశ్వరుని సృష్టి అక్షరమయము. నాశరహితమైనది. బ్రహ్మదేవుని సృష్టి జగన్మయము. ఇది క్షరము. ఎన్నటికైన నశించును.

'బ్రహ్మదేవానాం' అను ముండకోపనిష ద్వాక్యము ననుసరించి శబ్దజ్ఞునికి విశేషించి యీశ్వరీయైశ్వర్యము లభించుట గూర్చి చెప్పబడినది. ప్రపంచమున శబ్దముండు నంతకాలము కవిత్వముండును. ఆ శబ్దము అక్షరమయమై బ్రహ్మత్వము నొందును. సర్వసాధారణముగ ప్రాకృతికమైన సంఘటనలలో తదతీతమైన చైతన్య శక్తిని మహాకవులు దర్శించు చుందురు. అట్టి యలౌకికశక్తి సందర్శనము వలననే కవీశ్వరుడు ఋషితుల్యుడగు చున్నాడు కదా! "కవయః క్రాంతి దర్శినః" కవులు చర్మచక్షువుల కతీతమైన దివ్యదృష్టి గలవారని పెద్దలు తెల్పిన విషయ మిట్టివారికి అన్వర్థముగ సరిపడును. కనుకయే యోగ్యతగల మహాత్ములందఱు నీకథపై బహుగుణీకృతమైన ఆదర భావముతో లక్ష్యముంచిరి.

జగదేక పూజ్యమగు రామకథా రచన మిహపర సాధకముగా కవులు భావించి లబ్ధ ప్రతిష్ఠులగుచున్నారు. అందలి గుణదోషములపై వారికేమియు ప్రమాదింపదు.

"స్వసూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం
కవీనాం కోదోషః సతుగుణగణానా మవగుణః"

అని జయదేవ మహాకవి నుడివినట్లు అందలి దోషము కవులకు వర్తింపదట. ఆ రామప్రభునికి గల భూయిష్ఠమైన సద్గుణములందు దోషభావము ఉన్నదట, కవి యిట్లు చమత్కరించినాడు.

—()—

# సారస్వత సమీక్ష

శ్రీమద్రామాయణము రమణీయతా పరిప్లుతమైన మహాకావ్యముగా దాని లక్ష్యమును బట్టి పేర్కొనుచున్నాము. ఇంతయగాక వాల్మీకి రామాయణమున ప్రతి కాండ యందు ప్రతి సర్గ చివరను "ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆది కావ్యే ప్రథమ స్సర్గః" అని చెప్పబడుట వలన రామాయణము మహాకావ్యమని విశదపడుచున్నది.

కావ్యమనగా రసానుభూతిని గలిగించు వాక్యసరణితో పాఠకుని హృదయమును దనలో విలీనమొనర్చుకొని ముగ్ధునిగా నొనర్చునది.

"వాక్యం రసాత్మకం కావ్యమ్"

అని విశ్వనాథాదులు రామాయణము నుండి గ్రహించి నిర్వచించిరి. భాషయందు కావ్యములలో మహాకావ్యములని, సామాన్యకావ్యములని ప్రచలితమైయున్నవి. మహాకావ్యములలో నుత్తమ కావ్యమగు రామాయణము గూర్చి తావన్మాత్రముగ నిందు ప్రస్తావింపబడును. ఈ పని మహాసముద్రమందలి యొక బిందువును మాత్రము బయటపెట్టి దానిని భిన్న భిన్న బిందువులుగా విభాజ్యమొనర్చి లెక్కించుట వంటి దుష్కర ప్రయత్నము. కనుక దీనిం దెలియకున్న నపహాస్యత తప్పదు కదా!

మహాకావ్యములందు గ్రంథావతారికతోబాటు పురవర్ణనము — శైలవర్ణన — సూర్య చంద్రోదయ వర్ణనలు — ఉద్యానము — సంయోగ వియోగాది శృంగారములు — నాయికా నాయకుల అభ్యుదయ పరంపరలు — ఋతువర్ణన — సంతానప్రాప్తి మున్నగు అష్టాదశ విషయములపై రస బంధురమగు ఔచిత్య సంపదచే — భావాలంకారాదులచే వర్ణితమై యుండును. అవి యన్నియు శాస్త్ర ప్రమాణమును గుర్తించి సబంధింపదగి యుండును. తత్రాపి ఆ కావ్యము చతుర్వర్గ ఫల ప్రదమై యుండివలెను. కళాత్మకమైన సాహిత్య వైభవముతో ప్రసన్న గంభీరమగు మధుర భూయిష్ఠ పదజాలముతో కావ్య నిర్మాణ మొనర్పుట. అది యొక లోకోత్తర శిల్ప నైపుణ్యము.

దానిని స్వరూపవంతముగా తీర్చి దిద్దువాడు కవి. అలని కర్మ రూపమైన వ్యాపార నిర్మితము కావ్యము. కావ్య నిర్మాణమున ప్రధాన స్థానీయుడు కనుక వాల్మీకిని మహాకవి యనుచున్నాము. రామాయణ మందలి దశ విధ కావ్యగుణములు ఔచితీ పర్యుక్తములై కావ్య శోభ నుద్దీపింప జేయుట యందు అహమహమికగా ముందునకు సాగినవి.

" ఔ చి త్యం ర స సి ద్ధ స్య స్థి రం కా వ్య స్య జీ వి త మ్ "

అని క్షేమేంద్రుడు తెల్పినట్లుగా ఔచిత్యమే కావ్యమునకు ప్రాణప్రద మైన సౌందర్యము కదా!

వాల్మీకి తన రామాయణ రచనలో ప్రతి విషయమును విశాల దృక్పథము తోడను - సువిశాలమైన మనస్తత్త్వముతోడను సమ్మిళిత మొనర్చి అపర్కనే యతడు మన కంటి కగుపించుచున్నాడు. అందు సుందరకాండ యంతయు దైవ సంబంధమున సుందర విచార ధారగా సుజీవింపజేసినాడు. ఆవిషయము స్థలాంతరమున పేర్కొనబడియున్నది.

కా వ్య గు ణ ములు పది :— శ్లేషము. ప్ర సా ద ము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజము, సమాధి. ఇవి (10) కావ్యగుణములు,

కా వ్య వృ త్తు లు నా లు గు :— కైశికి, ఆరభటి, భారతి, సాత్వతి.

రీ తి త్రి య ము :— వైదర్భి - గౌడి - పాంచాలి.

పా క త్రి య ము :— నారికేళము, కదళి ద్రాక్ష.

ఇందులో మన రామాయణము ద్రాక్షాపాకము. " ద్రా క్షా పా క స్స క థి తో బ హి ర ం తః స్ఫు ర ద్ర సః "

ఇట్టివెన్నియో పరిశీలింపగా నిరుపమానమైన రామ రావణ యుద్ధమువలె రామాయణ గాథయు దాని కదియే సాటి యగుచున్నది.

నీతి ధర్మములకు - రస భావ శయ్యా సమాధులకు ఆలోచనామృతమైన మధుర మంజుల సాహిత్య విజ్ఞాన సంపదకు అటః పూర్వము ప్రత్యేక శాస్త్రముగా వెలుగొందని ఉపమా, రూప కోత్ప్రేక్ష ద్యర్థాలంకార శాస్త్ర నియమములకు ఆయా తావులందుచిత స్థానముల నలంకృతములై అపూర్వ సౌందర్యము లగింపజేసి సారస్వతాధ్వనీనులకు వెలుగుబాట నడిపించు కరదీపిక యేద్ది? అదియే శ్రీమద్రామాయణము. శ్రీమత్=లక్ష్మీప్రదమైన లేక మోక్షప్రదమైన, రామ=రామునియొక్క, అయనము=త్రోవ. అనగా శ్రీరామమూర్తి ఉత్తర దేశము నుండి దక్షిణ దేశమునకు వచ్చిన త్రోవ. రామస్య+అయనం=రామాయణమ్ అని చెప్పబడెను. ఇంకను "రమయతీతి రామః" అని చెప్పుట వలస అందరి హృదయములందు క్రీడించెడు ఆత్మ స్వరూపుడే శ్రీరాముడనియు అతని మార్గమనగా మోక్ష స్వరూపము దెలియజేయు గ్రంథము శ్రీమద్రామాయణ మనియు వాల్మీకి మహర్షి యభిమతమైయున్నది.

"సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ దోషవర్జితౌ కావ్యమ్"

అని చెప్పబడిన కావ్యఫణితి నతిక్రమించి ఛందోమయమైన మంత్ర బీజములతో పరినిష్ఠితమైనందున రామాయణ పఠనము సమస్త పాపహరణమై విశేషించి ఫలప్రదమగుచున్నది.

భారతీయ విద్యాధ్యయనమునకు ప్రథమ మిశ్రమ స్థానమైన రామాయణమందు దివ్యవాణీ విలసితమైన కావ్యలక్ష్మీ తళతళ మెఱయుచుండుట - ధ్వని భరితముగ వ్యంజిత మగుట వాల్మీకి వ్యక్తిత్వమును పెంపొందించు దేవతా ప్రసాదాది జన్మ సంస్కార విశేషము కదా!

సమస్త విజ్ఞానమునకు ఆదిమ నిలయమైన మహాపీఠమని పేరువహించిన మన భరత ఖండములో అంత రసోప గుంభితమైన కవితా ధోరణిలో బాలావబోధమగు ప్రసాదగుణ ప్రసిద్ధమైన సరళ సుందర శైలిలో నసర్గళ కవితాధార కురిపించి సంస్కృత సంస్కృతితో నేకీకృతమొనర్చి, ప్రజ్ఞా చాతుర్య

మయమైన చింతనా ధారతో ప్రాచేతసుడగు వాల్మీకి తెలుపని యెడల మన దేశమునకు రామాయణము సుదుర్లభమై ఆస్తిక మతాధారమైన (ఈశ్వరాస్తికత్వాది) యితివృత్తముల ప్రసక్తి, ఆసక్తి లభింపక పోయెడిది కదా! శ్రీ సీతారాముని స్వరూప స్వభావాదుల గూర్చి స్మరింప జాలకుందుము కదా! మఱియు నమ్మహర్షి వర్యునకట్టి ఔచిత్య పరాకాష్ఠమైన విశ్వయశస్సంపదయు నుపలబ్ధమై యుండక పోవును కదా!

భారతదేశ మర్యాదకు సారస్వతక్షేత్రమందేమి? తదితరమైన ఉదాత్త సంప్రదాయములందేమి రామాయణము నవీన వ్యాఖ్యానము. ప్రతిభాశాలి యగు కవి, తన కావ్యమునకు నాయకుని, ఇతివృత్తమును, రసమును – ఈ మూడిటిని ఒక్క స్థాయిలో నడిపింప యత్నించును. కాని రామాయణమునకు సాక్షాత్ పరమాత్మ కవితా వస్తువుగా పర్యవసాయియైనందున కావ్యత్వ సిద్ధితో తీఱిపోలేదు. లోకాతిశాయి శక్తి సంపన్నమైన ఉత్తమ లక్ష్యముగా ప్రభావితమైనదని స్తుతులను, నుతులను, నతులను గావించి పునీతుల మగు చున్నాము

శ్రీరాముడు సత్యసంధుడు, సత్యపరాక్రముడు, సత్యము త్రికాలాబాధ్యము కదా! అది యేవిధమునను విపర్యాసము నొందనిది. అనగా దాని యందే వాస్తవిక విజ్ఞాన మంతయు సమిదియున్నదనుమాట – అతని జీవిత లక్ష్యమున కదియే ప్రాతిపదిక. రామునియందు మూర్తీభవించిన ప్రేమ భావము, వజ్రసంకల్పము భావించి సేవించి పరమాత్మగా సందర్శించిన మహానుభావులెందరో కలరు. వారిలో అత్రి – అగస్త్య – భారద్వాజ – నారదాది మహనీయులలో నైదుగురు సమకాలీన ఋషి పుంగవులు ప్రధాన స్థానమాక్రమించిరి. వారే–

1 వాల్మీకి 2 వసిష్ఠుడు 3 విశ్వామిత్రుడు 4 అగస్త్యుడు 5 ఆంజనేయుడు.

వీరిలో ప్రథమ గణ్యుడు వనౌకసుడు నగు వాల్మీకి మహనీయమైన శ్రీరామతత్త్వమును ఒకదానికొకటి అంగాంగీ భావము ప్రతిపాదించుచు నిఱు వది నాలుగువేల శ్లోకములతో లలిత ప్రసన్నమైన మనోహారి భావ పుష్పము లతో రామాయణము వెలార్చినట్లు తెలిసికొంటిమి.

వసిష్ఠుడు జ్ఞానవాసిష్ఠ రామాయణము రచించి శ్రీరామతత్త్వజ్ఞానము విపులీకరించెను.

విశ్వామిత్రుడధ్యాత్మ రామాయణముగా మధుర మంజుల వ్యంగ్య విలసితముగ శ్రీరామ చరిత్రము నందలి అధ్యాత్మ స్వరూపము ననదృశముగ నవగతమొనర్చెను.

అగస్త్యుడు అగస్త్య సంహిత యందు రామోపాసనామార్గము కరతలా మలక మొనర్చెను.

ఇట్లే ఋషిప్రణీత రామాయణములు అసంఖ్యాకముగా వెలసియున్నవి. ఇవి యన్నియు ఆత్మసుఖ మందభిరుచి కలిగింపజేయుచు విషయ సముద్రమున అగాధ జలములో మునిగి పోయెడు మానవుల ననుగ్రహించి యొడ్డుజేర్చి దైవ స్వరూపుల నొనర్చెను.

గమనిక :- ఆంజనేయుడు శ్రీరామ భక్తుడు మాత్రమేగాక గొప్ప వైయాకరణి. నవ వ్యాకరణములు చదివిన మహాబుద్ధిశాలి. అతడొక రామాయణము రచించినాడని తెలియుచున్నది. కాని దాని జాడ తెలియదు. బహుశః అది హనుమన్నాటకమై యుండనోపును. హనుమన్నాటకము చదువు చున్నపుడు వివిధ రామాయణము లందలి శ్లోకములు, వాని ఛాయలు కన్పట్టు చున్నందున నీవిషయము నిర్ధారింప జాలము.

ఆంజనేయుడు ప్రతిదినము తూర్పు గట్టున నొకకాలు, పడమర గట్టున నొకకాలును వేసి నిలువబడి సూర్యభగవానుని ప్రయాణ నిరోధమొనర్ప కయే దన శరీరము వంగించుకొని యతనియొద్ద ఐంద్ర వ్యాకరణ మభ్యసించి సుశిక్షితుడైనాడని ఉత్తర రామాయణ కథనము.

సమస్త ప్రాణులకు ప్రాణభూతుడైన వాయుదేవుని పుత్రుడు. నిరంతర శ్రీరామచంద్ర గోష్ఠితత్పరుడు. హనుమంతునితో మాటలాడ నుపక్రమించు నపుడు అవాకులు చవాకులుగా మాటలాడక అర్థయుక్తమైన మాటలతో హనుమంతుని సంతోష పర్చు చుండుమని రాముడు తన సోదరు నాజ్ఞాపించు చున్నట్లు రామాయణమున చెప్పబడెను.

## సప్త కాండములు

శ్రీమద్రామాయణ మందు 1 బాలకాండ 2 అయోధ్యాకాండ 3 అరణ్యకాండ 4 కిష్కింధాకాండ 5 సుందరకాండ 6 యుద్ధకాండ అను షట్కాండలు కలవు. కాండ మనగా రామాయణ మందలి పరిచ్ఛేదము. గ్రంథము నందొక భాగము అని యర్థము. ఇంకను సమూహమనియు, నీడనియు, బాణమనియు నర్థములున్నవి. అయినను 'మా ని షా ద' అని చెప్పబడిన మంగళాచరణ శ్లోకమునందే బాలకాండాది షట్కాండము లిమిడి యున్నట్లు కొందరందురు. కాండ మనగా మూలము (వేరు) యని అర్థము న్నందున రామాయణమున దేనికదియే మొదలుగానున్నది.

మన శరీరమందున్న షట్చక్రములు - షట్సంపత్తులు - షడ్గుణైశ్వర్యములు - షడూర్మలు లెక్కవేసికొని కొందరన్వయింతురు. కాని రామాయణ యుద్ధము ఏడు దినములు జరిగినదని ఉత్తరకాండతో ఏడు కాండములని లెక్కించి మఱికొందరు తెల్పుదురు. దాని యాకరమిట్లున్నది. ఆధారము నుండి సహస్రారము వఱకు చక్రములు — 7.

( ఆ ధా ర, స్వాదిష్ట, మ ణి పూ ర క, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రారములు )

గ మ ని క :— కొందరు సహస్రారము విడిచిపెట్టి షట్చక్రములని తెల్పుదురు. సహస్రార మనగా మెదడు కాదు. కాని మెదడు సహస్రార ఆజ్ఞా చక్రములకు మధ్య సమాచార వాహికగా ఉపయోగపడుటకు ఏర్పడిన యొక ఉపకరణము మాత్రమేయని-అరవిందుడు.

భూలోక, భువర్లోక, సువర్లోక, (స్వర్గ), మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకములు. ఇవి ఊర్ధ్వ లోకములు — 7.

అతల, వితల, సుతల, మహాతల, తలాతల, రసాతల, పా తా ళ లోకములు. ఇవి అధో లోకములు — 7.

లవణ, ఇక్షు, సురా, సర్పి, దధి, క్షీర, జల సముద్రములు — 7

పునర్వసు, (అశ్వని నుండి) రాముని జన్మ నక్షత్రము (పునర్వసు)—7

అవతారములలో నేడవ యవతారము శ్రీరామావతారము.

ఇంకను శ్రీరామచంద్రుడు కూలనేసినవి సప్తతాళములు. ఇట్లే సప్త సంఖ్య గల సప్తకుల పర్వతములు మున్నగునవి కథాభాగమున లేనివి చేర్చి ప్రపంచ విషయము లెన్నియో చెప్పవచ్చును. కాని అది అనుచితము. ఇందేది నిజమో బుద్ధిబలమున యోజింపదగి యుండును. కాని ముఖ్య విషయము లిట్లు చెప్పవచ్చును.

శ్రీరామాదులకు నామకరణ మొనర్పబడిన దినము —

విలంబి సం॥ర చైత్ర బహుళ సప్తమి.

దశరథుడు శ్రీరామాదుల వివాహమునకై మిథిలకు ప్రయాణించిన దినము —

సౌమ్య సం॥ర ఫాల్గుణ బహుళ సప్తమి సాయంకాలము.

శ్రీరాముని జటావల్కలధారణ, గుహుని సహాయము, గంగానిర్గమనము —

దుందుభి సం॥ర చైత్ర శుద్ధ సప్తమి.

శ్రీరాముడు పంచవటీ తీరమున నివసించుట —

భావ సం॥ర చైత్ర శుద్ధ సప్తమి మొదలు యువ సం॥ర వైశాఖ బహుళ అమావాస్య వరకు — ఏడు దినములు.

రామాయణ యుద్ధము

యువ సం॥ర ఫాల్గుణ బహుళ నవమి — ప్రారంభము ఫాల్గుణ బహుళ అమావాస్య వరకు — ఏడు దినములు.

కైక వరద్వయము :- 1 రామస్య వనవాసః — 2 భరతస్యాభిషేకః

ఇందొక్కొక్కదానికి ఏడు అక్షరములు కలవు.

శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవము జరిగిన దినము —

ధాతృ సం॥ర చైత్ర శుద్ధ సప్తమి.

**ఇంకను రామాయణము ఏడవ సంఖ్యలో నిమిడియున్నట్లు** కొన్ని యుపపత్తులు కలవు. స్థలాభావమున విడువబడెను.

**రామ రావణులు** ఏడు అహోరాత్రములు నిర్విరామముగా పోరుసల్పినట్లు భాస్కరరామాయణము, చంపూరామాయణము మున్నగు కొన్నిటి యందు కలదు. మూలగ్రంథమగు వాల్మీకము నందిట్లున్నది.

"శ్లో॥ దేవ దానవ యక్షాణాం పిశాచోరగ రక్షసాం
పశ్యతాం తన్మహద్యుద్ధం సర్వరాత్ర మవర్తత"

అని యున్నది. సర్వరాత్ర మనగా నహోరాత్రమని కొందరనిరి. సప్తరాత్రమని కొందరనిరి. ఇందేది సవరించినను, లేకపోయినను ప్రమాద రహితమే — బాధింపదు. ఇంతకు ఉపజ్ఞశాలియగు వాల్మీకి యభిప్రాయ మెట్లున్నదో అనూహ్యము.

ఇట్లే మహాభారత యుద్ధము పదునెనిమిది దినములు జరిగినందున తత్ గ్రంథము కూడ పదునెనిమిది పర్వములుగా వేదవ్యాసుడు విభజించెనని సంప్రదాయము. పర్వమనగా చెఱకుగడ, కణుపనియు, పర్వదినమనియు చెప్పబడును.

మహాభారతము అష్టాదశ పురాణములందు సర్వోత్కృష్టమైనదని చెప్పునపుడు శ్రీమద్రామాయణము "షట్కుక్షి" అను పేరుగల మహామంత్ర రాజమగు గాయత్రీ మంత్రమయమై వెలసియున్నది. (షట్కుక్షిః=నాలుగు దిక్కులను, ఊర్ధ్వదిక్కు - అధోదిక్కు, మొత్తము ఆఱు దిక్కులు కుక్షిగా గలది యను అర్థము.)

శ్రీమదాద్రిమాయణము రామోపాసకు లందఱకు అమూల్యమైన యోగ గ్రంథము. యోగీశ్వరులు తన అంతర్వీక్షణమున ఆత్మారాముని సందర్శించు కొని ఆనందరస వాహినిలో పరవశత్వము నందెడు విధానము లోకదృష్టి కందరాని పరమాద్భుతమైన అసాధారణ విషయము. అట్టివారు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాస లందును ఆ దేవుని నామమును గ్రహింతురు. తమ దేహము లు నిద్రించుచున్నను మేల్కొనియుందురు. పవిత్రమగు రామనామ స్మరణము వారికి తోడు నీడ లేనియెడల, అది వాస్తవిక మరణము సంభవించినట్లు ఏడ్చు చుందురు.

వేదాంత మతము :—

రామపూర్వతాపిని - రామోత్తరతాపిని - రామరహస్యోపనిషత్తు అను నీ యుపని షత్ గ్రంథములు శ్రీరామ తత్త్వమును మనోహరముగ గానమొనర్చెను.

రామోపాసనము రెండు విధములుగ నున్నది. 1 సగుణము 2 నిర్గు ణము అనబడును. ఇందలి సగుణమందు రెండు భావములున్నవి. అందొ కటి మాధుర్యము, రెండవది ఐశ్వర్యము. ఇక నిర్గుణమని చెప్పబడు ఉపా సనయే క్రమముగా ప్రేమార్ద్రమై సగుణముగా మారిపోవును.

వేదాంత మతమున జీవుడు పరమపదప్రాప్తికై యోగసాధనా బలమున ఇడా పింగళ నాడుల మధ్యనున్న సూక్ష్మనాడియగు సుషుమ్న యందు ప్రవే శించి, అధోభాగ మందలి మూలాధార చక్రము నుండి క్రమముగా స్వాధిష్ఠ, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రముల నధిగమించి సహస్రారము వఱకు జఱుపబడుచున్న వాయు సంచార మార్గమే శ్రీరామచంద్రమూర్తి అయోధ్యా నగరము నుండి లంకా పట్టణము వఱకు ప్రయాణించి నడిచిన దుర్గమ మార్గమని సాధకుడు హృదయములో భావించి వాయు సంచాలన శక్తిచే నాయా మార్గముల నన్వేషించి ఆయాస్థలములలో శ్రీరామచంద్ర పరమాత్ముని వేర్వేరు దివ్యమూర్తులను ఏకాగ్ర చిత్తముతో ధ్యాన సంధాన మొనర్చుచు, అహంకార మమకారము లనెడు రావణ కుంభ కర్ణాదులను, కామ క్రోధాదు లనెడి యింద్రజిత్తు మున్నగు రాక్షసులను జయించుకొనిపోవును.

ఆ పిమ్మట సహస్రారమందు కోటి సూర్య ప్రభా భాసమానమై మెఱయుచున్న ప్రకృతి మాతయగు సీతాపరంజ్యోతిని (ముక్తికాంతను) పొంది అంతర్లీనమైన సచ్చిదానందమయుడగుటయే రామాయణ మందలి పరమార్థ రహస్యమని - ప్రతి జీవియందును ఆత్మారామ రూపము సువ్యక్తమై యున్నదని - ధ్యాన ధారణాదులొనర్చు యోగిసర్వకాల సర్వావస్థల యందును సందర్శించి, యానంద సాగరములో ధర్మార్థ కామ మోక్షముల సిద్ధి పొందుచున్నాడు.

మఱికొందఱు జప పరాయణులు పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ యన నుడు వాణీముఖమునను, కొందరు శ్వాస ద్వారమునను - నాడీ ద్వారమునను నామాక్షరములను మనస్సునందు కల్పించుకొని మూర్తికల్పనము అవృత్తి యొనర్చుకొని మానస జపమొనర్తురు. ఈ విధముగ భక్తజన చకోర చంద్రుడై శ్రీరామచంద్రుడు మూలతత్త్వముగా భాసిల్లుచున్నాడు.

" శ్లో॥ సదానంద దేవే సహస్రార పద్మే
గలచ్చంద్ర పీయూష ధారా మృతాంతే
స్థితం రామమూర్తిం నిషేవే నిషేవే
తదన్యంచ దైవం నసేవే నసేవే "

అని సహస్రార మధ్యవర్తియైన పరమాత్మునిగా శ్రీరామచంద్రుని, తత్త్వతేజోరాశి యగు ఆది శంకర భగవత్పాదులు సందర్శించినారు.

ఆద్యంతరహితమై - క్షణ భంగురమై - నిస్సారభూతమైన సంసార సాగరమును తరించుటకు వివేక శీలమైన బుద్ధి సారథ్యమున సర్వ వ్యాపక పరమాత్మను సంయమపూర్వకముగా సందర్శించి పరమ పదమగు గమ్యస్థానము జేరుట కనేక మార్గములున్నవి.

కొందరుపాసకులు భ్రూ మధ్యస్థితుడగు నీశ్వరుని రామునిగా భావించి 'సోహం' (రాముడే నేను) అని తత్త్వతః భావింతురు. ఈ జ్ఞానము వలన దుష్ట పరిణామముల నతిక్రమించి ముక్తులగుదురని రామోత్తరతాపిని తెల్పుచున్నది.

తా ర క మం త్ర ము :—

సంసారమును తరింపజేయునది కావున తా ర క ము. తా ర క మ ను ప్రఖ్యాతి ప్రణవము (ఓంకారము)నకు, రామనామమునకు మా త్ర మే కలిగి యున్నది.

రాం రామాయనమః — ఇది షడక్షర మంత్రరాజమగు మూల మంత్రము.

గ మ ని క :—

రాం రామచంద్రాయనమః — ఇది అష్టాక్షరి.

ఓం నమో నారాయణాయ — ఇది ప్రణవ సహిత అష్టాక్షరి.

శ్రీరామః శరణం మమ — ఇది శరణాగతి మంత్రమగు అష్టాక్షరి.

ఓం నమో భగవతే వాసుదేవాయ — ఇది ద్వాదశాక్షరి.

గ మ ని క :— ఇందు తెల్పబడిన అష్టాక్షరి యందలి 'రా' యును – శివ పంచాక్షరియగు ''నమశ్శివాయ'' యందలి 'మ' యును కలిసి నందున రామ నామము తారక మంత్రముగా బీజాక్షర యుక్తమై రామ తత్త్వము జ్యోతి స్వరూపముగ భాసిల్లినది. ఇట్టి మహామంత్ర నిత్యాను ష్ఠానము వలన జన్మ మృత్యు జరా వ్యాధుల నతిక్రమించి మోక్ష సామ్రాజ్య పీఠము నందగలరు. కఠోర నియమముగల అనుభూతి పరాయణుల కిది విదితము కాగలదు.

మఱియు రామ నామములో ర+ఆ+మ, అను మూడు వర్ణములున్నవి.

ర=అగ్నిబీజము — జఠరాగ్ని, బడబానల, దావానలములు. రజోగుణము, ఎఱుపు. దాని యధిపతి

ఆ=భానుబీజము — వేదశాస్త్రాదులను ప్రకాశింపజేసి అవిద్యను నశింప జేయును. సత్త్వగుణము, తెలుపు. దాని యధిపతి విష్ణువు.

మ=హిమకరబీజము — త్రి తాపహారకమైన శీతలత్వశాంతి నొసగును. తమోగుణము, నలుపు. దాని యధిపతి శివుడు.

పై మువ్వురు క్రమముగా రామనామమం దిమిడి యున్నందున దాని నుండి ప్రసరించిన తేజః పుంజమే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పురాణము లందు త్రిమూర్తుల కభేద ప్రతిపత్తి చూపబడినది.

మహారామాయణ మందిట్లున్నది –

"శ్లో॥ రకారో నల బీజం స్యాద్ యే సర్వే బాడ బాదయః
అకారో భాను బీజం స్యాత్ వేదశాస్త్ర ప్రకాశికః
మకారశ్చంద్ర బీజంచ సతంబు పరిపూరణమ్ "

# రామశబ్ద నిర్వచనము

"రమయతి సర్వాన్ గుణైరితి రామః"
అందఱిని దన సుగుణములచే రమింపజేయువాడు రాముడు.

"శ్లో॥ రమంతే యోగినో నంతే నిత్యానందే చిదాత్మని
ఇతి రామపదే నాసౌ పరబ్రహ్మాభి ధీయతే"

నిత్యానంద చిదాత్మయందు చతుర్ముఖుడు మున్నగు జ్ఞానయోగులందఱు రమింతురు. సర్వావస్థల యందు గ్రీడింతురు. ఆ పరబ్రహ్మమే 'రామ' యనుపేర బరగుచున్నది. — (అగస్త్య సంహిత)

"శ్లో॥ రామ ఏవ పరబ్రహ్మ రామ ఏవ పరం తపః
రామ ఏవ పరం తత్త్వం శ్రీరామో బ్రహ్మ తారకమ్"

రాముడే పరబ్రహ్మము, రాముడే పరమ తపము, రాముడే పరతత్త్వము అతడే తారక బ్రహ్మము. ఇత్యాదిగ శ్రీరామచంద్రుని తత్త్వస్వరూపమున రామ రహస్యోపనిషత్తు తెల్పుచున్నది.

"రమయతీతి రామః" — "రమంతే అస్మిన్ ఇతి రామః" మున్నగు వ్యుత్పత్తులచే రామ శబ్దము పరబ్రహ్మ వాచక మగునని, సకల యోగులకు క్రీడా స్థానమని మంత్రార్థము.

"శ్లో॥ రమతే సర్వ భూతేషు స్థావరేషు చరేషుచ
అంతరాత్మ స్వరూపేణ యచ్చ రామేతి కథ్యతే"

మహత్తరమైన శ్రీరామ చరిత్రమును పార్వతీదేవికి పరమేశ్వరుడు సంతోషముతో వినిపించెను. కనుక "తదర్థం గిరిజా వేత్తి" పార్వతికి సగము మాత్రమే తెలియును.

"యన్నామ సారరసికో భగవాన్ పురారిః"

అని యున్నందున నీశ్వరున కామంత్రము ప్రియతమమైనది. పరమశివుడు అహోరాత్రములు తదేక నిష్ఠతో అవిముక్త క్షేత్రమున రామ తారకము జపించుచుండును. పరమ పవిత్రమైన రామనామ మాహాత్మ్యమువలన

నతడు వారణాసి (కాశి) యందు మరణించిన సమస్త జీవులకు కుడిచెవిలో తారక మంత్రోపదేశ మొనర్చి ముక్తి ప్రదాత యగుచున్నాడు. "కాశ్యాంతు మరణాన్ముక్తిః" అని తెల్పుటకిదియొక హేతువు కలదు. రామనామమాహాత్మ్యము పద్మపురాణమున బ్రహ్మఖండ మందు విపులముగా చర్చింపబడియున్నది.

" శ్లో॥ శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే! "

ఓ మనోరమా! ఓ వరాననా! శ్రీరామ రామ రామ యని నేను రాముని యందు ముమ్మారు రమించుచుందును. ఆ మంత్రము సహస్ర నామములతో సమానమై అంతటి మహత్తరమైన ఫలమొసంగునని పరమేశ్వరుడు పార్వతి కెఱిగించెను. ఇచ్చట సహస్రము (వెయ్యి) యనుటకు కటపయాది సంకేత మున " కాదినవ, టాదినవ, పాదిపంచ, యాదష్ట " " అంకానాం వామతో గతిః" ఇత్యాది అక్షర సంఖ్యా సూత్రము ప్రకారము కటపయాది సంకేతమున మూడు మాఱు 'రామ' యనిన వెయ్యి సంఖ్య యగుచున్నది. ఎట్లనగా : రా=2; మ=5; రామ=2×5=10. రామ. రామ. రామ.=10×10×10=1000; ఇట్లు అక్షర పరిగణన వలన వెయ్యి యగుచున్నది. ఏతాదృశ కారణ పరంపరలచే పై విధముగ చెప్పబడెను.

శ్రీరాముడును పరమ శివుని పూజించినాడని కూర్మపురాణ, పాద్మ పురాణాదులందున్నది.

" శ్లో॥ సేతు మధ్యే మహాదేవ మీశానం కృత్తి వాససం,
స్థాపయామాస వై లింగం పూజయా మాస రాఘవః "

అని కూర్మపురాణములోనున్నవి. పాద్మమున రామునికి శివుడు ప్రసన్నుడైనాడని యున్నది. కాని ఈ విషయములు శ్రీమద్రామాయణమున లేకపోవుటకు గారణము అనూహ్యము.

ఏది యెట్లున్నను రామ కథను శివపరముచేసి అన్వయింపరాదని, అట్లే శివకథను రామపరముగచేసి అర్థము చెప్పరాదను నియమము భాషలో కలదు.

# నామ సంకీర్తనము

నామ సంకీర్తనములో విశ్వసనీయమైన మహా ప్రాభవ మున్నట్లు దాని యనుభవజ్ఞులకు సర్వవిదితము. పండిత పామర సామాన్యముగా మానవజాతి కంతకు భగవద్గుణానుభవము. భగవన్నామ సంకీర్తనము కంటె సులభోపాయమగు దైవ బలము మఱిలేదని గ్రంథ శతములు ద్బోధించు చున్నవి.

నామస్మరణము ఒకానొక యద్భుత తరమైన మధుర గంధర్వ గానము. భగవద్భక్తునకది సుమధురమైన యాహారము. అతడు దాని ననుభవించు చున్నపుడు తల్లీనుడై ఐహిక, పారలౌకిక సుఖ దుఃఖములు రెండింటిని మఱచిపోవును. లేనిపోని దుర్విమర్శలకు, తార్కిక వితండములకు చెవియొగ్గడు. అతడేమి చేయుచున్నదియు, ఎంత వేళయైనదియు అతనికే తెలియదు. అతడు నిజముగా గీతయందు తెల్పబడిన స్థితప్రజ్ఞుడు. "నమయతీతి నామ" అను వ్యుత్పత్త్యర్థము చొప్పున నామమునకు లక్ష్య భూతుడగు భగవంతుని కూడ లొంగునట్లు(అనుగ్రహించునట్లు)చేయగలడనుట వగ్న సత్యము. కనుక దీనిసందఱు సాధింప గల్గుచున్నారు. మనోనిగ్ర హముతో ఆత్మ సామ్రాజ్యములో విలీను లగుచున్నారు. నామము శబ్ద బ్రహ్మము కనుక శక్త్యంశములైన పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరులు అనబడు నీ నాల్గు విధములగు వాక్కులు తదాశ్రయములై యున్నవి.

1 పరావాక్కు — వృక్షములు మాటలాడును.

2 పశ్యంతీవాక్కు — పశువులు అఱచు బాష.

3 మధ్యమావాక్కు — పక్షులు పలుకును.

4 వైఖరీవాక్కు — సామాన్య జనుల మాటలు.

యదార్థముగ శ్రీరాముడు తన యవతార కాలమున తరింపజేసిన భక్తుల సంఖ్య కంటె నామ స్మరణచే అత్యంత కష్టభాజనమైన సంసారార్ణవము నుండి తరింపబడిన పరమ భక్తాగ్రేసరులు, ముక్తజీవులు ప్రపంచమున నెందరో వెలసి యుందురనుట అత్యుక్తి కాదు.

విశేషమేమనః- సీతారాముడు శ్రితావనైక వ్రతనిష్ఠితుడగు జగత్పిత - సుప్రసన్నుడు. సూర్యబింబము చిన్నదిగా కనిపించినను లోక త్రయమందు దాని ప్రకాశ మద్భుతమైనది కదా!

త్రేతా యుగమునాటి శ్రీరాముడు తరములు గడచిన కొలది విలక్షణ ప్రభాతమువలె విస్మరింప బడక నిన్న మొన్నటి వానివలె మన భావనలో ప్రతి ధ్వనించుటకు కారణమేమి?

" శ్రు॥ ఏకో వశీ సర్వ భూతాంత రాత్మా
ఏకం చేదం బహుధాయః కరోతి " — (కఠోపనిషత్తు)

అని యున్నందున స్పర్శమణి ఇనుమును బంగార మొనర్చుట యందా శ్చర్యమేమి?

భగవానుని యందున్న మధుర భక్తి అంత ఆకర్షణీయ శక్తి కలది.
" శ్రద్ధామయోయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః "
(గీత- 17అ. 3శ్లో.)

ప్రత్యేక మనుష్యుని వ్యక్తిత్వము అతని శ్రద్ధ వలనను, ఆదర్శ జీవనము వలనను రూపవంత మగుచుండును. దీని యెడ అందఱు సావధాన ముగ నుండవలెనని గ్రంథము లుద్ఘోషించుచున్నవి.

జ్ఞాన భక్తికిని, సాధారణ భక్తికిని కేంద్రస్థాన మొక్కటేయని చెప్ప వచ్చును. కాని గంతవ్య మార్గములో సుగమ దుర్గమములు అనివార్యములై యున్నవి. విద్రాహారముల నొప్పరికించి, ఇతి కర్తవ్యతా జడుడై యుద్విగ్న సంసారాంధకారమున మునింగి శుష్క జీవియైన మానవుడు శ్రద్ధా సక్తులకు దూరమై సర్వ వినాశ మొనర్చు కొనుచున్నాడు. ముండ్ల పొదలు మేయు నొంటెవలె దన పెరవుల రక్తపానమున తానే యుబ్బి తబ్బిబ్బు పడుచున్నాడు. విషయ లోలుపుడై అత్యంత కష్ట భాజనుడగుచున్నాడు.

—()—

# లోకమాత సీత

సౌశీల్య సౌజన్య సంపదలచే పతి యడుగుజాడల నడిచిన అనఘజీవి. అనవద్య చరిత్రి. శ్రీరామచంద్రుని దన ప్రాణాధికముగ ప్రేమించినది. సుందరకాండ యంతయు ఆమె ప్రేమ నిష్ఠకు పరకాష్ఠయైనది.

జగదేక పూజ్యమగు శ్రీరామ కథ భారతీయ సాహిత్య గ్రంథములలో విషయ మహత్త్వమును గూర్చియే గాక జగదేక సుందరి, పూజ్యురాలు, భూ పుత్రియునగు నమ్మహా సాధ్వియొక్క నిరుపమాన పాతివ్రత్యాద్యుత్తమ లక్షణ లక్షితమై ఆసేతుశీతాచల భూ మండలమున నాశాంత విశ్రాంత యశస్సు నార్జించిన దివ్యజ్యోతివలె నధికాదరణీయమైనది.

ఆమె అగ్ని పరీక్షలలో విజయమందిన మహిళా లలామ. పవిత్ర హృదయ. కష్ట సహనముతో సర్వసుఖముల ద్యజించి పతిసేవయే స్వధర్మ మని నిరూపించినది. శీలవతులకు కష్టములు గీటురాళ్ళ వంటివి కదా! రావణు డెంతగా తర్జన భర్జనలొనర్చి (బెదరించి)నను పరిశుద్ధమగు మందహాసముతో భావ వివరణమగు మాటలచే "తృణ మంతరతః కృత్వా బభాషే జనకాత్మజా" రామ నామము జపించుచు గడ్డిపోచను గైకొని తనకును రావణునకును నడుమ ఉంచి రావణుని తృణీకరించిన ధీరాతి ధీర - కనుకనే ఆమె గుండెలలో నిరాశా నిస్పృహలు గూడుకట్టుకొని యున్నను, శ్రీరామ సన్నిధికి నిత్యకారణ భూతమై విద్యున్మాలవలె జగదానందకారిణి యగుచున్నది. అతని హృదయ పీఠములో తిరుగులేని స్థానము సంపాదించుకొన్నది.

"సీతాయాశ్చరితం మహత్" అను సభియుక్తోక్తికి తార్కాణమైనది. ఆయా సందర్భముల ననుసరించి రామాయణ మనుటకు బదులు సీతాయనమని కొందరనవచ్చును.

అట్లు గడ్డిపఱక వేయుట యందభిప్రాయములు కొన్ని చూపబడును.

భావయోజన:

1 రావణా! నీ ప్రాణము తృణ ప్రాయము.

2 రావణా! నీ సంపద యంతయు దీనితో సమానము.

3 రావణా! నీ వనుభవించు భోగము ఈ గడ్డియేకాని నేను కాదు

4 రావణా! నీవు గడ్డితినెడు పశువుతో సమానుడవు.

5 రావణా! నిన్ను తృణముతో సమానముగా చూచుచున్నాను.

6 రావణా! లంక కాలిన పిదప గడ్డితో గుడిసె వేసుకొని జీవింపుము.

7 రావణా! ఈ తృణము వలె ఈర్ష్యామోహాదులు వదలి రాము నాశ్రయింపుము.

8 రావణా! దీనిని కఱచుకొని రాముని కాళ్లమీద బడుము.

9 రావణా! నీ తల ద్రుంపబోవు విధము చూడుము.

10 రావణా! శుక్రుని కంటిని వామనుడువలె నీ కంటిని దీనిచే పొడిచెదను.

11 రావణా! కాకాసురుని కంటిని బ్రహ్మాస్త్రముతో వలె నీ కంటిని దీనిచే పొడిపించెదను.

12 రావణా! ఈ గడ్డిపోచను మాడ్చునట్లు, నా పాతివ్రత్య తేజస్సు, నిన్ను భస్మీపటలము గావించును.

13 రావణా! నాడు దమయంతి తన పాతివ్రత్య శక్తిచే కిరాతుని భస్మమొనర్చినటుల నా పాతివ్రత్య శక్తిచే మంటలో బడిన గడ్డిపోచవలె నిన్ను దగ్ధమొనర్తును, అనియు—

భావోద్దీపనమగు పై యభిప్రాయములతో సీతాదేవి రావణున కు హితోపదేశమొనర్చుట యిందు వలన గ్రాహ్యమగును.

సీత వీరపత్ని-ఆమె స్వయముగ రావణుని సకుటుంబముగ హతమార్చ గల కాళశక్తి. ఐనను ఆపని తన నాథుని మూలమున జఱుగనిచో రాముని యవమానించినట్లగునని విడిచిపెట్టినది. హనుమంతుడు తన వీపున గూర్చుండ బెట్టి యయోధ్యకు దీసికొని వెళ్లెదనని బ్రతిమాలినను కాలుకదల్పలేదు.

సీతారాముల అనుబంధ మాధుర్యము, అలౌకిక దాంపత్యము, ఆర్యా

వర్తములో సువర్ణాక్షరములతో దేదీప్యమై శాశ్వతత్వము వహించినది.

సీతా తత్త్వము ప్రకృతి - రామ తత్త్వము పురుషుడు. ఇందొకటి స్థూలము. మఱియొకటి సూక్ష్మము. కనుక ఈ రెండు తత్త్వములు ఉపాసనీయములు. దీనినే యుగళోపాసన మందురు. శ్రీ రామ తత్త్వమునకు, సీతా తత్త్వమునకు విశేష సంబంధమున్నందున ముముక్షువులగు విజ్ఞులు "శ్రీ సీతాయై స్వాహా" యను షడక్షర సీతా మంత్రము బీజాక్షరములతో షడంగ న్యాస మొనర్చి త్రైలోక్య పూజితయగు నమ్మహాదేవిని ధ్యానింతురు. సీతామాహాత్మ్యము సీతోపనిషత్తునందు విస్తరింపబడినది. ఆమె సమస్త శరీర ధారులకు ఉత్పత్తి, స్థితి, సంహార కార్యము లొనర్చుచున్నది.

ముద్రికా ప్రదానము :

అశోక వనిలో మూర్తీభవించిన శోకదేవతయై శింశుపా వృక్షము క్రింద సీత రావణ వధార్థమై రామ నామము జపించుచు తపంబొనర్చుచున్నది. శ్రీరాముడు తన నామాంకితమైన (రామ తారక మంత్రము గల) అంగుళీయకమును అదే యుపదేశముగా గ్రహింపు మన్నట్లు ఉద్దేశించి పంపియున్నాడు. ఆంజనేయుడు దానిని సీతామాత కొసంగెను.

" శ్లో॥ గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కర విభూషణమ్ "

ఇది తన భర్త యగు శ్రీరామచంద్రునిదేయని నిశ్చయించినది. సీతా వివాహ కాలమందు జనకమహారాజు దత్తమైన కానుకగా స్పష్టపరచుకొన్నది. అయోధ్యా రాజన్యులకు దానితో సంబంధము లేనందున నన్నియాభరణములతో బాటు దానిని కూడ తీసివేసి కైక ముఖమున పారవేయలేదు.

చూడామణి

" శ్లో॥ తతో వస్త్రగతం ముక్త్వాదివ్యం చూడామణిం శుభం
ప్రదేయో రాఘవా యేతి సీతా హనుమతే దదౌ

సీత ధరించిన యాభరణములన్నియు శ్రీరాముడు తన మృదులహస్తము లతో నామె కంఠము నలంకరించినవి. కనుక అవి తీయించుటకు కైక కధికారము లేదు. మఱియు నట్టివన్నియు నామెకు అరణ్యములో మహాపతి వ్రతయగు నత్రిముని భార్య అనసూయ దీవించి యిచ్చినవి.

శ్రీరామ ముద్రికను ఆంజనేయుడు సీతకు సమర్పించిన పిమ్మట శ్రీరామునికానవాలుగా నిమ్మని తన చీర చెంగున భద్రపర్చి దాచియుంచిన విలువయైన శిరోరత్నమును దీసి ఆంజనేయుని చేతికిచ్చెను.

ఈ చూడామణి సముద్రగర్భమున బుట్టినదగుటచే విలువ గలదియై రాజులయొద్ద నుండదగినదని మహేంద్రు డీమెకొసంగెను.

ఇది బయటకు కన్పడిన యెడల రావణు డపహరించునని తన్నుగాచికొని యున్న రాక్షస స్త్రీల కంట బడనీయక తన చీర చెంగున దాచియుంచినది. అది ఆనవాలుగా ఆంజనేయున కొసగునపుడు ఆమె ఆదిశక్తి కావున దన శక్తి నంతయు నాంజనేయున కొసగి పంపినది. ఇది సుందరకాండ విషయము.

భగవతియగు సీతామాతను బ్రహ్మవాదులు మూల ప్రకృతియని, ప్రకృతి యని తెల్పుదురు. ఆమె ప్రణవ స్వరూపయైనందున సర్వవేదమయి – సర్వ లోకమయి – సర్వకీర్తిమయి – సర్వధర్మమయి యనబడి సమస్త దేవత లందును, పరమాత్మని యందును భిన్నాభిన్నస్వరూపిణిగా గ్రహించి వాల్మీకి మహర్షి కృతకృత్యుడైనాడు.

సీత మహాశక్తి స్వరూపిణి – సర్వాత్మనా సీతారూపమున నావిర్భవించిన లీలాదేవి. కావున " రాఘవో ర్హతి వైదేహీమ్ " రామునకు సీతయు, సీతకు రాముడును తుల్యశీల వయో వృత్తములచే దగియున్నారు.

వేదాంతశాస్త్రమున పరబ్రహ్మ శక్తియే సమస్త సృష్టి స్థితి లయాదుల గావించు చున్నదని వివరింపబడినది. పరబ్రహ్మము (పరాశక్తి) జననీ జనక స్వరూపములతో – చిచ్ఛక్తి సమ్మేళనముతో ప్రాపంచిక హేతుభూతములగు

చిద్విలాసములతో సచ్చిదానంద పరిపూర్ణమై, పురుషకారభూతమై యొక దాని విడిచి రెండవది యుండక సామానాధికరణ్యకారణముచే ఆ మహాశక్తి వెలుగొందు చున్నట్లు స్త్రీ రూపమగు ఆ జగన్మాతనే పరబ్రహ్మ స్వరూపముగ సందర్శించి ఆరాధించిన యెందరో మహనీయులు సంసార విముక్తి జెందినట్లు శాస్త్రములు నిరూపించినవి.

ఈ విద్యకు ' శ్రీ వి ద్య ' యని పేరు కలదు. పురుష సూక్తములో "స హ స్ర శీ ర్షా పు రు షః" అని చెప్పబడియుండగా, శ్రీ సూక్తములో "ఈ శ్వ రీ గ్ ం స ర్వ భూ తా నా మ్" అని చెప్పబడుచున్నది కదా! ఇదియును యజుర్వేద మంత్రమే.

శ్రీమద్రామాయణమున నయోధ్యాకాండలో నొక రహస్య విశేషమందలి సారాంశము ఇచట ఉట్టంకింప బడుచున్నది.

శ్రీరాము డడవికి బోవుచున్న స మ య ము లో సీతాదేవిని తనతో బయనింప వలదని యెంత చెప్పినను ఆమె మొండిపట్టుపట్టి రాముని విడిచి క్షణ కాలము నిలువ నంగీకరింప నందున ఆమె తుదకు కోపోద్రేకముతో శ్రీరాము నాక్షేపించుచు పురుష విగ్రహములో నున్న ఆడుదానివని తెలియక నా తండ్రి జనకుడు భ్రమించి నీకు నన్నొసంగి పరిణయ మొనర్చినాడు. ఇ పు డు నీ యసమర్థతను, బలహీనతను చూచి ఎవరిపై తప్పు తేల్పగలడు? అని పరిహాస కర్కశమైన కఠినోక్తులు పల్కినది.

" శ్లో॥ కిం త్వా మన్యత వైదేహః పితామే మిధిలాధిపః
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహమ్ "

తత్త్వదృష్టిగల రాముడు వ్యంగ్య విలసితమైన ఆ మాట లా లిం చి బాహ్యదృష్టిచే కోపము తెచ్చుకొనక మందహాసముతో నామె నిర్వ్యాజమైన హృదయార్ద్రతకు, ప్రేమ నైశిత్యమునకు అంగీకారముద్ర వైచెను. అది నిజమే. ఇట్లే —

"న శివేన వినా శక్తిః న శక్త్యాచ వినా శివః" అని యున్నది కదా!

సౌందర్య లహరిలో శ్రీశంకరు లిట్లనిరి –

"శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం"

ఇందు గ్రహింపదగిన విశేషమేమన ! – మన యిరువురకు గల అవినా భావ సంబంధము గూర్చి నా తండ్రి మన వివాహ సమయమున హెచ్చరించి చెప్పలేదా? ఇపుడు నన్నేల రావలదనుచున్నావు? నేను లేనిదే నీవొక్కడ వేమి సేయగలవని సీత ప్రశ్నించుచున్నది.

ఈ వాక్యము సీతారాముల వివాహ సంరంభమున జనక చక్రవర్తి వధూ వరులకు పరస్పర హస్తస్పర్శ జరిగించిన సందర్భము తెల్పుచున్నది.

"ఈ సీత నా కూతురు. సదాచార సంపన్నమైన కులమున బుట్టినది. ఆభిజాత్యము కలది. నేనెట్టి వాడనో గ్రహింపుము. స్వర్ణలత వంటి దేహ సౌందర్యముతో తళ తళ లాడుచున్నది. నీయొనర్చు ధర్మము లన్నియు నీమె చేయగలదు. నిస్సంశయము. ఆదరభావముతో నీమెను స్వీకరించి సుఖముగా నుండుము.

—()—

# శైవ వైష్ణవ మతాంతరములు

ప్రాచీన మతసంప్రదాయము ననుసరించి భారతదేశమున హైందవులలో శైవులు - వైష్ణవులు - సౌర మతస్థులు (సూర్యోపాసకులు) మూర్తి త్రియా రాధకులు, శాక్తేయులు ఇట్లే మఱికొన్ని రీతుల వివిధ దేవతోపాసకులు, విభిన్నములగు మంత్రోపాసనలచే భగవాను నారాధించుచు భక్తులై వెలసి యుండుట ఒక్కొక్క మతస్థాయికి లక్షణముగా చూపబడుచుండెడిది.

ప్రపంచ మందింతను మిగిలియున్న అనేక మతములకు గమ్యస్థాన మొక్కటే యయ్యు నొకరి మత భావనల నింకొక రవహేళన మొనర్చుచు ద్వేషములు వెల్లగక్కుచుండుట వంటి విప్లవ జ్వాలలతో స్వమత సంస్థాపన కొఱకు పరమత నిరాకరణ, అసహిష్ణుతాప్రదర్శన జఱుగు చుండెడిది.

" యావత్పరమతం ననిరాక్రియతే,
తావత్స్వమత మప్రతిష్ఠితం భవతి "

అన్యమతము నిరాకరింపనిచో దనమతము సుప్రతిష్ఠితము కాజాలదను పాషండ వాదమునకు పెక్కండ్రు దిగిపోయి దేశ మర్యాదకు కళంకము నాపాదించిరను చారిత్రిక విషయము కలదు. ఇట్టి యనుచిత లక్షణములు అతిక్రాంత మర్యాదులగు మతోన్మాదులకు తప్ప, విజ్ఞులకు అభిలషణీయములు కావు.

ప్రాచీన వైదిక మతమందలి శాఖోపశాఖల యంతర్భాగములగు ప్రత్యేక సంప్రదాయములన్నియు బ్రహ్మ సాక్షాత్కారమునకు వలయు నభేద్య మైన యుపాయములై యున్నవి. వీని నన్నిటిని ప్రబుద్ధ మొనర్చి సామరస్యము గూర్చుటకును, దద్భిన్నములగు నన్య మతములను గూడ వ్యాసభగవానుడు పురాణ ద్వారమున గురు గంభీరమగు నపార గ్రంథ సంచయముతో సామరస్య మొనర్చెను. ఇందు " వాది దౌర్బల్యం వినా నమత దౌర్బల్యమ్ " అను సామెత చొప్పున హైందవ మతములో శివ కేశవులకు అభేద ప్రతిపత్తి కలిగి యున్నట్లందఱకు సుపరిచితము. భేద మంతయు మన భావన యందే, మన దృక్పథము నందే కానబడు చున్నదని —

"ఏకో దేవః కేశవో వా శివో వా" యని కొందరు భావించుకొనుచుందురు.

ఆధ్యాత్మిక రంగమున సానుభూతి గుణము ప్రముఖమైనది. కాని యొక దానిని వేరొక విధముగ నభిశంసించుటకు కాదు కదా! ఈ విషయమున యుధిష్ఠిరుని సంప్రశ్నముపై వ్యాస దేవుని సదుత్తరము గ్రహణీయమైనది.

ప్రశ్న :— "కిం తత్త్వం కిం పరం జాప్యం
కిం ధ్యానం ముక్తి సాధనమ్"

ఉత్తరము :— "శ్రీ రామేతి పరం జాప్యం
తారకం బ్రహ్మ సంజ్ఞకమ్"

అని చెప్పబడినందున నీ సమాధానమును త్రోసివేయగల్గుటయెట్లు?

ఉపనిషత్సారస్వతమందును, దానిననుసరించి తత్త్వజ్ఞాన మకరందముచే మధుర సుగంధమును వెలార్చుచున్న వివిధ పురాణ సారస్వత సంప్రదాయములందును ఏకేశ్వరత్వమును ప్రతిపాదించుచు-శైవ వైష్ణవ మతములకు స్వరూప మొక్కటియే యనియు వానియందు న్యూనాధిక్యములు లేవనియు ప్రమాణము లెన్నియో కలవు.

ఉ॥ "నమో రుద్రాయ విష్ణవే, మృత్యుర్మే పాహి"

ఇట్లే మఱికొన్ని యుదాహరణములు చూపబడుచున్నవి.

"స బ్రహ్మ స శివస్స హరి స్సేంద్ర స్సోక్షరః
పరమస్స్వరాట్"
(తైత్తరీయారణ్యకము 10-13)

" శైవం చ వైష్ణవం రూపం ఏక రూపం నరోత్తమ!
ద్వయోశ్చైవాంతరం నాస్తి ఏకరూప మహాత్మనోః
శివాయ విష్ణు రూపాయ శివ రూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణు ర్విష్ణోశ్చ హృదయం శివః
ఏకమూర్తి స్త్రయోదేవాః బ్రహ్మ విష్ణు మహేశ్వరాః "
(పద్మపురాణము, భూమిఖండము, అధ్యా-71)

మ ఱి యు

" సదా శివాయ విద్మహే సహస్రాక్షాయ ధీమహి
తన్నో సాంబః ప్రచోదయాత్ "

అని రుద్ర గాయత్రులు జపించు చున్నవి. త్రిపాద్విభూతి మహా నారాయణోపనిషత్తు నందలి శ్రీరామ గాయత్రీ మంత్ర మిట్లున్నది.

" దాశరథాయ విద్మహే। సీతా వల్లభాయ ధీమహి।
తన్నో రామః ప్రచోదయాత్ "

ఈ ప్ర కా ర ము గ :-
" నారాయణాయ విద్మహే। వాసుదేవాయ ధీమహి
తన్నో విష్ణుః ప్రచోదయాత్ "

ఇట్లే గణనీయమైన వినాయకాది దేవతా మంత్రములు కలవు.


శ్రీకృష్ణుని చెలికాడు, అతని భక్తుడునగు అర్జునుడు పాశుపతాస్త్రము గూర్చి శివుని ప్రార్థించి కృతకృత్యుడైనాడు కదా! శైవ మతాచార్యులు శ్రీ శంకరాచార్యులు తదాత్మతా సిద్ధికై 'భ జ గో విం దం మూ ఢ మ తే' మున్నగు శ్లోకముల చేతను, తదితర ప్రార్థనల చేతను విష్ణు సంకీర్తన మొనర్చియున్నారు కదా! అది పారస్పరికమైన మత వైరుధ్యమునకు నివారణోపాయము కదా!

" ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి "

అని యున్నందున అగ్నికిగాని, వరుణునికి గాని మఱి యే యితర దేవతలకేమి సమర్పించినను పరమార్థ దృష్టితో ఆ చివర వాక్యముగా నున్న భగవంతు డొక్కనికి మాత్రము చేరును.

నలుమూలల నుండి నాల్గు విధముల పేర్లు పెట్టుకొని దీర్ఘకాలము ప్రయాణించిన నదీమతల్లులు గమ్యస్థానమగు సముద్రుని జేరిన పిదప నవి యన్నియు నేమగుచున్నవి?

గమనిక :- సరస్వతి అష్టోత్తరములో "బ్రహ్మ విష్ణు శివాత్మికాయై నమః" అని యున్నది. సరస్వతియే బ్రహ్మగా, విష్ణువుగా, శివునిగా అవతరించుచున్నదని చెప్పబడినందున అన్ని తత్త్వములు పరబ్రహ్మ పద్ధతిని చెందియున్నవని - దేనినైనా ఉపాసింపవచ్చును.



# సుందరకాండము – గాయత్రీ మంత్రము

రామాయణ మందలి సుందరకాండ నిత్యపారాయణము వలన నిష్టార్థ సిద్ధులు లభించును. అచంచలమైన ఇట్టి విశ్వాసము బహుపురాతనకాలము నుండి దేశవ్యాప్తమై యున్నది. "విశ్వాసః ఫలదాయకః" అని యున్నదికదా!

సుందరకాండమున "తతో రావణనీతయాః సీతయాః శత్రుకర్మనః" అను 'త'కార ప్రారంభ శ్లోకము నుండి వచ్చుచున్న సర్గములు మంత్రబీజమయములై యున్నవి.

సుందరకాండమున హనుమంతుని సముద్ర లంఘనము, సీతాన్వేషణ మందలి దౌత్య లక్షణములు ప్రశంసనీయముగ వర్ణితములైనవి. క్రూర రాక్షస పరివేష్టితయై వారి నిర్బంధములకు వివశయైయున్న దుర్భరస్థితి యందును సీతా మహాసాధ్వి రాముని యందలి అనురాగ భావమును రాక్షసుల యెదుట నిర్భయముగా చాటిచెప్పిన విశిష్ట విషయములు, హనుమంతుని సందేశము శ్రీరాముని గుణగణ వర్ణనముతోబాటు హనుమంతుడు తన నిజరూపము సీతకు జూపించుట మున్నగునవి సుందరకాండ గౌరవమును పునః పునః వ్యాఖ్యానించినవి. (ఈ విషయమై ముందు పుటలలో గొంత చర్చింపబడెను.)

గాయత్రి :-

వైదిక మంత్ర రాజములలో ప్రసిద్ధమైనదిగా గాయత్రీ మంత్రము పేర్కొనబడుచున్నది. సుందరకాండమున నీ మంత్రము గోప్యముగా నిమిడి యున్నది.

ఈ మంత్రము సంధ్యా వందనమున (త్రిసంధ్యలందు) ప్రధానమైనందున జీవన దాతగా ప్రత్యక్ష దైవమగు సూర్యభగవాను నుద్దేశించి యుపాసింప బడినందున దీని కధీశ్వరుడు సూర్యభగవానుడని, విశ్వామిత్రుడు ద్రష్టయని అనుక్రమణిక తెల్పుచున్నది.

వసిష్ఠ విశ్వామిత్రాది మహర్షుల ప్రతిభా ప్రభావముల కాధారభూతమైనది గాయత్రి - విశ్వామిత్రుడు దీని యనుభూతిచే బ్రహ్మ తేజస్సును, బ్రహ్మబల మును ఉపార్జించెను.

గాయత్రీ మంత్రోపదేశము పవిత్రమగు ఓంకారముతో ప్రారంభింప బడుచున్నందున నీ ధ్వనియును సూర్యమండలము నుండి వచ్చినదేయని ఆర్షమతాభినివిష్టుల సిద్ధాంతము. ప్రణవోపాసనాది యీ విషయములన్నియు జర్చించి గ్రంథస్థ మొనర్చుట యసాధ్యముగాన నీమాత్రము స్పృశింప గడంగి నందులకు భావుకులు మన్నింతురు గాక!

అసలు గాయత్రీ మంత్రము ఋగ్వేదమునందే కలదు. ఋగ్వేదములో గొన్ని ప్రార్థనలు ఉషస్సు కొఱకు ఉద్దేశింపబడియున్నవి. గాయత్రి ఆకాశరాజు కూతురనియు, నిశీథపు సోదరి యనియు, సూర్య భగవానుని అర్థాంగి యనియు నింక ననేక విధములుగా పుట్టుపూర్వోత్తరములు - తదితర గ్రంథములందు విస్తరింపబడియున్నది.

గాయత్రి కామధేనువు వంటిది. ప్రణవమను వత్సముతో గూడిన యెడల నుపాసకులకు మిగుల ప్రయోజనకారి యగుచుండును. బ్రహ్మవిదులీ మంత్ర జపముతో జ్యోతి స్స్వరూపుడగు సవితృదేవుని దివ్యశక్తి నారాధింతురు.

"గాతారం త్రాయతే" అను వ్యుత్పత్తి చొప్పున లన్ను జపించు వారిని రక్షించునది కావున గాయత్రి యనబడుచున్నది. అనగా వాక్కు హృద్గత భావమును దెలుపునట్లుగ గాయత్రియందు ప్రాణమున్నదని - ప్రాణము నుండి గాయత్రి పరిణమించినదని బ్రాహ్మణములు చెప్పుచున్నవి.

గయములనగా ప్రాణములు (వాగాదులగు నింద్రియములు) అవియే శబ్దాదులకు సాధనములై యున్నవి. వానిని త్రాణము=రక్షించును కావున గాయత్రియని సార్థకమగుచున్నది.

గాయత్రి సర్వదేవతా స్వరూపురాలు – సావిత్రి, విశ్వజనని, వేదమాత, పరబ్రహ్మము, అపరబ్రహ్మము, వాక్ మున్నగునవి ఆమె నామాంతరములు. వీనికి పలువిధములగు అర్థములు చెప్పబడియున్నవి.

ఈ విధముగ ఆ గాయత్రి ప్రాణరూపమై జగత్తునకు ఆత్మయైయున్నది సామాన్య మానవ మాత్రునకు సంస్కార ద్వారమున ద్విజత్వము లభింప జేయునది గాయత్రి.

ఉపనీతుడైన బ్రహ్మచారి కాశ్రమ స్వీకార సమయమున మున్ముందుగా నతనికి గాయత్రీ మంత్ర ముపదేశించుట సదాచారమై యున్నది. అందువలన నతనికి ద్విజత్వమేర్పడినది.

"న గా య త్ర్యాః ప ర ం మ ం త్ర ం। న మా తుః ప ర దై వ త మ్"

గాయత్రీ మంత్రము మహాపవిత్రమై యగుటచే మాతృదేవతగా నారాధ్యమైనది. బ్రహ్మోపదేశమందిన వటుడు ముందుగా తన కన్నతల్లిని నమస్కరించి ప్రథమభిక్ష యాచించుచున్నాడు. ఇది సంస్కార విశేషము – దీని వివరములు తెల్పునుపదేశమే బ్రహ్మోపదేశ మనబడును.

మాతృదేవో భవ – పితృదేవో భవ – ఆచార్యదేవో భవ యని శిక్షావల్లి మాతృరూప శక్తికి అగ్రస్థాన మొసగినది. ద్వంద్వ సమాసములో తల్లి దండ్రులు – అత్తమామలు – రాధాకృష్ణులు – సీతారాములు – పార్వతీపరమేశ్వరులు అని ముందుగా స్త్రీ వాచకమునకు ప్రాధాన్యమిచ్చిరి.

గాయత్రీ ఛందస్సు ఆఱేసి యక్షరములు కలిగి, నాల్గు పాదములు కలిగి యున్నది. ఆపాదములలో మూడు పాదములు "త్రిపాదస్యామృతం దివి" అని తెల్పిన రీతిని నిర్గుణ పరబ్రహ్మమైయున్నవి. శేషించిన నాల్గవ పాదము 1 వాగ్రూపము 2 భూతరూపము 3 పృథ్వీరూపము 4 శరీరరూపము 5 హృదయరూపము 6 ప్రాణరూపము – ఇట్లు ఆఱు విధములుగ (షట్కుక్షి) రూపము గలిగియున్నది.

గాయత్రి సర్వప్రపంచ రూపిణియై ప్రపంచాధిష్ఠానమగు పరబ్రహ్మ రూపముగా (ఆత్మపరముగా) అర్థము చెప్పబడుచున్నది. కాని ఛందఃపరము కాదని చెప్పుదురు.

ఛందస్సులలో గాయత్రీ చ్ఛందము " తానే " యని భగవద్వాక్యము.

" గా య త్రీ ఛ ం ద సా మ హ మ్ " ( గీత 10-35 )

జ్యోతికి గూడ నాల్గు పాదములు చెప్పబడినందున జ్యోతిశ్శబ్దమును గాయత్రీ శబ్దమును ప ర బ్రి హ్మ ప ర ము గ నే అన్వయింపబడుచున్నవి. ఉపాసకుని బుద్ధి తారతమ్యము ననుసరించి సౌ ల భ్య ము కొఱకు కాలభేద, తంత్రభేదముల ద్వారమున గాయత్రిని సావిత్రిగను, సరస్వతిగను, లక్ష్మీదేవత గను అనేక రీతుల నాహ్వానించి స్తుతింతురు. ముఖ్యముగ మూడు కాలము లందును నీదేవతయే మూడు పేరులతో పిలువబడును. వస్తుభేదములేదు. గాయత్రి గూర్చియు, సూ ర్య భ గ వా ను ని గూర్చియు విశేషాంశములు కాశీఖండాది బృహద్గ్రింథములందున్నవి.

ఆత్మ సంతోషదాయకమగు నుపాసనలందు గాయత్రీ ఉపాసన ప్రముఖ మైనది. దీని విషయమై రేఖా మాత్రము సూచింపబడినది.

" గా " శబ్దమునకు శతృ ప్రత్యయము చేర్పగా ' గా య త్ ' శబ్ద ముత్పన్నమగును. పిమ్మట " త్రై జ్ పా ల నే " ధాతువు నుండి సంబద్ధమై స్త్రీ ప్రత్యయాంతముగా గాయత్రి శబ్దముత్పన్నమైనది.

గాయత్రీ మంత్రమునకు గాయత్రి యనుపేరుగల ఛందమైనందున గాయత్రీ మంత్రమని చెప్పబడెను.

సవితృ (వేద) సంబంధము కల్గి యున్నందునను, బ్రాహ్మణోపాస్యయ గుట వలనను బ్రహ్మ గాయత్రి యనబడును.

గురుమంత్రము :- ఉపనయన సమయమందు ద్విజబాలునకు గురువు మూలమున గాయత్రీ మంత్ర ముపదేశ్యమగు చున్నందున గురు మంత్ర మనబడును.

వేదమాత :- వేదములు ఆమె కుక్షినుండి బహిర్గతమైనందున వేదమాత యనబడును.

కనుక దీనినెవరు శ్రద్ధాభక్తులతో ప్రాణాయామము కూడ ఆచరించి చింతన, అర్చన, పూజనాది శాస్త్రీయ విధులతో నుపాసింతురో అట్టి మహాను భావు లందఱు ఆదేవతా కటాక్షమునకు పాత్రులై అలౌకికమైన ఇహపరసౌఖ్యము లనుభవింతురు.



# ఆదర్శ ప్రార్థన

ఓం, భూర్భువస్సువః

"తత్స వితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్"

తా॥ దేవస్య=దివ్యమై ప్రకాశించుచున్న, తత్ సవితుః=సూర్యుని యొక్క, వరేణ్యం=శ్రేష్ఠమైన, భర్గః=తేజస్సును, ధీమహి=ధ్యానించెదము. యః భర్గః=ఏ సూర్యునియొక్క తేజస్సు కలదో అది - నః=మా యొక్క ధియః=బుద్ధులను, ప్రచోదయాత్=ప్రేరేపించు గాక!

అర్థము :- సర్వలోకములకు ప్రభువు, జ్ఞాన స్వరూపుడు, తేజస్సునకు స్థానము, సమస్త లోకములకు ఆశ్రయము, పాప రహితుడు - మంగళ కరుడునగు పరమాత్మను మేముపాసించుచున్నాము. ఆయన మా బుద్ధిని వికసింపజేసి, మాకు జ్ఞానమును ప్రసాదించి మమ్ముల నడిపించుగాక! అనగా తమో (అజ్ఞాన) నివారకమగు సూర్యభగవానుని ప్రసిద్ధ వరణీయ తేజోమయ స్వరూపమును ధ్యానించెదమని అర్థము. "నాకు జ్ఞానమును ప్రసాదించి నన్ను ధర్మమార్గమున నడిపింపుము" అను కోరిక ఉత్తమమైనది. ఇదే భారత జాతీయ ప్రార్థన - చాల ఉత్కృష్టమైనది. ఆరోగ్యమునకు, బుద్ధి వికాసమునకు సహకారి___

మఱియు నీ గాయత్రీ మంత్రము "తత్త్వమసి" యను సామవేద మందలి ఉపనిషద్వాక్యమగు మహా వాక్యములో 'తత్' పదమూలముగా అంతర్గతమై తత్సవితుర్వరేణ్య - ప్రచోదయాత్ అను ఆద్యంతాక్షరములు కలియున్నట్లి మిడియుండెను. "తత్త్వమసి" అనగా, ఆ పరబ్రహ్మమే నీవై యున్నావని యర్థము. ప్రస్తుత కాలమున గాయత్రీ మంత్రానుభూతి యెవ్వరికి కలదో జిజ్ఞాసువులు తెలియ జాలకయు, వారి నాశ్రయించియు భ్రమించి విఫల మనోరథులగుట శోచనీయము.

గాయత్రీ మంత్రమున శ్రుతుల ననుసరించియు, పలువురు సాధకుల యనుభూతి వలనను ముఖ్యమైన నాల్గు అర్థములున్నవి.

1 సూర్య పరము 2 సూర్యమండలాంతర్గత సూత్రాత్మపరము 3 అక్షర బ్రహ్మ పరము 4 నిర్గుణ పరము అయియున్నవి. ఈ ప్రకారము ఏకపాద విభూతి గల బ్రహ్మాండ మంతయు క్షరాక్షర రూప విలసితమైనది. (గీత 10-42 చూడు)

ఈ మంత్రముల మధ్య ఇరువది నాల్గక్షరములు గల గాయత్రి సమకూర్చబడెను. గాయత్రీ మంత్ర జపానుష్ఠానము ఉపనయన సంస్కారముతో ప్రారంభింపబడును. ఉప=సమీపే; నయనం-ఉపనయనం అని వ్యుత్పత్తి - ఉపనయనం సమీపమును పొందియుండుట. అనగా ఆత్మతత్త్వమును దెలిపి ఆత్మను పొందియుండుట అని అర్థము. 'జీవాత్మయనబడు నేను పరమాత్మ యనువాని కంటె వేఱుకాదు' అనెడు సద్భావముతో బ్రహ్మశక్తియైన గాయిత్రి నుపాసింపవలెను. ఆత్మానుభూతి గల ద్విజవరుని వలన (ఆచార్యునివలన) ముద్ర సాధనలు గ్రహించి దీని నాచరింపవలయును. లేని యెడల నిది వ్యర్థము.

1 ప్రకట గాయత్రి- 2 తురీయ గాయత్రి- 3 గుప్త గాయత్రి- 4 హంస గాయత్రి (లేక అజపా గాయత్రి) అని నాల్గు రీతులుగా అర్థము చెప్పుదురు. తదంగముగా సంధ్యాదేవతను శైవులు - వైష్ణవులు - బ్రహ్మవిదులు గాయత్రి నుపాసింతురు. జప ప్రారంభమున నీదిగువ శ్లోకమున వర్ణితమైన ఛాయా రూపమును బుద్ధి కల్పిత మొనర్చి దాని యందు స్థిరముగ మనస్సును నిల్పి ధ్యానింతురు.

శ్లో॥ ముక్తా విద్రుమ హేమ నీల ధవళ చ్ఛాయై ర్ముఖై స్త్రీక్షణైః
యుక్తా మిందు నిబద్ధ రత్న మకుటాం తత్త్వార్థ వర్ణాత్మికాం
గాయత్రీం వరదా భయాంకుశ కశాశ్శుభ్రం కపాలం గదాం
శంఖం చక్ర మథారవింద యుగళం హస్తైర్వహంతీం భజే !

—()—

# ఆదిత్య హృదయము

ఆర్య మహర్షుల విజ్ఞాన భాండార మంతయు తులనాత్మకమైన పరిశోధన లచే పరిపూర్ణమై బహుపురాతనమైన ఋగ్వేదములో దేవతోపాసన పరమైన సౌర మంత్రములు - మహాసౌర మంత్రములు శ్రుతి మధురముగ గాన మొనర్పబడి పెక్కులున్నవి. నిరుక్తములో సావిత్రిని సంబోధించి పది ఋక్కులు చెప్పబడినవి. అవి సూర్యునకు సంబంధించి యున్నవి. ఆ మంత్రము లన్నియు శక్తిమంతములైన బీజాక్షరములు.

మంత్రవేత్తలు ఏదైన నొక మంత్రమును ప్రయోగాత్మక మొనర్చి నపుడు సాధారణముగ బూడిదపైగాని, జలముపైగాని మంత్ర ప్రభావమును ఎక్కించి ప్రయోగింతురు.

శ్రు॥ " ప్ర తా ర్యా యుః ప్ర త ర ం న వీ యః "

"ఓ భ గ వా ను డా! మమ్ము నవీనము నుండి నవీనతరమైనట్టియు - ఉత్కృష్టము నుండి ఉత్కృష్టతరమైనట్టియు జీ వ న ము న కు అభివృద్ధి పఱచుము". ఇట్టి ప్రార్థనలన్నియు మాంత్రిక శక్తులను దోహద మొనర్చుట కుపకరించును. ప్రార్థన యనగా అంతశ్శుద్ధితో సత్యస్వరూపము నా రా ధి ంచి సత్యమయుడై దానియందు విలీనమగుటకు యాచించుట. నిజమైన ప్రార్థన యందు క్షుద్రమైన అహంకారభావ ముపశమింపబడి ఆత్మనివేదన రూపములో వినయశీలత పెంపొందించబడును. అది నిష్కామమగు ప్రార్థనయైన యెడల పరాత్పరుని యఖండ సంపర్కము దాని యందు మిళితమై వి శే ష బలము చేకూర్చును.

రామాయణ మందలి ఆదిత్య హృదయము మంత్ర బీజమయమై వెలసి యున్నది. రామ రావణ యుద్ధ సందర్భమం దలసిపోయి ఖిన్నుడై యున్న రామునింగని అగస్త్యుడు ఆదిత్యహృదయము జపించుమని శ్రీరామచంద్రునకు ధైర్యమొసగి ప్రబోధించినాడని యుద్ధకాండమందు చెప్పబడినది.

" ఏ ష దే వా సు ర గ ణా న్ లో కా న్ పా తి గ భ స్తి భిః "

అని ఆదిత్య హృదయమున తెలుపబడినది. ఆదిత్య హృదయ స్తోత్రము "సర్వ దేవాత్మకో హ్యేష" అని మొదలుకొని "లోక సాక్షిణే" అను వఱకు అష్టోత్తర శత (108) నామ మంత్రములతో స్తుతింపబడినది.

ఆదిత్య హృదయమనగా సూర్యహృద్గతుడు పరమపురుషుడు కనుక ఆ పరమపురుషుని ప్రతి పాదించునది యని అర్థము.

"జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమోనమః
నమోనమః సహస్రాంశో ఆదిత్యాయ నమోనమః"

ఈ మొదలగు మంత్రరాజములచే సూర్యభగవాను నారాధించి శ్రీరామ చంద్రుడు విజయలక్ష్మిని చేపట్టినాడు.

సాధారణముగా ఆదిత్య హృదయ పఠనము వలన — సూర్యనమస్కార ముల వలన ఔషధ సాధన మపేక్షింపక సాంక్రామిక రోగనివృత్తి యగు చుండుట తన్మంత్రార్థ పారదృశ్వుల కనుభవైకవేద్యము. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని చెప్పబడియున్నది కదా! జ్యోతిష్వదార్థమగు సూర్యుని భగవద్భావనతో సూర్యోదయ సమయమున (త్రిసంధ్యలయందును) ఆరాధించుట, సూర్యనమస్కారము లొనర్చుట హైందవ జాతికి పరమ ధర్మము.

ఓం హ్రాం మిత్రాయనమః — ఓం హ్రీం రవయేనమః — ఓం హ్రూం సూర్యాయనమః — ఓం హ్రైం భానవేనమః అని సంకల్పించుకొని యథాశక్తి అర్ఘ్యమిడుట కెల్లతెగల వారికి నధికారము కలదు.

వేదకాలము నుండి సూర్యుడు మన ప్రధాన దేవతగా ఆరాధింపబడుచున్నాడు.

"భానో భాస్కర మార్తాండ చండరశ్మే దివాకర!
ఆయురారోగ్యమైశ్వర్యం పుత్ర మిచ్ఛామి దేహిమే"

ఈ మొదలగు ప్రార్థనలతో సూర్యభగవాను నారాధించు సంప్రదాయము మనదేశమునకు రత్నకిరీటము.

మనదేశములో సూర్యభగవానుని దేవాలయములు కూడ పురాతనము నుండి కొన్ని ప్రాంతములందు అచ్చటచ్చట వెలసియున్నవి. అవి పుణ్య క్షేత్రములుగా వర్ధిలుచున్నవి. వీని విశిష్టత కాశీ ఖండాది స్థలపురాణములందు, దేశచరిత్రమందు తెలియగలదు.

గ మ ని క :— శూద్రునికి సంధ్యావందనము చెప్పకూడదని కొందరి మత మున పూర్వకాల ముండెడిదట — ఇప్పటి దుస్థితినిబట్టి మనుస్మృతిలో జెప్పబడి నట్లు అందఱును శూద్రులే ఐపోయిరి కదా? ఇంక ద్విజత్వ మెక్కడ? అతని యుచ్చారణలో లోపము లుండునని, అది నివారింపజాలక శూద్రుని విషయమై అట్లు చెప్పబడి యుండవచ్చును. కాని ఇప్పటి నాగరిక ప్రపంచములో ఆ మాట లేదు, అందఱు సమానులే — ఎవరికి వారే పెద్దలు — అందు వలన నైతిక పతనము కాలక్రమమున జరిగినది.

మతవిషయ పరిజ్ఞానమెట్లున్నను ప్రకృతి శాస్త్ర మర్యాద దృష్ట్యా సూర్యభగవానుడే సకల ప్రపంచమును చైతన్యవంత మొనర్చి పరిరక్షించుట ప్రత్యక్ష ప్రమాణము.

శ్రు॥ "సూర్య ఆత్మా జగతః తస్థుషశ్చ"

అని చెప్పబడినది. ఇంకను —

శ్రు॥ "య ఏషోంత రాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యమ్"

ఇత్యాదిగా శ్రుతులు తెలుపుట వలన సూర్యుని యందున్న హిరణ్మయ పురుషుని పరమాత్మగా భావించి ఉభయ రీతుల తరించు చున్నామన్నమాట. ఆదిత్యుడనగా సూర్యుడు. అతని హృదయము అనగా హృద్గతమని — అతని లోపల నుండు పరమ పురుషుడని అర్థము గమ్యమగుచున్నది. కనుక ఈ ప్రార్థనయు సర్వభూతాంతరాత్మయగు పరాత్పరునకే చెందియున్నది.

—()—

# ప రి శి ష్ట ము

భారతదేశపు అధ్యాత్మిక యోగ్యతలు గ్రహింపదలచి చాల కాలము నుండి సంస్కృత భాషను జర్మనీ దేశము ఆకర్షించి ప్రగతి శీలమైన కార్య కలాపములు సాధించినది.

మా న్య మ హా శ యు డ గు నొక జర్మన్ పండితుడు వాల్మీకి రామాయణము చ క్క గా చదివి రామాయణము ఋగ్వేద మంత్రమైన మహాగ్రంథమని " రి డి ల్ ఆ ఫ్ రా మా య ణ " అను నాంగ్ల గ్రంథ మున నభివర్ణించినాడు.

అత్యద్భుతమైన భాషా పాటవముతో అనుప్రాణితమైన శ్రీమద్రామా యణము ప్రపంచ భాషలన్నిటియందు అనూదితమైయున్నది ఇ టీ వ ల ' రష్యన్ ' భాషలో కూడ ననువదింపబడినట్లు తెలిసికొనుచున్నాము.

" సోవియట్ " దేశమందలి 'మాస్కో' నగరములో నెప్పటికప్పుడు రామాయణ నాటక ప్రదర్శనలు వైభవోపేతముగ జరుపబడుచుండుటయే గాక అచ్చటి భవితవ్యపు ప్రతిరూపులైన బాలబాలికలు రామాయణ గాథపై సత్యమే దైవమను దృక్పధముతో సద్వృత్తమైన వ్యాస రచన జరిగించుచుండిరి.

సృజనాత్మకమైన శ్రమదమాదులతో - కష్టసహనముతో క ర్త వ్య నిర్వ హణమందు పురోగమించుటకు అపురూపమైన ఆనాటి భారతీయ సంప్రదాయ ములలవర్చుకొనుటకు వారు కృతప్రయత్నులై తదేకతానులై ఆ కాం క్షి ంచు చున్నారు. మాస్కోలోని భారతీయులు, అచటికి పర్యటనార్థము విచ్చేయు సమస్తదేశ రాయభారులును, అతిథులును ఈ ప్రదర్శనములను ఎంతయు ప్రశంసించుచున్నారు.

ఐరోపాలోని కొన్ని దేశములలో రామాయణ గాథలు, తోలుబొమ్మలా టల ద్వారమునను - నృత్య కళా ద్వారమునను ఔచితీ స ం ప న్న ము గ ప్రదర్శింపబడుచున్నవి. మిత్రుల గోష్ఠిలో అందలి పాత్రలను అభినందించుచు తమ్ముదాము అభినందించుకొనుచున్నారు.

కాంబోడియాలో రామాయణ గాథ పదకొండవ శతాబ్దియందే రమణీయ శిలామూర్తులలో వాసి గాంచినది. అదియొక స్పృహనీయమైన సుందర కళా వైదగ్ధ్యమునకు మార్గదర్శకమైనది.

శ్యామ (సయామ్) దేశములో వెలసిన రామకథలో రామ రావణు లిద్దరు నన్నదమ్ముల బిడ్డలని అభివర్ణింప బడుచున్నదట! ఈ విషయము మన దేశ చరిత్రకు పరిత్యామ్నాయముగ విరుద్ధమై యున్నప్పటికి ప్రాయశః దేశ సంప్రదాయమునుబట్టి రామకథను ఆయా దేశీయులు తమ తమ భావనా బలము నుపయోగించి ఇచ్చవచ్చినట్లు త్రిప్పుకొనుట కవకాశములన్నియు ఆ కథయే కల్పించుచున్నది. ఇట్లే వివిధ దేశములందలి రామాయణములు మూల విధేయములుగను - మూలాతిక్రమణములుగను ప్రచలితమగుచున్నవి. కాని, నిజమాలోచించిన యెడల రా మా య ణ గా థ ధర్మాధర్మములకు, ఆర్యానార్య కృత్యములకు ప్రచండ సంగ్రామము కన్నులకు కట్టించినది.

దైవిక శక్తులకు, ఆసురిక విజృంభణమునకు - ఘోర సంగ్రామము ప్రత్యక్షీకరించినది. రాముడెంత పర దారా పరాఙ్ముఖుడో, ఔదార్యపరుడో ప్రతి పక్షియగు రావణుడంత కాముకుడు, మర్యాదాహీనుడు. రాముడెంత స్వార్థ రహితుడో రావణుడంత స్వార్థ మండితుడు. రామునిది అయోధ్యా రాజ్యము. రావణునిది లంకా రాజ్యము. రామునిలో ప్ర జా గౌ ర వ, సౌభ్రాత్రములు, రావణునిలో హింసాకాండ, భ్రాతృనింద గోచరించును. శ్రీరాముడు గొప్ప విలుకాడు. రణ కర్కశుడు. అంతకోపముడు. - రావణునకీ బిరుదములు లేవు ఉత్తర రామాయణమున నీతని వస తెలియనగును. ఇట్లే కథ యంతయు నూహింపవచ్చును.

కమనీయ రమణీయములకు గీటురాయి వంటి సరళ సుందరమైన శబ్ద సమామ్నాయములతో సంస్కృత భాషయందలి రామాయణములు గద్య పద్యాత్మకములుగను - దృశ్య (నాటక) శ్రవ్య (ప్రబంధ) కావ్యములుగను విద్వన్మూర్ధన్యులు — ప్రతిభా మహనీయులైన పూర్వకవీశ్వరులు మురారి -

భవభూతి - భాసుడు - భోజుడు - శక్తిభద్రుడు - దిఙ్నాగుడు మున్న గు నెందరో శక్త్యను సారము నిర్మించి తమ కవితా ప్రౌఢిమను ప్రదర్శించుట వారి నైపుణ్యమునకు, వైదుష్యమునకు, విశ్వతోముఖ పాండిత్య ప్రతిభకు విజయ లాంచనముగా నెన్నబడుచుండెను. రామాయణమున నుత్తరకాండ యందు సీత భూగర్భమున లీనమైనట్లున్నది. కాని ఉత్తర రామ చరితమున వాల్మీకి యనుగ్రహముచే సీతారాములు కలిసికొని సుఖముగానున్నట్లు భవభూతి గ్రంథ సమాప్తి యొనర్చినాడు. ఇట్లు చేయుట అలంబన విచ్ఛిత్తి కాకూడదని శుభాంతమొనర్చినాడు.

ఔచితీ సంపన్నత ననుసరించి కొన్ని సంస్కృత రామాయణములు (నాటకములు మున్నగునవి) మూల రామాయణముతో సంబంధము లేకయే స్వేచ్ఛగా చిత్ర విచిత్ర కల్పనలతో సృష్టింపబడినవి. అవి యట్లుజరిగినందున నితర భాషల యందును, అట్లే మన తెలుగు నందలి భాస్కర, గోపీనాథ రామాయణాదులు అనేక ఘట్టములందు మూలాతి క్రమణములై వెలసినవి. పెద్దపెద్ద మార్పులు చేయబడినవి. అట్లయ్యును అవి యన్నియు సునిశితమైన కావ్యకళా సంపత్తికి ప్రబల నిదర్శనములుగా నెన్నబడుచున్నవి.

మన దేశమిందు వివిధ భాషలలో వెలసిన రామాయణములు చదవు చున్నప్పుడు, వినుచున్నప్పుడు తాను తన మతాంతరమగు సంకుచితాభిప్రాయము విస్మరించి ఆధ్యాత్మికోద్గమనము పొందుచు భక్తి పారవశ్యముతో నానంద సాగరాంతర్నిమగ్నుడగుటయు, పులకితగాత్రుడగుటయు సాధారణ విషయము.

ఇంతయేల? మన పూర్వీకులందరు - అక్షరాభ్యాసము జరుపబడిన వెను వెంటనే రామాయణము పాఠ్యగ్రంథముగా నియమించుకొని సంస్కృత విద్య ప్రారంభించుట ఆచారమై యుండెడిది. కాళిదాసుని రఘువంశ రచనకు పూర్వమిట్లే యుండెడిది.

వాల్మీకి తరువాత నతని సరస నుండ తగిన విశ్వమహాకవి కాళిదాసుడు. నవ కావ్య నిర్మాణమున కితడు మార్గదర్శి. సర్వ విధముల నితడు వాల్మీకి

పోకడలను, భావ సంచయమును ఆలింగన మొనర్చి రఘువంశ మహాకావ్యము నిర్మించి జగద్ధిత కీర్తి నార్జించెను. భువనసృష్టికి విధాతవలె కథనసృష్టికి కాళిదాసుడు బ్రహ్మదేవుని తలపించుచున్నాడు.

వాల్మీకి కవికుల తిలకు డనబడినపుడు కాళిదాసుడు కవికుల తిలకు డని పించుకొనుట ఆశ్చర్యమేమి? వీరి కవితా స్రవంతి జాతి మత వర్ణాది పరిధుల కతీతమై విశ్వజనీనమైన విఖ్యాతి నార్జించెను. వ్యాస, వాల్మీకులయు-భాస, కాళిదాసుల యొక్కయు కాలము నందలి కావ్య శైలి నిసర్గసుందరమగు పద జాలముచే నర్థస్ఫూర్తి జనించు రసానుభూతికి మార్గదర్శకముగ నుండెడిది.

రఘువంశ మహాకావ్యము ఇక్ష్వాకు వంశీయుల శీల సంపదకు, రాజ మర్యాదకు ప్రశంసా రూపమైన ప్రతిబింబము. " త్యా గా య స ం భృ తా ర్థా నా ం " త్యాగము చేయుటకే వారొనర్చిన ధన సంగ్రహమని యర్థము. అదే దృష్టితో కాళిదాసు శ్రీరామచంద్రుని పాత్రను సమర్థనీయముగ చిత్రించెను. కారణమేమన భారతీయ సిద్ధాంతములో స్వార్థ త్యాగమే మొదటి మెట్టని కాళిదాసుని యభిప్రాయము - ఆ పిమ్మట శ్రీరాముని పుత్రుడగు కుశుడు రాజ్యపాలన మొనర్చుచున్న విషయము పేర్కొనెను.

కుశుని శీలమును పరీక్షింపదలచి యొకనాటి రాత్రి అతడు నిద్రించు చుండగా నర్థరాత్రమున తన యొద్దకు వచ్చిన అయోధ్యారాజ్యలక్ష్మిని జూచి ఆమె సాధారణ స్త్రీ యనుకొని కుశుడామెతో నిట్లు ప్రశ్నించెను.

శ్లో॥ " కా త్వం శుభే। కస్య పరిగ్రహోవా
కిం వా మదభ్యాగమ కారణంతే
ఆ చక్ష్వ మత్వా వశినాం రఘూణాం
మనః పరస్త్రీ విముఖ ప్రవృత్తిః "

తా॥ ఓ కల్యాణీ! నీవెవరవు? ఎవని భార్యవు? ఎందుకు వచ్చితివి రఘువంశస్థులు పరస్త్రీ విముఖులని గ్రహించియు ఎ ం దు కు వచ్చితివో తెల్పుము అనెను. (రఘువంశము 16వ సర్గము - శ్లో॥ 8)

ఇంకను భక్తి రసస్ఫోరకములగు రామకర్ణామృతము, కృష్ణకర్ణామృతము మున్నగు వివృతుల గూర్చి చెప్పవలసి వచ్చినపుడు అవి యెంతగా వర్ణించినను తనివి తీరని మాధుర్య రసభరితములై యొప్పును.

గొప్ప ప్రామాణికుడు, భాగవతాగ్రేసరుడు జయదేవుడు. ఇతడు రచించిన గీత గోవింద మందలి అష్టపదులు - నారాయణ తీర్థుల శ్రీకృష్ణలీలా తరంగణి యందలి తరంగములు - త్యాగరాజకృతులు - అధ్యాత్మ రామాయణ కీర్తనలు - సీతారామాంజనేయము (ఆంధ్ర పద్య కావ్యము). వీని యన్నిటికిమకుటాయ మానమైనది పోతన భాగవతము. ( ఇది ద్వాదశ స్కంధ పరిమితము. స్కంధ మనగా మొదలని యర్థము. భాగవత భాగముల కెక్కడ జూచిన నక్కడనే యది ప్రారంభమగుటచే నిట్లు చెప్పబడెను ) ఇది జిజ్ఞాసు జన కల్పతరువు. ఇందలి శ్రీరామ చరిత్ర, ప్రహ్లాద చరిత్రాదులు సర్వదా ఉపాదేయములు.

వీనిలో నేయొక్కటియైన శ్రుతి గోచరమైన యెడల, లేదా చక్షుర్గోచర మైన యెడల మానవాళిలో నిద్రాణమై యున్న భక్తి భావన జాగరితమై నర్చి ఆంధ్రుల కభిలషితార్థ చింతామణిగా వారి హృదయములపై చెఱుగని ముద్ర వేసి తీరును. పరసువేధి సంస్పర్శమున నినుము బంగారమైనట్లు మానవ మాత్రుడు సాక్షాత్పరమాత్మగా భాసిల్లుట సత్యదూరము కాజాలదు.

భగవత్సేవా రమమాణులని, సత్యస్వరూపము గ్రహించిన మహాభక్తా గ్రేసరులని ఎన్నదగిన మహానుభావులెందరో ప్రతి యుగము నందును వెలయు చునే యున్నారు.

హిందీలో తులసీదాసు - తమిళ భాషలో కంబన్న - వంగ భాషలో కృత్తివాసుడు - మరాఠీలో శ్రీధరుడు - ఆంధ్రములో రంగనాథ, భాస్కరాది మహామహులెందరో రామాయణ కథా రచనలో సిద్ధహస్తులు. పరమ భాగవతో త్తములు. సర్వతోముఖ పాండిత్య శోభితులు. ఆచంద్రార్కమైన పేరుప్రతిష్ఠల

నార్జించిరి. ఇంకను మన తెలుగునాట పేరుగన్న కవులు, కవయిత్రులు నెందరో వెలసినారు. వారినందఱిని పేర్కొన జాలమికి గినియకుందురు గాక!

దివ్యమందారమువలె నిత్యవాసనా విభూతి విలసితమైన శ్రీరామచంద్రుని సచ్చరిత్ర మూలమున యావద్భారతము ధర్మవిలసితమై హిమాలయ శృంగము వలె - ధ్రువతారవలె శాశ్వతత్త్వము వహించినది కానియెడల మనదేశము అంధకార బంధురమై అధోగతిపాలగుట యందాశ్చర్యమేమి?

శ్రీ రాముడు మన భారతావనిలో పలు ప్రాంతములందు పదస్పర్శ యొనర్చి పర్యటించిన స్థలములన్నియు తొలిచూపునందే మనస్సులకు హత్తుకొని పోయి బహుజనాదరణ జూరకొన్న పుణ్యక్షేత్రములై విరాజిల్లినవి.

శ్రీరాముడు ముఖ్యముగ జాలకాలము, ఇంచుమించు పది వత్సరములు తన వనవాస కాలము నాంధ్రభూమియగు దండకారణ్యములో గోదావరి తీరమున గడిపినందున ఆ ప్రదేశ మంతయు సీతారాముల పాదరజస్స్పర్శచే పవిత్రీ భూతమైన దివ్యభూమియైనది. కృతజ్ఞతా బద్ధమైన ఆంధ్ర దేశము సౌజన్య పరమావధిగా తలపనై యున్నది.

ఆంధ్రులెల్లరు సర్వాంగీణముగా రామభక్తి పరాయణులగుటకు వెను దీయరు. సర్వజనోపయోగమగు భజన కూటములకు - రామ నామ క్షేత్ర నిర్మాణమునకు ఆంధ్రావని పెట్టినది పేరు. రామ నామమును హృదయములో ధ్యానించి ఆతని జీవితాదర్శములను, లక్ష్యములను తమ తమ జీవితాదర్శము లను గావించు కొనిన యుదాత్తపురుషులలో, సజ్జ జీవన పరాయణులలో, రామోపాసకులలో ఆంధ్రులకు ప్రత్యేక స్థానమున్నది.

గమనిక :- ( ఉపాసన యన్నను, భక్తి యన్నను నొకటే యర్థము. ఈ రెండును పర్యాయ శబ్దములు.)

తెలుగునాట నెందరో కవి పుంగవులు రామ చరిత్రము బహుజన్మ ఫల భరితమగు భాషా కావ్యముగ వ్రాసి తరించిరి. నామ సంకీర్తన ప్రియులగు

భద్రాద్రి రామదాసు వంటి దైవభక్తి పరాయణు లెందరో రామాలయములు నిర్మించిరి.

పోతరాజు - త్యాగరాజు - సమర్థ రామదాసు - కబీరు - తులసీదాసు మున్నగు వారికి ప్రత్యక్షముగా శ్రీరామచంద్రుని దర్శన భాగ్యమబ్బినది. ఇట్టి వన్నియు అనంతములు.

ఇంకను వాఙ్మయ జగత్తువందు సారస్వత విలాసాకృష్టులగు మహేశ్వర తీర్థ, గోవిందరాజాదుల సుప్రసిద్ధ వ్యాఖ్యానముల వలన రామ కథా ధుని జీవనధారగా ప్రేక్షకులకు యెంతగా ప్రవహించినది - రాణించు నదియు అనూహ్యము.

రామనామ ప్రభావము శ్రేణీక్రమ పరిణామముగా నక్షరాస్యులగు సజ్జనుల రామకోటి రచనల వలన - కళాచైతన్యము మేలుకొలుపు వలన చిత్ర ప్రదర్శకుల నైర్మాణిక ప్రతిభ వలన - వివాహాది శుభలేఖల వలన - ఔత్సాహిక కళాబృందములచే ప్రదర్శితము లగుచున్న నాటకీయ, జానపద నృత్యాది కళా ప్రవాహము నందలి ఇతి వృత్తముల వలన - అక్షర శ్రీకారము వలన - నూతన సంవత్సరారంభ మందలి మధు మాసములో శ్రీరామ లీలా మహోత్సవము లందలి శ్రీరామ జన్మ దినోత్సవములు - కల్యాణ మహోత్సవములు - సామ్రాజ్య పట్టాభిషేకములు మున్నగు సామూహిక శుభ సందర్భములందును హైందవ కుటుంబికుల నామధేయముల వలన, దేశ వ్యాప్తముగ నుద్దీప్తమైన దేవాలయముల వలన, అందలి అతిలోక శిల్ప కళా నిర్మాణముల వలన, ఆసక్తిదాయకమైన వివిధ సన్నివేశము లందును చివరకు ప్రాణోత్క్రమణ సమయమందు ప్రచురితమై సంతరింపబడిన లక్షణము లన్నిటికి లక్ష్యముగా నున్నవాడెవడు? అది యొక పెద్ద ప్రశ్న - అతడే శ్రీరాముడు - అజరామరమైన ఆతని పరిపూత దివ్యనామమే జీవజాలమున కంతటికి అవిభాజ్యమైన పరమధ్యేయము - అదియే బ్రహ్మాండమైన దివ్య సంజీవిని - వజ్రకవచము.

ఆ నామమును భావించి తత్పురస్సరముగా గోరంత చేసినను దుర్భేద్యమైన కొండంత ఘనకార్యముగా స్థిరపడును అది వికల్పములేని సంకల్పము. ఆత్మోద్ధరణ రూపమైన శుభ చింతనమును పరామర్శించు చుంటిమనుమాట కామధేనువు వంటి తల్లిగల ధనవంతునిబిడ్డకు ఔదర్యగుణమందు లోపమేమి? అందు వలన భారత జాతి ధర్మోద్ధారక రూపమగు మహోద్యమమునకు వేగు జుక్కవలె పునర్వికాసమయ మగుచున్నది.

రామ నామము కవీశానులు తమ ఉగ్గాణములో నిలువ యుంచుకొన్న అమూల్య పదార్థము. గతానుగతికులైన సామాన్యుల పాలిటి అమృత తరంగిణి - శ్రీరాముని ప్రసాదమనెడి ప్రకాశముచే నిక్ష్వాకు కులమందొక విలక్షణ ప్రభాతము స్ఫురించెనని తెల్పుట మాత్రము కాదు. ప్రపంచ మందలి తీవ్ర ఉద్రిక్తతను, భీభత్సకాండను, ఘాతుక చర్యలను అంతమొందించి ఆశాకిరణములు సర్వవ్యాప్త మొనర్చెననుట నిస్సందేహము.

ఇంకను శ్రీరామచంద్రుని వంశ మర్యాద, ఆతని గుణగణముల గూర్చి మఱికొంత దూరము యోజింతము.

పేరెన్నికగన్న అయోధ్యా సామ్రాజ్యమును స్వయముగా నిర్మించిన మూలపురుషుడు వైవస్వతమనువు. ఇతని పిమ్మట ఇక్ష్వాకు మహారాజు - వీరి కంటె పైతరము వారుగా బ్రహ్మ, మరీచి, కాస్యపుడు, సూర్యుడు అను వారుండిరి. ఇందులో సూర్యపుత్రుడే పైని పేర్కొన్న మనువు. మనువు పుత్రుడే ఇక్ష్వాకువు. వీరి వంశక్రమమిట్లు వరుసగా గమనించి నందున సూర్యవంశమని జనక చక్రవర్తికి సీతాకల్యాణ సమయములో వసిష్ఠుడు వివరించినాడు. ఇది రాముని పరంపరాగతమైన యోగ్యత. శ్రీరాముడు సర్వసహుడు. అందరి యాత్మలందును ఉద్దీప్తమై విశ్వజనీనమగు అస్తిత్వ మును గడించినాడు.

శ్రీరాముని సత్యసంధత - పితృవాక్య పరిపాలనము - ఏక పత్నీ వ్రతము - భ్రాతృవత్సలత - మాతృప్రేమ-పతితపావనత్వము-నిరాడంబరత-

శరణాగతవత్సలత – ప్రతిజ్ఞా పాలనము – లోక ప్రియత్వము – శాస్త్ర ధర్మాచరణము మున్నగు సత్సంప్రదాయములు ఆనాటి ప్రజాబాహుళ్యమునకు ప్రీతి పాత్రములైనందున సౌజన్య నిధులగు మనీషులెల్లరు స్త్రీ పురుషాది విభేదములుమాని జీవిత నిష్పత్తులలో అపరమాత్ముని సంపూర్ణానుగ్రహమునకై నిత్య సంసిద్ధత జూపుచుండిరి.

శ్రీరాముని నావను దాటించినవాడు గుహుడు – జాలరి, అస్పృశ్యుడు. శబరి – మ్లేచ్ఛ వనిత. సుగ్రీవుడు వానరుడు. విభీషణుడు దైత్యుడు. ఇట్టి వారిపై ప్రేమాదరములు సువ్యక్తమొనర్చి శాశ్వత పరప్రదాతయైనందున వారందరు భక్తి ప్రపత్తులతో శ్రీరాముని వశంవదులై ఆధ్యాత్మిక ప్రచోదన శక్తిగనో, దైవ స్వరూపముగనో ఆరాధింపవచ్చును. కాని యావజ్జీవము విరోధి వర్గమందు సంక్రమించియు చివరకు దైవ సంపత్తిని ప్రశంసించు పరశురాముడు మున్నగు కొందరున్నారు – దుష్ట స్వభావులగు రాక్షసులు నున్నారు.

## మారీచుడు

ఇతడొక రాక్షసుడు. మాయల మారీచుడతడే. రావణుని బంధువు. కొంతకాలము క్రిందట నితడు రావణుని మంత్రియై వెలసెను. దురూహమగు దుష్టబుద్ధియని, ఆరితేరిన మాయావియని తెలిసిన విషయమే! విశ్వామిత్రుని యాగ సంరక్షణ కాలమున రాముని దెబ్బలు చవిచూచిన అనుభవజ్ఞుడు. ఆతడు శ్రీరామచంద్రుని ధర్మ ప్రవర్తనాది సుగుణ రంజితుడై మాయలేడి యగుటకు పూర్వము, తన సహాయ మపేక్షించి వచ్చిన రావణు ససహ్యించుకొని అతని యెదుట నిర్భయముగా రాముని గూర్చి ప్రశంసించినాడు. రావణుని నిర్బంధ ములకు గుణియగుట కంటె రామబాణమునకు ఆహుతియగుట ఉభయతారక మనుకొన్నాడు.

శ్లో॥ " రామో విగ్రహవాన్ ధర్మస్సాధుస్సత్య పరాక్రమః
రాజా సర్వస్యలోకస్య దేవానాం మఘవా నివ "

శ్రీరాముడు బలవంతుడనియు, అతని యొద్ద నుండి సీతను తెచ్చుట సూర్యుని దగ్గర నుండి కిరణములు తెచ్చుట వంటి దుష్కర కార్యమని బోధించినాడు. (రామా - ఆరణ్యకాండ)

## వాలి

తన సోదరుడగు సుగ్రీవుని క్రూరముగ హింసించి పతనమొనర్చి రాజ్యము నుండి వెడలగొట్టి ఆతని భార్యయగు రుమను చెఱపట్టినాడు. వారి దాంపత్యమునకు చేటు కలిగించినాడు. తండ్రియగు నింద్రునిచే అతనికి అందివచ్చిన త్రిభువన ప్రథిత ప్రభావమంతయు దుర్వినియోగ మొనర్చుకొని దుర్విదగ్ధుడైనాడు. రావణుని పొత్తువలన వాలి యెంత దుష్టుడైనను, అతి పాతకియైనను కావచ్చును. కాని, అతనిని ధర్మేతరరీతి నవలంబించి దురన్యాయముగ చెట్టు చాటున నుండి బాణ ప్రయోగ మొనర్చి చంపినాడని స్త్రీ సహజమైన కసిదీర రాముని దిట్టుటకు బదులు స్తోత్ర పాఠమొనర్చినది తార - సనాతనమైన ఆ పరతత్త్వముల దుద్దీప్తమైన కాంతి రేఖలతో చివికిపోయిన ఆమె హృదయ తంతువులను అంతర్లీన మొనర్చినది.

## తార

శ్లో॥ " త్వ మప్రమే యశ్చ దురాస దశ్చ
జితేంద్రియశ్చోత్తమ ధార్మికశ్చ
అక్షయ్య కీర్తిశ్చవి చక్షణస్య
క్షితి క్షమావాన్ క్షతజోపమాక్షః "

ఇందలి చివరనున్న పదము క్షతజోపమాక్షః = నెత్తురువలె నెఱ్ఱనైన కన్నులు కలవాడా యని యర్థము. ఇది రామునికి సంబోధనము. ఎఱుపైన నేత్రాంతములు గలిగి యుండుట మహాపురుష లక్షణముద్యోతించును.

గ మ ని క :— శ్రీరాము డొకేయొక బాణమున చెట్టు మాటున నుండి వాలిని సంహరించుటకు కారణమేమి? వాలికెదురుపడి రణమొనర్చువాని బలములో సగము వాలికి వచ్చునని బ్రహ్మవరమిచ్చినాడని ప్రతీతి. శ్రీమద్రామాయణ మందిది యున్నది. ఒకవేళ నతడు యుద్ధమునకే రానియెడల పదునాలుగేండ్లు దాటనిదే రాముడు పట్టణములోనికి పోవడు. సుగ్రీవునకు ధైర్యము చాలదు.

అసత్ప్రవర్తనుడగు వాలిని సంహరించి కిష్కింధా రాజ్యమునకు నిన్ను పట్టాభిషిక్తు నొనర్తునని ఆమాయకుడగు సుగ్రీవుని కభయమిచ్చినాడు రాముడు. ముఖాముఖి యుద్ధములో నొకవేళ వాలి యోటమి చెంది పారిపోయిన యెడల, కిష్కింధా నగరిలో దాగియున్న యెడల, ఎవడు పట్టుకొని అప్పజెప్పగలడు? ఒక వేళ నతడు శరణా గతుడైన యెడల నతని రక్షింపవలసి యుండును కదా! ఈ వార్త విని తన మిత్రుడు రావణుడే శరణు జొచ్చినయెడల నతనికి అభయ మియ్యవలసి యుండును కదా! రావణ వధకై మరల అవతరింపవలసి యుండును కదా! అట్టియెడ రాముని సత్యవాక్యమునకు బలహీనత కల్గి భంగము వాటిల్లునని ఆ స్థితిలో మృగముల వేటాడుట క్షత్రియోచిత ధర్మమని తన విధి నిర్ధారించి ఆపని జరిగించినాడు. రాజ్య పరిపాలనా భారము భరతున కప్పగించి అరణ్యా వ్యవహారములు తాను నిర్వర్తింతునన్నాడు. దీని వలన కూడ రాముని రాజకీయము ధర్మ విరుద్ధము కాదని నిస్సంశయముగ జెప్ప వచ్చును. ఆధ్యాత్మిక దృక్పథములో వాలికి సంభవించిన పాపములన్నియు తొలగునట్లు శిక్షా రూపమైన సంహారం బొనర్చి వానిని పరిశుద్ధునిగా నొనర్చి నాడని అంతరార్థము.

ఇ చ ట నొ క వి శే ష ము న్న ది

శ్రీరాముడు విడిచిన బాణముచే చనిపోవుచు నొకటి రెండు మాటలాడి తన కుమారుడగు నంగదుని శ్రీరామునకు పుత్ర ప్రేమతో నప్పగించుచు పిమ్మట సుగ్రీవున కప్పగించినాడు. శ్రీరామచంద్రుడు పరాత్పరుడని వాలికి తెలియును.

వాలి వాక్యము :

"ఆనయేయం తవాదేశాచ్ఛ్వేతామశ్వతరీమివ"

రామచంద్రా! నన్ను నీవు పంపిన యెడల లంకకుబోయి రావణుని మెడబట్టుకొని తెచ్చి నీ సన్నిధిని పెట్టకుందునా! ఆ దుర్మార్గుడు సీతాదేవిని సముద్రమున దాచినను - పాతాళలోకమందుంచినను, పూర్వకాలము మధుకైటభులను రాక్షసులు శ్వేతాశ్వతరోపనిషత్తును దొంగిలించి పాతాళలోకమున దాచి యుండగా శ్రీమన్మహా విష్ణువు హయగ్రీవావతారమెత్తి పాతాళలోకమున ప్రవేశించి మధుకైటభులను జంపి శ్వేతాశ్వతరోపనిషత్తును దెచ్చి బ్రహ్మదేవునకు సమర్పించిన వడువున సీత యెచ్చట నున్నను వెదకి తెచ్చి నీకర్పింపకుందునా యన్నాడు. నిజముగా వాలి అంతటి సమర్థుడే కాని విధి విధానమిట్లున్నది. ఎవరేమి సేయగలరు?

## మండోదరి

రావణుని నితాంతభోగవిలాసములకు పేరిమోల్బణతకు మధురకేంద్రమైన మండోదరి దుస్సహమైన తన భర్తృమరణమునకు కడుంగడు దురపిల్లెను.

త్రిజగద్విజేత యగు తన భర్త ఆహవరంగములో మరణించి అతని కళేబరము రక్త ప్రవాహములో మునిగిపోవు చుండగా ఘోరు ఘోరున ఏడ్చుచు అతని ప్రక్కను దుఃఖాశ్రువులతో పొర్లిపోయినది.

రావణుడు ప్రాథమిక శిక్షగా మొట్టమొదట నింద్రియ నిగ్రహమొనర్చి తపోబల సంపత్తిచే ముల్లోకములను, లోకపాలకు లందఱిని జయించినాడు. లంకా పట్టణములో నన్నికాలములందు వేద ఘోష మిన్నుముట్టెడిది. ఇపుడు కాలవైపరీత్యమున నతని యింద్రియములే తనపై పగ సాధించి దుర్మరణము పాలొనర్చినవి కదాయని గత విషయములు జింతించుచు సమాధానపర్చుకొన్నది.

సమస్తవిధ యుద్ధ నిర్వహణ దక్షుడగు తన భర్త యెక్కడ? ఆటవికు డగు మానవమాత్రుడెక్కడ? పరిహాస భాజనమగు నిట్టి దుస్సంఘటన హస్తిమశకాంతరమైనదని రావణ పరాజయము గూర్చి ఆశ్చర్య పడిపోయినది.

కాని ధనుష్పాణియై ఆ చెంతనే నిలచియున్న శ్రీరాముని దివ్య స్వరూప మును, శంఖ చక్రాది లాంఛన మయమైన శ్రీమన్నారాయణుని దివ్య సుందర విగ్రహమును సందర్శించి నంతనే మండోదరికి జ్ఞానోదయమైనది. సకల జగత్పరిత్రాణమైన ఆతని దివ్యావతార వైభవం బంతయు ఆమె కన్నులకు గట్టినట్లయ్యెను. నిర్నిద్రమైన భక్తి తాత్పర్యములతో ఆమె హృదయము ద్రవీభూతమయ్యెను. ఉపనిషత్తులందు తెల్పబడిన వేదాంత మంతయు నామెకు గరతలామలకమై యిటు నుతించినది.

శ్లో॥ వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనః
అనాది మధ్య నిధనో మహతః పరమో మహాన్ ''
( రామా – యుద్ధకాండ )

ఇందు మహాయోగీ – పరమాత్మా – సనాతనః – అనాదిమధ్య నిధనః– మహతః – పరమః మున్నగు పదములన్నియు ఉపనిష దంతర్గతములై యున్న పరతత్త్వము నభివర్ణించుచున్నవి. మండోదరి మహాపతివ్రతలలో నొక్కతె. రామునితో యుద్ధము మానుమని, సీతను రామునికిచ్చి ప్రతిమాలుకొని సంధి ప్రయత్నము లొనర్చుమని నొక్కిచెప్పినను రావణుడు వినలేదు.

పై విషయములన్నియు శాశ్వతమైన ధర్మ సంస్థాపన దృక్పథముతో రామావతారమునకు సుందర వ్యాఖ్యానములై మానవుని అంతరంగిక వికాసమును పరిస్ఫుట మొనర్పబడవలెనని వాల్మీకి మతమైయున్నది.

## విభీషణుడు

రామాయణ యుద్ధకాండలో విభీషణుడు శరణాగతుడైన సందర్భమున రాముని శపథ వాక్యముగా నీ క్రింది రీతి తెలుపబడియున్నది.

శ్లో॥ "సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ"

దీనుడు - హీనుడు - అకించనుడునగు ఏ భక్తుడైనను ఒక్కమాటు 'నే ను నీ వా డ ను' అని మొఱ పెట్టునంత మాత్రమున నేనతనికి సమస్త భూతముల నుండి అభయప్రదాన మొసగుచున్నానని, అదే తన నిత్య సత్య వ్రతమని ఉద్ఘాటించినాడు. ఈ శ్లోకము రామ చరమశ్లోకము. ఇట్లే శ్రీకృష్ణవాక్యముగా "అ భ య ం స ర్వ భూ తే భ్యో ద దా మ్యే త త్ వ్ర త ం మ మ" అని గీత యందు కూడ పరామృశించి చెప్పబడినది. ఇవి యన్నియు నవతార లక్షణములుగాక మఱియేమి?

శ్రీమద్రామాయణ మందలి ఈ ఘట్టము చాల ప్రశంసనీయమైనది. శ్రీరామచంద్రుని త్యాగ మహిమ అనన్యసామాన్యము. సర్వభూతభయ నివృత్తియే అతని ముఖ్య సంకల్పము. దేనిని తప్పినను దీని నతడు తప్పడు. విభీషణ శరణాగతి మహాదారుణమైన సంధిగ్ధావస్థ యందు అప్రయత్నముగా గడ్డు సమస్యగా రూపొందినది. ఆసమయమందట్లు జరుగుట అసంగతము.

విభీషణుడు రావణుని చెంత నుండి లంకకు సమీపముననున్న యొక నొక విజన ప్రదేశమునకు రాత్రిపూట అకాలమందు వి య న్మా ర్గ ము న వచ్చినాడు. ఆతని రాక సర్వవిధముల సంశయగ్రస్తమైనదని సీతికోవిదుడగు జాంబవంతుడు తొలి చూపులో పలికినాడు. ఆ విషయముపై తగు చర్యతీసు కొనదలచి చిలువలు పలవలుగా పెంచి తక్కుంగల వనచర యోధులందఱు విభీషణ శరణాగతిని నిరాకరించిరి. అతనిని, తనతో వచ్చిన నలుగురు మంత్రు లను దూరముగా నుంచిరి. తర్క వితర్కములతోను. న్యాయశాస్త్ర చర్చల తోను, మంత్రాంగముతో కాలహరణమైపోయెను. ఆ ప్రదేశమొక బృహత్తర ధర్మనిర్ణయాస్థాన మంటపముగా భాసిల్లెను.

విభీషణుని హృదయ పరిశుద్ధతను - సత్ప్రవర్తనను రాముడు గ్రహించి తక్కిన సుగ్రీవాదులను ఒప్పించునపుడు వారినందఱిని శాంతపఱిచి యథా నిశ్చయముగా నభయదానమొసగి చేరదీసినాడు. "యదివా రావణ స్స్వయం" అన్నాడు. ఈతడే కాదు నిజముగా సుహృద్భావముతో రావణుడే స్వయముగా వచ్చినను అభయ మియ్యక మానన్నాడు. ఆతనికి గావలసినది ఆత్మపరీక్షగాని బాహ్య చిహ్నములు కావు.

విభీషణుడు పతనావస్థలో మ్రగ్గియున్న రాక్షస వంశమును పునః ప్రతిష్ఠింపదలచి 'ధర్మమే శరణ్యమని' లోకమున కెఱిగించుటకు గాను శ్రీరామచంద్రునకు శరణార్థియైనాడు. అభయ దానము వేడుకొన్నాడు. కాని, రామ బాణమునకు వెఱచి కాదు. అది తిరుగులేనిదని తెలిసికొనియున్నాడు.

రావణునివలె శతృత్వముతో ప్రాణోత్క్రమణ మొనర్చుటకన్న రామ సన్నిధాన మందునికియే మంచిదని భక్తి భావనతో రాజ్య కాంక్ష మనము నందిడుకొని వచ్చినాడని చెప్పినను సయుక్తముగ నుండ వచ్చును.

విభీషణుడు మొదటి నుండియు రామ భక్తుడు. రావణుని గర్భమున నమృత కలశ యున్నదనియు, దాని నాగ్నేయాస్త్రముచే నెండించిన గాని రావణుడు చావడనియు మున్నగు విషయములు విభీషణుడు రామున కెఱిగించి గుట్టు చెడగొట్టినాడను భాస్కర రామాయణాదులందున్నది. కాని, వాల్మీకి రామాయణమందీ విషయము లేదు.

గమనిక :— ఇట్లే కాలనేమి వృత్తాంతము—పాతాళహోమపు కథ—అధ్యాత్మ రామాయణమందు, భాస్కర రామాయణాదుల యందు కలవు. కాని, ఇప్పటి వాల్మీకి రామాయణ మందివి లేవు.

ఇట్లే రావణునకు పది తలలు — ఇరువది చేతులు ఉన్నట్లు ఇతర రామాయణములందుండెను. కాని, శ్రీమద్రామాయణమున లేదు. దశకంఠాది నామములకు ప్రత్యేక వ్యాఖ్యానములున్నవి.

దీనిని బట్టి దశకంఠ, సహస్రకంఠ, విచిత్ర రామాయణాదులు కల్పితములని విజ్ఞుల యభిప్రాయము.

# ప్రతాపవంతుడు రావణుడు

రావణుడు విశిష్టమైన పులస్త్య బ్రహ్మవంశ సంభూతుడు. శివపూజా ధురంధరుడగు మహాభక్తుడు. వేదవేదాంగ పారంగతుడు. (అనార్యులైన రావణాసురుడును - తత్కాంగల లంకలోని రాక్షసులును నిరంతర వేద పారాయణము జరుపుచుండిరని వాల్మీకి మహర్షి రామాయణమున తెల్పియున్నాడు.)

అతడు అతికాయ, మహాకాయ, దేవాంతక, నరాంతకాది భయంకర మహావీరులతో ప్రపంచము నుత్తూత లూగించి స్వేచ్ఛగా వీర విహారము సల్పినాడు. అష్టదిక్పాలకులను చతుర్దశ భువనములను అదుపులోనుంచుకొని నిర్దాక్షిణ్యముగ శాసించినాడు. భీకరమైన ప్రతాపముతో సర్వసమర్థుడైన ప్రభువు. ఆతని భుజ దర్పమునకు కైలాసము దద్దరిల్లినది.

త్రేతాయుగమున రావణబ్రహ్మ తన పుష్పక విమానములో భూమండల మందంతటను గాక అంతరిక్షయానము గూడ జరిపి దిగ్విజయయాత్ర సాగించి నట్లు వ ్మీకి మహర్షి ఉత్తరకాండమున తెలిపియున్నాడు.

సూర్యమండలముపై యుద్ధమునకు వెళ్లినపుడు ఆ మార్తాండుని మంత్రులగు 'దండి' మున్నగు వారితో సంభాషించినట్లు చెప్పబడినది. కాని, సోమలోకముపై దండయాత్ర సాగించునపుడు మాత్రము చంద్రుని వలన కలిగిన విపరీతమైన శైత్య బాధను సహింపజాలక చాల బాధపడి తీవ్ర మైన కోపావేశముతో చంద్రునిపై బాణము సంధించినాడని, ఆసమయములో బ్రహ్మదేవుడు వచ్చి అతనిని వారించి వరము నొసగినాడని రామాయణములో వాల్మీకి రచన వలన తెలియుచున్నది.

ఏమైననేమి? "వినాశకాలే విపరీత బుద్ధి". శ్రీ రామ చంద్ర మూర్తి భారతదేశమునకు పరమ పూజ్యుడు - సత్యసంధుడు - ఏకపత్నీ వ్రతుడు - మహాశూరుడు. అతని ధర్మపత్నియు నట్టిదియే.

సీతా వ్యామోహమున రావణుని అంతిమ ఘట్టము ప్రపంచమునకు సాక్షీ భూతమైనది. మంగళప్రదమైన - నిసర్గ మధురమైన భారతీయ దాంపత్య జీవితమునకు గొడ్డలి పెట్టుగా అఘాతము కల్గించిన రావణుని జీవితము స్త్రీ లౌల్యము వలన దావాగ్నివలె ముప్పు తెచ్చినది. ప్రపంచమునకు గుణపాఠమైనది. ఈ విషయమును మహిమాన్వితముగా దిద్ది తీర్చి భారత మహిళల కొక ప్రత్యేక ప్రతిపత్తి ప్రసాదించినాడు వాల్మీకి.

వేదవతి - పార్వతి - నందీశ్వరుడు - రంభ — పుంజికస్థల మున్నగు వారి శాప వాక్కులు, బ్రహ్మదేవుని వాక్కులు, తెనని పరాజయమునకు అంతరంగిక హేతువులై చిచ్చర పిడుగులైనవి. పైగా తన సోదరుడు విభీషణుడు బాహిరముగ కారణ భూతుడైనాడు.

కంసుడు, దుర్యోధనుడు, కీచకుడు మున్నగు కామ క్రోధాది దమన నీతి పరాయణుల కోవకు రావణుడు చెందియున్నను వారి యందు ద్యోతింపని సుగుణ సంపదలు రావణుని యందున్నవి.

తెలిసిన మూర్ఖుడు రావణుడు, తక్కిన వారు తెలియని మూర్ఖులని చెప్పబడుచున్నారు. శ్రీరాముని చేతిలో దన ప్రాణములు పోవుటకు సంసిద్ధపడి ఎవరెన్ని విధముల హితోపదేశ మొనర్చినను పెడచెవిని పెట్టినాడు. మొండి పట్టుదలతో - ఆత్మీయులందరు హతమైనారను ఆవేశముతో చివరి వరకు పోరాడినాడు.

రావణ సంహార కృత్యము శ్రీరామునకొక గడ్డు సమస్య యైపోయినది. 'యశో వా మృత్యుర్వా' అన్న స్థితిలో రాముడు నిస్పృహుడై వెలవెల పోయినాడు. కాని, దండకారణ్యమున 'ఖరు' డను రాక్షసునితో పోరునపుడు పొందిన బాధ కంటె నిది మించి యుండదు. కాని, ఈ దృశ్యము గాంచి శ్రీరాముని శ్రేయోభిలాషులైన మహర్షులు, దేవతలు నిర్విణ్ణులై పోయిరి. కథ అడ్డముగా తిరిగి పోవునా యని నిరాశులై పోయిరి.

ఇంద్రదత్తమైన మహాశక్తియను దివ్యాయుధ సహాయమున, నతడు మాతలిచే నంపిన రథోత్తమము నధిరోహించి అగస్త్యు డుపదేశించిన ఆదిత్య హృదయము జపించి బ్రహ్మాస్త్రము నభిమంత్రించి రావణుని పై ప్రయోగింపగా నది హుటాహుటినిపోయి రావణ వక్షఃస్థలము భేదించి నేల గూల్చెను.

దేవతలు పుష్పవృష్టి కురిసిరి. మహర్షులు మంగళాశీర్వచన మొనర్చిరి. దిక్కులు ప్రసన్నత దాల్చినవి. భూకంపము ఆగిపోయెను. సూర్యభగవానుడు తేజరిల్లెను. వాయుదేవుడు నిట్టూర్పు విడిచినాడు. హతశేషులగు రాక్షసులు బ్రతుకు జీవుడాయని పలాయనమైపోయిరి. పండు వంటి రావణజీవితము, నిండుసంసారము, సీతాపహరణమున దుఃఖాంతముగా బూడిద పాలైనవి.

# రా మ రా జ్య ము

మన భారతదేశ మందలి ప్రజావాహిని నాడును, నేడును గౌరవార్హమైన రామ రాజ్యసౌఖ్యాభి వృద్ధిని సమధి కోత్సాహముతో నాకాంక్షించినది. అభినందించినది. దీనిని బడయుటకై గాంధీ మహాత్ముడు బంగారు కలలు గాంచినాడు. ఏలయన, రామ రాజ్యములో అంత విశిష్టమైన స్వర్గప్రభావము పరిఢవిల్లియున్నది. అరణ్య వాసానంతరము శ్రీరాముడు సీతా సమేతుడై అయోధ్యకేతెంచి రాజ్య పాలనము సుష్టుగా నొనర్చినందున ఆ రాజ్యము రామ రాజ్యమని పేరుగాంచెను.

పూర్వకాలమున మన భారతావనిలో శ్రీ రా మ ప్ర భ యెంతగానో పరిఢవిల్లి శోభాయ మానముగ వెలుగొందినది. నేట కాలమందలి అనేక పుణ్యస్థలములు, తీర్థయాత్రాదికములు, మహత్తర దేవాలయములు, ప్రాచీన శిధిల వైభవములు రే పు మా పు లు మనము సందర్శించి గ్రహింపగల్గు చున్నాము. రా మ రా జ్య మనగా — సౌశీల్య సౌజన్యములతో గూడిన, దయా సత్య ధర్మబద్ధమైన ప్రజా రాజ్యము. అది యెట్లుండ వలెనో మహా మనస్వియగు భరతుని యువరాజుగ నొనర్చి నంది గ్రామములో తన మంగళ మయ చరణ చిహ్నములుగా పాదుక లొసగు సందర్భమున రాముడే తెలియ జేసెను. దాని యందు అధికార నిరంకుశత్వపు ఛాయలేమాత్రము పొడసూప రాదు. అది సకల దేశీయ సార్వకాలిక ప్రజా సముదాయమునకు అత్యంతావశ్యకమైన యొకానొక సత్య స్వరూపమును, దానికి మించిన మహత్తర పౌరాణిక దీప్తిని హృదయంగమ మొనర్చు దివ్యతేజస్సు.

రా ము ని కం టె బూర్వులు ధర్మార్థముగా వినియోగింప నొసంగిన శిలాశాసనములపై తారుమారుగ వ్యవహరించుట కధికారము లేదని భరతుని కాజ్ఞాపించెను.

ధర్మైక దృక్పథము తోడను, అధికార వ్యామోహమునందుదాసీన భావముతోడను శ్రీరామ భరతులు ప్రదర్శించిన రీతులు విశ్వశాంతిని నెలకొల్పు మధుర సందేశములు పవిత్రములైనవి.

భరతుడు తనకు అయాచితముగ లభించిన సామ్రాజ్య లక్ష్మిని రాజ్య పాలన భారమును అంగీకరింపక చిత్రకూటమునకు వెళ్లి రామునితో నిట్లనెను. ఇక్ష్వాకు వంశజుడనగు నేను అన్నగారి రాజ్యము నపహరింతునాయనెను. తమ్ముడా! నేనును ఇక్ష్వాకు వంశస్థుడనే కనుక చరమ దశలోనున్న జనక పాదుని వాగ్దానము చెల్లింపక అసత్యవాది నగుదునాయని, అపాకృత రాజ్యుడ నైతినిసుమా యనెను. రాముడడవులకేగిన పిమ్మట నతనివలె నార చీరలతో గార్హస్థ్య ధర్మమును మాత్రము స్వీకరించి రామునికి బదులుగ రాజకార్యములు భరతుడు నిర్వర్తించెను. ఇట్టివన్నియు మానవ శరీరమును ధరించిన త్యాగములు.

శ్రీరాముని పరిపాలనలో సకల పౌర జానపద ప్రజా సముదాయము పరస్పర విరుద్ధములుమాని విశ్వమానవ సౌభ్రాతృమును వెలార్చెడు గౌరవ ప్రదమైన సుగుణ సంపత్తితో ఏకైక కుటుంబముగా ఆ సముజ్జ్వల లక్ష్య పథములో దమ జీవిత రథమును కలకాలము వెలుగు బాటలో నడిపించిరి. ప్రజలందఱు ఆశ్చర్య సంతోషములతో ఉండుట దగిన దీక్షాకంకణము కట్టు కొని సంసార గాఢాంధకారములో ఆశాజ్యోతులు వెలిగించిరి. సహృదయు లైన ప్రజలందఱకు ఘనవిజయము లభించినది. "యథా రాజా తథా ప్రజాః" అనునట్లుగాక "యథా ప్రజాః తథా రాజా" అని చెప్పబడి నది. రామ రాజ్యములో అల్ప సంఖ్యాక రక్షణ మంచు రాజ్యాంగ సూత్ర ములు సార్వజనీన సూత్రములుగా గౌరవస్థాయి నందుకొనెను. రామరాజ్య వైభవము వాల్మీకి యిట్లు రేఖా మాత్రముగ ప్రశంసించెను.

శ్లో॥ "సర్వం ముదితమే వాసీత్ సర్వో ధర్మపరో భవత్
రామమే వాను పశ్యంతో నాభ్య హింసన్ పరస్పరమ్"

ధర్మము, సత్యము, తపస్సు, ఇంద్రియ నిగ్రహము, హృదయ పారిశుధ్యము మున్నగు మానవధర్మ నిర్వహణమునకు రామరాజ్యములో నద్భుతగుణులు వారెవ్వరుందురు?

ఇచట ధర్మమనగా నేమి? ధర్మమను నుత్కృష్ట నామము పరమేశ్వరునకు కలదు. అతడు పాపరహితుడు – ధర్మ స్వరూపుడు – అతనికి 'సత్య' మను పేరుకూడ కలదు. ధర్మమే సత్యము, సత్యమే ధర్మము. ధర్మము ఎంత బలవంతునైన ఓడింప గలదు.

" ధా ర ణా ద్ధ ర్మ మి త్యా హు ర్ధ ర్మే ణ వి ధృ తాః ప్ర జాః "

ధారణ మొనర్చుట వలన ధర్మము అని చెప్పబడుచున్నది. ధర్మ మూలమున సమస్త ప్రజలు స్వరూప స్థితులగుదురు.

శ్రీరాముడు తన పరిపాలనలో పాల్య పాలక సమానత్వమును, ప్రజా స్వామ్యము యొక్క జ్ఞాన విజ్ఞానములు పెంపొందించుటయందు పౌరజీవితము చైతన్య యుక్తముగ గుర్తించి వారి శ్రేయోభివృద్ధికి తోడ్పడుట యందు అనివార్యముగ చెలరేగిన సంక్షోభములు – ఘాతుక చర్యలు భూస్థాపిత మొనర్చి చక్కార్చుట యందు గౌరవప్రదమైన ప్రధాన కర్తవ్యము లక్ష్యమందుంచు కొని ఉచితమైన సానుభూతి నెఱపుట–ఇట్టివన్నియు రామరాజ్య చిహ్నములు.

శ్రీరాముడు పదినొకొండువేల సంవత్సరములు ప్రజేచ్ఛ చొప్పున రాజ్యపరిపాలనమొనర్చి వేదవిహితమైన చాతుర్వర్ణ్య వ్యవస్థను క్రమబద్ధముగ నడిపించి, అనేక అశ్వమేధములు – నానావిధ యజ్ఞములు నొనర్చి రాజ వంశమునురాణింపజేసి జగమంతయు రామమయ మొనర్చెను.

—()—

# ఫలశ్రుతి

శ్లో॥ " లోకాభి రామం రణరంగ ధీరం
రాజీవనేత్రం రఘువంశ నాథం
కారుణ్య రూపం కరుణాకరం తం
శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే "
( శ్రీరామరక్షా స్తోత్రము )

దురవగాహమైన భగవత్తత్త్వము నెంత తెల్పినను అసమగ్రము. అల్పీయము. అదెప్పుడును నవనవాయ మానము. భగవంతుడు నిత్య నూతనుడు కదా! అనంతమైన వియన్మార్గములో తుదిదాక నేపక్షియైన నెగుఱ జాలునా? జలచరము ఎంతగా సాహసించినను మహాసముద్రపు టావలియొడ్డు వఱకు నీదగలదా! ఎట్లో కొంత ప్రయత్నము మాత్రము జఱుప యత్నింప దగి యుండునేమో? అది తప్పిదము కాదు. సాగర గర్భములో మహా పర్వతములు మునిగిపోవుచుండగా గులక రాళ్ల గతియేమి?

అనంత విశ్వప్రపంచ నిర్మాత — పరమైశ్వర్వశాలి—బ్రహ్మాండరక్షకుడు నగు భగవానుని సంఖ్యాతీతమైన గుణగణములు, లీలలు, చరిత్రములు సమగ్ర మగు స్తోత్ర వాక్యములచే గానమొనర్ప నెవరి తరము? నందనోద్యాన మందలి వివిధ పుష్పపరిమళ శోభనెంతకని యాఘ్రాణింప గలడు?

శ్లో॥ " ఆపదా మపహర్తారం దాతారాం సర్వసంపదాం
లోకాభి రామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ "

శ్లో॥ " పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్
వణిగ్జనః పణ్యఫలత్త్వ మీయాత్
జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్ "

వేదములోనొక భాగమగు నీ రామాయణమును బఠించువాడు బ్రాహ్మణుడైనచో విద్యావంతుడగును. క్షత్రియుడైనచో చక్రవర్తియగును. వైశ్యుడైనచో వర్తక లాభమందును. శూద్రుడైన గౌరవింపబడును. అనగా రామాయణము సమస్త పాపములను బోగొట్టుటయెగాక ధర్మార్థ కామములను వృద్ధి నొందించునని యర్థము.

" సర్వేభవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః
సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చి ద్దుఃఖ భాగ్భవేత్ "

" ఓమ్ ఇత్యేత దక్షరం పరంబ్రహ్మ, తదేవో పాసితవ్యమ్ "

ఓమ్ తత్సత్



# శ్రీమద్రామాయణ సుభాషితములు

లోకారాధ్యమైన వాల్మీకి రామాయణమందలి జ్ఞాతవ్యమైన కొన్ని రోచక విషయములు మనకొక మానసిక వైరాగ్యమును అలవరచునట్టి జీవితానుభూతులను, త్యాగశీలతను బోధించి భారతీయ సంస్కృతిని ప్రత్యక్షమొనర్చును. అనర్ఘరత్నములుగాఏర్చి అట్టివన్నియు అధోద్దిష్టమొనర్పబడినవి.

1. "ఆహుః సత్యం హి పరమం ధర్మం ధర్మవిదోజనాః"

ధర్మజ్ఞులగు జనులు సత్యమునే సర్వోత్కృష్ట ధర్మమని చెప్పుదురు.

2. "దుర్లభం హి సదా సుఖం"

మానవుడు సర్వకాలము సౌఖ్యముతో తులతూగుట దుర్లభము.

3. నాతంత్రీ విద్యతే వీణా నాచక్రో వర్తతే రథః
నాపతిః సుఖమేధేత యా స్యాదపి శతాత్మజా" (అయోధ్యా 39-29)

తంతువులులేని వీణ ఎందుకును పనికిరాదు. చక్రములులేని రథము వ్యర్థము, నూర్గురు బిడ్డలున్నను భర్తలేని భార్య సుఖింపజాలదు.

4. "శోకోనాశయతే ధర్మం శోకోనాశయతే శ్రుతం
శోకో నాశయతే సర్వం నాస్తి శోకసమోరిపుః" (అయోధ్యా62-15)

దుఃఖము ధర్మహాని యొనర్చును. పఠనలేఖనాది విద్యలను నష్టపఱచును. సమస్తమును నశింపజేయును. దుఃఖతుల్యమైన శత్రువు వేరొకటిలేదు.

5 "యదన్నః పురుషోభవతి తదన్నాస్తస్య దేవతాః" అయో॥ 102-30

మనుష్యుడు స్వయముగా భుజింపనుపయోగించు నన్నమే దేవతలకు కూడ ప్రీతికరము.

6. "కులీన మకులీనం వా వీరం పురుషమానినం
చారిత్రమేవ వ్యాఖ్యాతి శుచింవా యదివాశుచిమ్"

మనుష్యుడు గొప్పకులమునకు జెందినవాడా లేడా - వీరుడా, డంబాచారియా, పవిత్రుడా, అపవిత్రుడా అనునది అతని నడవడి(లోని చరిత్రాంశముల)వలననే ప్రకటితమగుచుండును.

7. "ధర్మాదర్థం ప్రభవతి ధర్మాత్ ప్రభవతే సుఖం
ధర్మేణలభతే సర్వం ధర్మసారమిదంజగత్" (అరణ్య 9.30)

ధర్మముచేతనే అర్థము - ధర్మముచేతనే సుఖము - ధర్మము వలన మనుష్యునకు సర్వము లభించును. జగమంతయు ధర్మసారమే.

8. "కర్మ లోకవిరుద్ధం తు కుర్వాణం క్షణ దాచర
తీక్ష్ణం సర్వజనోహంతి సర్పం దుష్టమి వాగతమ్" (అరణ్య 29.4)

ఓరక్కసుడా(ఖర!) లోకమునకు హానికరమైన కర్మమొనర్చు క్రూరుడెవడైనసరే - వానిరాకను దుష్ట సర్పము వచ్చుచున్నట్లుగా భావించి లోకులతని జంపివేయుదురు. (ఇది ఖరునిగూర్చిన రాముని వాక్యము)

9. "నచిరాత్ ప్రాప్యతే లోకే పాపానాం కర్మణాం ఫలం
సవిషాణా మివాన్నానాం భుక్తానాం క్షణ దా చర"(అరణ్య 29.9)

ఓ రక్కసుడా ! విషమిళితమై తినివేయబడిన అన్నమువలె పాపకర్మకు ఫలితము త్వరితముగా దాపురించును (ఇది ఖరుడను రాక్షసునిగూర్చి రాముని వచనము)

10. "పరదారాభిమర్శాత్తు నాన్యత్పాపతరం మహత్"(అరణ్య 38.30)

ఇతర వనితలతో ననుచితసంబంధముకంటె ఘోరపాతకమింకొకటిలేదు.

11. "సభారంస్సౌమ్యభర్తవ్యో యోనరం నావసాదయేత్
తదన్నమపి భోక్తవ్యం జీర్యతే యదనామయమ్"
(అరణ్య 50.17)

ఓ సౌమ్యుడా ! మనుష్యుడు తాను మోయగల్గు బరువును మాత్రమే మోయునెడల కష్టముండదు. రోగోత్పత్తికి హేతువుకానియట్లుగా జీర్ణమగు నన్నము మాత్రమే భుజింపవలయును.

12. "యత్కృత్వాన భవేద్ధర్మోనకీర్తిర్న యశోభువి
శరీరస్య భవేత్ ఖేదః కస్తత్కర్మ సమాచరేత్" (అరణ్య 50-18)

ఏపనులు చేయుటవలన ధర్మముగాని, కీర్తిగాని, చిరస్థాయియైన యశస్సుగాని లభింపక మీదుమిక్కిలి శరీరమునకు దుఃఖహేతువో అపనులు ఎవడైన చేయునా ? (చేయడు అని అర్థము)

13. "దుఃఖితః సుఖితోవాపి సఖ్యుర్నిత్యం సఖాగతిః"

దుఃఖమందుగాని, సుఖమందుగాని తనమిత్రుడైనవాడే సహాయమొనర్చును.

14. "అర్థినాముపపన్నానాం పూర్వం చాప్యుపకారిణాం
ఆశాం సంశ్రుత్యయోహంతి స లోకే పురుషాధమః"
(కిష్కింధా 30-71)

తనయొద్దకు వచ్చి యాచించినవారిని, పూర్వము తనకు లభించిన యుపకారము స్మరించి వచ్చిన వ్యక్తులను (కాపాడుటకు) మాటయిచ్చి యెవడు చంపివేయునో వాడు ప్రపంచమునందందఱికంటె నీచుడు.

15. "నవిషాదే మనః కార్యం విషాదో దోషవత్తరః
విషాదోహంతి పురుషం బాలం క్రుద్ధ ఇవోరగః"
(కిష్కింధా 64-11)

మనస్సున దుఃఖముంచుకొనరాదు. దానియందధిక దోషమున్నది కోపించిన సర్పము పిల్లలను ఘాతపర్చుటవంటిది.

16. "ధిగస్తు పరవశ్యతామ్" (సుందర॥ 25 20)

పరాధీనమైన బ్రతుకు నిందనీయము. ఛీ-ఛీ-

17. దృశ్యమానే భవేత్ప్రీతిః సౌహృదం నాస్త్యదృశ్యతః
(సుందర॥ 26-49)

ఏదైననొకటి కంటియెదుట కనిపించుచున్నపుడు దానిపై వ్యామోహము కలుగుట తప్పదు అది దూరమైనయెడల దానితోసాహార్దము తెగిపోవును.

18. "యథాకాష్ఠంచ కాష్ఠంచ సమయే తాం మహోదధౌ
సమేత్యచవ్యపేయాతాం తద్వత్ భూత సమాగమమ్"
(అయోధ్యా 105-26)

ప్రపంచములో జీవుల పరస్పర సంబంధమెట్టిదనగా :- నదీప్రవాహ వేగములో నచ్చటచ్చట భిన్నభిన్నస్థలములనుండి పడిపోయిన పుడకలు, ముందువెనుకలుగా దీర్ఘప్రయాణము సాగించి కొంతకాలము కలిసియుండియు తిరిగి విడిపోవుచుండును. తుదికన్నియు మహాసముద్రములో నేమూలనో చేరి పోవును. వానికి సముద్రము గమ్యస్థానమైపోవును. జీవుల స్థితిగతులు అట్టివియే యగును. (దశరథుని మరణవార్త విని రాముని సానుభూతి వచనము)

19. "నసామ రక్షస్సు గుణాయ కల్పతే
నదాన మర్థో పచితేషు యుజ్యతే" (సుందర. 41.3)

క్రూర మనుష్యునియెడ లోకనీతి ప్రభావము పనిచేయదు. అట్లే ధన సంపన్నుల యెడల దానధర్మాదులు ఉపయోగపడవు.

20. "కోపం నగచ్ఛంతిహి సత్యవంతః"

శాంతమూర్తులు క్రోధింపరు.

21. "నిరుత్సాహస్య దీనస్య శోకపర్యాకులాత్మనః
సర్వార్థావ్యపసీదంతి వ్యవసం చాధిగచ్ఛతి"

ఉత్సాహములేనివాడు, దరిద్రుడు, శోకవ్యాకులవ్యక్తి, వీరికి విశ్వమంతయు వికటముగనే కనిపించును ఇట్టివారు స్వయముగా కష్టములపాలౌదురు.

22. "జానామి శీలం జ్ఞాతీనాం సర్వలోకేషు రాక్షస ;
హృష్యంతి వ్యసనేష్వేతే జ్ఞాతీనాం జ్ఞాతయః సదా"(యుద్ధ16-3)

రాక్షసులారా ! ప్రపంచమందంతటను అన్నదమ్ములయు, దాయాదుల యొక్కయు స్వభావము నేనెఱుంగుదును. జ్ఞాతి యెప్పుడును తన దాయాదికి సంభవించు కష్టకాలమందు సంతోషముతో మురియుచుందును. (విభీషణుని గూర్చి రావణుని వాక్యము)

23. "ఆకారశ్ఛాద్యమానోపి నశక్యో వినిగూహితుమ్
బలాద్ధి వివృణోత్యేవ భావమంతర్గతం నృణామ్"

మనుష్యుడు ముసుగు వేసికొని మూలదాగియున్నను౦డగలడు. కాని అతడు తన మనస్సునందుత్పన్నమైన భావము బలాత్కరించుచుండగా దానిని బయటపెట్టక యెట్లును దాచుకొని యుండలేడు.

24. ''గర్జంతి నవృథా శూరా నిర్జలా ఇవ తోయదాః''

నీరులేనిచో వర్షింపని గొడ్డుమేఘమువలె శౌర్యవంతుడైనవాడు వదరుబోతు మాటలాడడు.

25. ''పరద్రవ్యాప హరణం పరదారాభిమర్శనం
సుహృదామతి శంకాచ త్రయోదోషాః క్షయావహాః''

ఇతరులసొత్తు నపహరించుట, పరస్త్రీలతో అనుచితసంబంధము, సత్పురుషులయందనుమానదృష్టి ఈ మూడు దోషములు మనుష్యుని వినాశమొనర్చును.

26. "నహి ప్రతిజ్ఞాం కుర్వంతి వితథాం సత్యవాదినః
లక్షణం హి మహత్వస్య ప్రతిజ్ఞా పరిపాలనమ్"

సత్యవాక్యనిరతుడు అబద్ధపు(గొరడీ) ప్రతిజ్ఞలు చేయడు. ప్రతిజ్ఞాపాలనమే అతని మహత్త్వమునకు లక్షణము.

27. "పతివ్రతానాం నాకస్మాత్ పతంత్యశ్రూణి భూతలే"

పవిత్రలగు స్త్రీల కన్నీరు నేలపైబడుట ఏదేనొక అనర్థహేతువు.

28. ''తపోహి పరమశ్శ్రేయః సమ్మోహ మితరస్సుఖమ్''

తపస్సు (కష్టసహిష్ణుత) మాత్రమే అత్యధికమైన శ్రేయోమార్గము అది. వినా ఇతరసుఖములు బుద్ధిని సమ్మోహపఱచుటకే కల్పించుకొనబడినవి.

# తప్పు ఒప్పుల పట్టిక :

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 3 | 1 | అవాఙ్మానస | అవాఙ్మానస |
| 11 | 21 | అన్వేషు | అన్యేషు |
| 13 | 2 | దేవ | జీవ |
| 13 | 5 | సాంప్రదాయము | సంప్రదాయము |
| 13 | 9 | స్వచ్ఛదమైన | స్వచ్ఛందమైన |
| 13 | 10 | మొనర్చుకొనును | మొనర్చుకొనుచు |
| 13 | 16 | షృతులు | స్మృతులు |
| 14 | 3 | మూర్తివంతము | మూర్తిమంతము |
| 14 | 18 | బ్రహ్మస్మి | బ్రహ్మాస్మి |
| 15 | 13 | వధాపి | తథాపి |
| 15 | 25 | వలగాని | వలగొని |
| 16 | 1 | అంతరంగిక | అంతరంగిక |
| 16 | 3 | సత్సాంప్రదాయ | సత్సంప్రదాయ |
| 16 | 6 | అనూచార | అనూచాన |
| 16 | 17 | శాండిల | శాండిల్య |
| 16 | 19 | సాంప్రదాయము | సంప్రదాయము |
| 17 | 13 | విథగమునే | విధముగనే |
| 23 | 12 | ఆ సురికమైన | అనురికమైన |
| 24 | 14 | భాదలు | బాధలు |
| 24 | 15 | శ్రీయః | శ్రియః |
| 25 | 3 | ఖోజ | భోజ |
| 25 | 15 | పరినిష్టత | పరినిష్ఠత |
| 26 | 6 | ఘార్గము | మార్గము |
| 27 | 9 | పర్యాప్తి | వ్యాప్తి |
| 27 | 11 | ఛందోపరి | ఛందఃపరి |
| 27 | 18 | పరిపించుచు | పరితపించుచు |
| 28 | 1 | త్వామగమ | త్వమగమః |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 28 | 4 | ఛందోమయ | చ్ఛందోమయ |
| 30 | 8 | సార్వత | సారస్వత |
| 30 | 21 | తపశ్సబ్ధము | తపశ్శబ్దము |
| 31 | 20 | దివ్వ | దివ్య |
| 33 | 14 | సంస్కతి | సంస్కృతి |
| 37 | 12 | సధిక | నధిక |
| 37 | 16 | తిపాదకములు | ప్రతిపాదకములు |
| 37 | 24 | స్రోత | స్రోతము |
| 39 | 20 | జన్మించి | జన్మించిన |
| 40 | 9 | నుత్కృష్ట | నుత్కృష్ట |
| 40 | 21 | నాదస్య | నాదస్య |
| 42 | 16 | నిషయము | విషయము |
| 42 | 16 | లబ్ధ | లబ్ధ |
| 44 | 9 | విశ్వనాదా | విశ్వనాధా |
| 45 | 21 | స్ఫురద్రసః | స్ఫురద్రసః |
| 46 | 16 | పరినిష్టిత | పరినిష్ఠిత |
| 46 | 18 | మిశ్రమ | విశ్రమ |
| 50 | 15 | స్వాదిష్ట | స్వాధిష్ఠాన |
| 50 | 16 | నహస్రారము | సహస్రారము |
| 52 | 14 | ఉపజ్ఞశాలి | ఉపజ్ఞాశాలి |
| 52 | 22 | ఆవోదికుక్క | అవోదికుక్క |
| 53 | 18 | స్వాదిష్ఠ | స్వాధిష్ఠాన |
| 58 | 12 | యాదష్ట | యాదృష్ట |
| 58 | 14 | మాలురు | మారులు |
| 59 | 15 | వశ్యంతీ | పశ్యంతీ |
| 60 | 22 | పెరవుల | పెదవుల |
| 63 | 8 | సిస్తరింప | విస్తరింప |
| 71 | 6 | కర్మనః | కర్మనః |
| 78 | 1 | ఆర్య | అర్య |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 79 | 2 | కోహెూ్య్యష | కోహ్యేష |
| 79 | 13 | జ్యోతిష్వదార్ధము | జ్యోతిఃపదార్ధము |
| 81 | 15 | శ్రమ | శమ |
| 81 | 19 | రాయభారులు | రాయబారులు |
| 84 | 19 | కన్మ | కన్య |
| 84 | 22 | పరస్త్రి | పరస్త్రీ |
| 88 | 17 | కాస్యపుడు | కాశ్యపుడు |
| 89 | 22 | గుణియగు | గుణియగు |
| 89 | 23 | సాదు | సాధు |
| 90 | 18 | కేర్తిశ్చ | కీర్తిశ్చ |
| 91 | 16 | అరణ్యా | అరణ్య |
| 96 | 12 | యూణము | యానము |
| 96 | 21 | బుద్ధి | బుద్ధిః |
| 96 | 23 | మహాసూరుడు | మహాశూరుడు |
| 97 | 8 | అంతరంగిక | అంతరంగిక |
| 102 | 16 | పరిమశ | పరిమళ |
| 102 | 17 | దాతారాం | దాతారం |

TIRUPATI.
48858

*Ramayana Saraswatha Darsanamu*

**A. APPAYYA** **Rs. 35-00**

# అల్లంసెట్టి అప్పయ్య



14-10-1900 — 6-7-1970

పొందూరు, శ్రీకాకుళం జిల్లా

**వృత్తి** : సన్నఖద్దరు నేత, చీర అంచులు డిజైన్ చేయడంలోను, జమీందారీ పనిలోనూ ప్రావీణ్యం.

**ప్రవృత్తి** : గ్రంథపఠనం, గ్రంథరచన, పండిత, కవిమిత్రులతో గోష్ఠి

**పాండిత్యం** : తెలుగు, సంస్కృతాలలో, హిందీలో ప్రవేశం

**బిరుదములు** : ఆంధ్ర భారతి తీర్థ - విజయనగరంవారిచే "కవితా వినోద" (25-5-1929), "కవితా కోవిద" (31-1-32, [illegible] మహారాజా వారి పట్టాభిషేక సందర్భమున), "సాహిత్యభూషణ" 1964.

## ముద్రిత గ్రంథములు :

| | | | |
|---|---|---|---|
| కొండకామేశ్వర శతకము | 1925 | యోగానందము | 1939 |
| మదనసాయకము(నాటకం) | 1925 | త్రిపుర విజయము(నాటకం) | 1940 |
| ఈశ్వర శతకము | 1930 | ఈశ్వరార్పణము | 1955 |
| కావ్యామృతము | 1931 | సౌభాగ్యలక్ష్మి స్తవరాజము | 1963 |

## అముద్రిత గ్రంథములు :

| రచనాకాలం (1935-1940) | రచనాకాలం (1960-1965) |
|---|---|
| దుష్టసహవాసము (నాటకం) | విజ్ఞానసారోద్ధారము |
| అన్నపూర్ణ (చారిత్రాత్మక నాటకం) | సంస్కృతాంధ్ర విజ్ఞానతరంగిణి |
| రసికజనమనోభిరామ విమర్శ | గీతాయాత్ర |
| తంతుకారకసంజ్ఞావళి (వృత్తిపదకోశం) | భారత భారతి |

**ఇతర రచనలు** : ప్రజామిత్ర, మాతృసేవ, త్రిలింగ, ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, సమదర్శిని, భారతి పత్రికలలో కథలు, వ్యాసాలు, పద్యరచనలు